

# నిజమైన వెలుగు


## యోహాను సువార్త ఆధారిత గ్రంథం

నిజమైన వెలుగు ఉండెను;
అది లోకములోనికి వచ్చుచు
ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది.
యోహాను 1:9

సహో॥ డా॥ బి. విమలా రెడ్డి

# నిజమైన వెలుగు

## యోహాను సువార్త ఆధారిత గ్రంథం



నిజమైన వెలుగు ఉండెను;
అది లోకములోనికి వచ్చుచు
ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది.
యోహాను 1:9

సహో॥ డా॥ బి. విమలా రెడ్డి

# ప్రార్థన

నిజమైన వెలుగైన యేసయ్యా!
అంధకారములో మగ్గుతున్న నా జీవితాన్ని
నీ వెలుగులోనికి నడిపించి ఇతరులకు వెలుగై యుండునట్లు
నన్ను బహుగా ఆశీర్వదిస్తున్నందుకు నీకు వేలాది వందనములు.
నాలాటి అనేకులు ఈ పుస్తకము ద్వారా మీరు
నేర్పించబోవుచున్న సత్యములను గ్రహించి
ధన్యులు గావించబడాలను నా కోరికను తీర్చమని ప్రార్థిస్తున్నాను.
ఈ పుస్తకము అచ్చువేయబడు వరకు
ఉన్న అనేక కార్యములలో నాకు సహాయపడబోవుచున్న
విశ్వాసులందరినీ బహుగా దీవిస్తారని నమ్ముచు
మీకు స్తుతులర్పిస్తున్నాను.
నాకు అనుక్షణము తోడై ఉండి నడిపించబోతున్న
పరిశుద్ధాత్మ దేవునికి వందనములు చెల్లిస్తూ
యేసుక్రీస్తు నామమున వేడుకొనుచున్నాను
తండ్రీ, ఆమేన్!



# అంకితం



నిజమైన వెలుగైయున్న యేసుక్రీస్తును గుర్తించి
ఆయన వెలుగులో నడుస్తున్న విశ్వాసులందరికీ...

# ముందుమాట



ప్రభువైన యేసుక్రీస్తు సాటిలేని దేవుడు. నిత్యుడు. ఆ నిత్యుడైన దేవుడు మానవుని పాప పతనమును బట్టి పరలోకాన్ని విడిచిపెట్టి దేవత్వానికి అదనంగా మానవత్వాన్ని ధరించి పాప రహితుడుగా పుట్టి, పాపం లేకుండా పెరిగి పాపుల కొరకు వారి పక్షాన చనిపోయెను. పాప శిక్షను తాను భరించి, శాపగ్రహియై మనకు బదులుగా మరణించి, సమాధి చేయబడి తిరిగి లేచెను. తద్వార తండ్రియైన దేవుడు క్రీస్తును విశ్వసించు వారికందరికి క్రీస్తు నీతిని ఆపాదించి, వారిని నీతిమంతులుగా తీర్చి రక్షించుటకు వీలుకలిగెను. కాబట్టి ఇప్పుడు క్రీస్తు నందున్న వారికి యే శిక్షా విధియు లేదు. నరక పాత్రుడైన పాపిని పరిశుద్ధునిగా తీర్చి పరలోకం చేర్చగలుగుట ఎంత అద్భుతం! అదంతా క్రీస్తు ద్వారానే సాధ్యమైనది. మనం ఏమైయున్నామో, ఏమి కాబోతున్నామో అందంతా క్రీస్తును బట్టియే జరుగుతుంది. ఆయనే మన జీవితాలకు కేంద్రం, సమస్తం. ఆయనను ఎంత వర్ణించినా, ఆరాధించినా అది తక్కువే.

శ్రీమతి బి. విమలారెడ్డి గారు ప్రభువైన యేసుక్రీస్తు ఔన్నత్యాన్ని ఈ పుస్తకంలో దేవశాస్త్ర పరమైన గంభీర అంశాలను సులభశైలిలో సామాన్య ప్రజలకు సహా అర్థమయ్యే రీతిలో వ్రాశారు. అందుకు మనం దేవున్ని స్తుతించ బద్ధులం. వారు అభినందనీయులు.

గత 50 సంవత్సరాల నుండి ప్రపంచవ్యాప్తంగా క్రీస్తును గూర్చి దేవుని సంఘములో కూడా లేఖన విరుద్ధమైన, సరికాని, సంకుచిత బోధలు విపరీతంగా

ఉన్నాయి. ఆయనను తగ్గించి, మానవున్ని అనవసరమైన స్థాయికి హెచ్చించే దారుణ పరిస్థితిని మనం చూస్తున్నాం. దానికి మన తెలుగు క్రైస్తవ లోకం మినహాయింపు కాదని నేను చూచాను, విన్నాను. అలాంటి పరిస్థితులలో సార్వభౌముడైన మన దేవుడు శ్రీమతి బి. విమలారెడ్డి గారిని అభిషేకించి, ప్రేరేపించి ఈ పుస్తకం తెలుగు క్రైస్తవ లోకానికి వరంగా ఇచ్చాడని నేను నమ్ముచున్నాను. ఈ పుస్తకమును చదివిన వారందరు క్రీస్తు ఔన్నత్యాన్ని తాజాగా గుర్తించి ఆయనను మరింతగా ఆరాధిస్తూ, వెంబడిస్తూ సాగిపోతారని నా నమ్మకం. అలాంటి తరాన్ని దేవుడు లేపాలని, ఈ పుస్తకం సమస్త జనులకు దీవెనకరంగా ఉండుట చేత దేవునికి సమస్త మహిమ కలగాలని ఆశిస్తూ, ప్రార్థిస్తూ....

దేవునికే సమస్త మహిమ!

క్రీస్తు దాసుడు

**సహో॥ఇమ్మానుయేలు ఆకెపోగు**

హైదరాబాద్

# పరిచయం



సర్వవిశ్వ సృష్టికర్త, సర్వమానవాళి రక్షణ కర్త అయిన యేసుక్రీస్తు ప్రభువు వారి ఇహలోక జీవిత చరిత్రను మనకు తెలియజేయటానికి పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడిన 4 సువార్తల్లో యోహాను సువార్త ఒక విలక్షణమైన మణిపూస వంటిది. క్రీస్తు ప్రభువును మత్తయి యూదుల రాజుగాను, మార్కు సేవకుడిగాను, లూకా మనుష్య కుమారుడిగాను వర్ణిస్తే, యోహాను సర్వసృష్టికి, ఉనికికి మూలకారకుడైన దేవునిగా, మానవ జాతిని అజ్ఞానమనే అంధకారము నుండి నిత్య జీవమనే ఆధ్యాత్మిక వెలుగులోనికి నడిపించే దైవకుమారుడిగా నిరూపించాడు. ఇతర సువార్తికులు వ్రాసిన వాటికి అదనంగా ప్రశస్తమైన సమాచారం యోహాను సువార్తలో కనిపిస్తుంది. శిష్యుడైన యోహాను యేసుప్రభువుకు పూర్తిగా అంతరంగికుడు, సిలువ శ్రమలలో యేసుప్రభువుకు దగ్గరగా నిలుచున్న శిష్యుడాయెనే!

ఈ సువార్తలో వ్రాయబడిన ప్రతి సంఘటనకు యోహానే ప్రత్యక్ష్యసాక్షి. క్రీస్తునాధునిని ఆనుకొని జీవిస్తే కలిగే మహోన్నత దీవెనలకు శిష్యుడైన యోహానే నిలువెత్తు నిదర్శనం. క్రీస్తునాధుని దైవత్వాన్ని, మహిమను మహోత్కృష్టమైన స్థాయిలో వర్ణిస్తూ ఆదాము పాపము ద్వారా మానవాళికి అపవాది కలిగించిన అంధకారములో నుండి విమోచించి నిత్యమైన, నిజమైన వెలుగులోనికి నడిపించడానికి, నిజమైన వెలుగుగా అవతరించిన యేసునాధుని విశ్వసించుట ద్వారా కలిగే శాశ్వత ఆశీర్వాదములను గూర్చి శ్రీమతి డా॥ బి.విమలారెడ్డి గారు పరిశుద్ధాత్మ ద్వారా ప్రేరేపించబడి ప్రార్థనా పూర్వకంగా ఈ గొప్ప పుస్తకాన్ని రచించారు. ప్రార్థనాపూర్వకంగా ఈ పుస్తక పఠనాన్ని ప్రారంభిద్దాం.

మా ఆత్మీయ తల్లిగారైన శ్రీమతి విమలారెడ్డి గారిని దేవుడు విలువైన యోగ్యమైన పాత్రగా ప్రసంగ పరిచర్యలోను, బోధనా పరిచర్యలోను, రచనా పరిచర్యలోను సమున్నతంగా ఆశీర్వదిస్తున్నందుకు మేము దేవునికి హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లిస్తున్నాము.

క్రీస్తు పాదసేవలో

**రెవ.టి.యస్.ఆర్.ప్రసాదరెడ్డి**

ఫిలదెల్ఫియా బైబిల్ ఇనిస్టిట్యూట్, కవిటం

# విషయ సూచిక


ఉపోద్ఘాతము .................................................... 1

1. "నిజమైన వెలుగు" యొక్క దైవత్వము ........................... 6

2. వెలుగును గురించిన సాక్షులు.................................. 24

3. ఆత్మీయ చీకటి ................................................ 39

4. వెలుగును గురించిన ఏడు ప్రత్యక్షతలు ......................... 55

5. దైవత్వము తెలుపుటకు ఏడు సూచనలు ....................... 79

6. మానవాళిని వెలుగులోనికి తెచ్చిన ప్రభువు..................... 98

7. వెలుగు సంబంధులు .......................................... 120

# ఉపోద్ఘాతము

**'వెలుగు'** అంటే ఏమిటి? చీకటి కానిదేదో అది వెలుగు. వెలుగు రాగానే చీకటి పారిపోతుంది. 'వెలుగు' ఉన్న చోట చీకటికి స్థానము లేదు. 'వెలుగు' అను పదమునకు మనము ఇవ్వగలిగిన నిర్వచనము : **'కనుచూపును ఉత్తేజపరచి వస్తువులను చూచుటకు ఇవ్వబడిన సహజ శక్తి'.** ఇందుకు ఉదాహరణ సూర్యుని వెలుగు, మానవులు తయారు చేసుకున్న కృత్రిమమైన వెలుగునిచ్చే విద్యుత్తు బల్బులు, కొవ్వొత్తులు, దీపాలు మొదలగునవి.

ఈ పుస్తకములో నేను మీకు చెప్పాలనుకున్న అంశము "నిజమైన వెలుగు"ను గురించి. ఇది దేవుని తేజస్సు, దేవుని సన్నిధిలోని ఒక అంశము. బైబిలు ప్రకారము దేవుని సృష్టి క్రమములో వెలుగు మొదటిది. మొదటిగా దేవునిచే "మంచిది"గా పేర్కొనబడినది. "వస్త్రమువలె వెలుగును నీవు కప్పుకొని యున్నావు" అని కీర్తన 104:2లో కీర్తనాకారుడు వివరిస్తున్నాడు. ప్రకటన 21:23లో "ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను, చంద్రుడైనను దానికక్కరలేదు. దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొఱ్ఱెపిల్లయే దానికి దీపము" అను వాక్య భాగములో ఆయన మహిమే 'తేజస్సు' లేక 'వెలుగు' అని అర్థమవుతున్నది. పరలోక పట్టణము యొక్క దర్శనము చూసిన యోహాను వివరణ ఇది. "గొర్రెపిల్లయే దానికి దీపము" అను మాటలో యేసుక్రీస్తు "నిజమైన వెలుగు" గా పరలోకమును వెలిగిస్తున్నాడని తెలుస్తుంది. ప్రసంగి 11:7లో "వెలుగు మనోహరమైనది" అని చెప్పబడి ఉన్నది; 1యోహాను 1:5లో "దేవుడు వెలుగై యున్నాడు, ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు" అని వ్రాయబడి ఉన్నది.

వెలుగై యున్న యేసుప్రభువును మన హృదయములో కలిగి ఉంటే మనము కూడా చీకటిని వదిలి **'యేసు అను వెలుగు'**లో నడవగలము. మనము దేవుని విశ్వసించినపుడు చీకటిని వదిలి క్రీస్తు వెలుగులోనికి వస్తాము. చీకటి అంటే అవిశ్వాసము, అవినీతి; వెలుగు అంటే విశ్వాసము, నీతి.

యేసుప్రభువే "వెలుగు" అను సత్యము బైబిలులో చాలా చోట్ల ఉంది. యోహాను 1:9లో "నిజమైన వెలుగు"; 1యోహాను 2:8లో "సత్యమైన వెలుగు"; యోహాను 8:12లో "జీవపు వెలుగు"; మత్తయి 4:13-16లో "గొప్ప వెలుగు" గా చూడగలము. యోహాను సువార్తలో "వెలుగు", "చీకటి" అను అంశములు కనపడుతాయి. "వెలుగు" ను గురించిన అనేక విషయాలు ఎక్కువగా ఈ సువార్తలో ఉన్నందున నా అంశమునకు ఈ సువార్తను ఎంపిక చేసుకున్నాను.

వెలుగును గురించి నాలుగు సంగతులు చెప్పవచ్చును :

**1. Light is mysteriously fashioned :**

వెలుగు మార్మికమైనది, వెలుగును విభజించే కొద్దీ చాలా మర్మాలు బయటపడతాయి. ఒక నీటి బొట్టులో నుండి వెలుగు వెళితే 7 రంగులు కనపడుతాయి. ఆ రంగులు ఎక్కడ నుండి వచ్చాయంటే దేవునికే ఎరుక. డ్యాముల యొద్ద గేట్లు తెరచినప్పుడు వచ్చే నీటిని చూస్తున్నప్పుడు ఇంద్రధనస్సు ఏర్పడినట్లుగా అగుపిస్తుంది. దేవుడు సృష్టించిన వెలుగులోనే ఇన్ని మర్మాలు ఉంటే, ఆ వెలుగుకు మూలమైన నిజమైన వెలుగులో ఇంకెన్ని మర్మాలున్నాయో మనము వాక్యములో వెదకి పరిశుద్ధాత్మ దేవుని సాయంతో తెలుసుకోవాలి.

**2. Light is exquisitely beautiful** :

వెలుగులో ప్రత్యేకమైన అందము ఉన్నది. మన చుట్టూ సృష్టిలో ఉన్న అందాలు చూడాలంటే వెలుగు ద్వారానే చూడగలము. చీకటి అందాలను చూడనివ్వదు. నిజమైన వెలుగైన యేసయ్యను చూడాలంటే కూడా మన మనసులో పాపమనే చీకటి ఉండకూడదు.

**3. Light is absolutely immaculate** :

వెలుగు స్వచ్ఛమైనది, పవిత్రమైనది, పరిశుద్ధమైనది. మత్తయి 5:14లో "మీరు లోకమునకు వెలుగై ఉన్నారు" అని యేసయ్య అన్నాడు. మనంతట మనకు ఏ వెలుగు లేదు. దేవుని వెలుగు మనము ప్రతిబింబింప చేయాలి. స్వచ్ఛమైన వెలుగు స్వచ్ఛమైన వారి గుండా వస్తే కల్తీలేని దానిగా ప్రవర్తిస్తుంది.

**4. Light is absolutely incorruptible** :

వెలుగు నాశనము కానిది. వెలుగును నాశనము చేస్తే మనకు జీవముండదు. దేవుడు సృష్టించిన వెలుగును దేవుడు మాత్రమే నాశనము చేయగలడు.

వెలుగు లక్షణాలు ఇంకా కొన్నింటిని చూద్దాము: వెలుగు మనకు ఇస్తుంది కాని తిరిగి తీసుకోదు; రుజుమార్గంలో పయనిస్తుంది; శక్తిమేరకు ప్రకాశిస్తూ ప్రతి వస్తువును దృష్టి పథములోకి తెస్తుంది; అందరి మీద ప్రకాశిస్తుంది; పక్షపాతము లేనిది; చీకటిని పారద్రోలుతుంది; ప్రాణులన్నింటికి అవసరమైనది.

ఒక మనిషి జీవించాలంటే కావలసిన నాలుగు ముఖ్యమైన వనరులు : వెలుగు (సూర్యుడు లేకుంటే అన్నీ చనిపోతాయి), గాలి, నీరు, ఆహారం. యేసుప్రభువు ఈ నాలుగు అయి ఉన్నాడు. వెలుగు లేకుంటే ఆహారం ఉండదు, యేసయ్య లేకుంటే మనకు జీవాహారము లేదు. దేవుడు 'వెలుగు' (1యోహాను 1:5) అనియు, అపవాది 'చీకటి శక్తి' (లూకా 22:53) అనియు బైబిలు చెప్తున్నది. మనుషులు వెలుగును గాని చీకటిని గాని ప్రేమిస్తారు. ఆ ప్రేమ వారి స్వభావములను మారుస్తుంది. వెలుగును ప్రేమించువారు దేవుని కుమారులు (యోహాను 12:35,36)

దేవుడు "వెలుగు కలుగుగాక" అని పలికేంతవరకు ప్రపంచమంతా పూర్తిగా చీకటిమయమై యున్నది. ఈ భూమి పైన చెట్లుగాని, మనుష్యులుగాని, పశువులు గాని లేవు. వాక్యము (యేసుక్రీస్తు) పలకగానే జీవము వచ్చింది. ఈ చీకటి, వెలుగు, జీవముల గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. రాత్రిపూట గదిలోని దీపము ఆపేయగానే చీకటి వచ్చేస్తుంది. ఆత్మీయ చీకటి అని ఇంకొక రకమైన చీకటి ఉన్నది. పాపము వలన ప్రతి మానవుని హృదయములోకి వచ్చు ఈ చీకటి గురించి మనము తెలుసుకోవాలి. ఆదాము, హవ్వలు ఏదెను వనములో దేవునికి అవిధేయత చూపినపుడు ఈ ఆధ్యాత్మిక చీకటి ప్రపంచములోకి ప్రవేశించింది. పాపము ద్వారా దేవునికి దూరమగుట వలన ఈ చీకటి ఏర్పడింది.

యేసులో "జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై ఉండెను" (యోహాను 1:4) అను వాక్యమునకు అర్థమేంటి? యేసుప్రభువును నమ్మినవారికి

ఆయన ఆత్మీయ జీవమును, వెలుగును ఇస్తాడు; ఆయన యొద్ద నుండి జీవము, వెలుగును పొందుకున్నవారికి సంతృప్తి జీవితము ఉంటుంది. యేసయ్య “నేను జీవమును, సమృద్ధి అయిన జీవమును ఇచ్చుటకు వచ్చియున్నాను” అన్నాడు. విశ్వసించిన వారికందరికి ఆయన ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నాడు. ఆయనను అంగీకరించని వారు ఆత్మీయ గ్రుడ్డితనములోనే ఉండి నిత్యజీవముకు వెళ్లుటకు అవకాశము కోల్పోతారు.

నీ చీకటి గదిలో దీపము వెలిగించగానే చీకటి వీగిపోయి వెలుగు వస్తుంది. చీకటిలో చూడలేని చాలా వస్తువులు, పరిసరాలు వెలుగులో చూడగలవు. అదే విధంగా యేసుక్రీస్తును గురించిన సత్యము అర్థము చేసుకున్న మనిషికి ఆత్మీయ వెలుగు ఇవ్వబడి, దేవుని క్షమాపణ పొందుకుంటాడు. ఆత్మీయ వెలుగులో తన పాపములు కనపడుట వలన క్షమాపణ అడుగుటకు అవకాశము వస్తుంది. అప్పుడు అతనికి జీవము వస్తుంది. మనము వాక్యము చదువుచున్నప్పుడు పరిశుద్ధాత్మ ద్వారా క్రీస్తును కనుగొనగలము. ఇప్పటికైనా ఆత్మీయ గ్రుడ్డితనము వదిలించు కొనుటకు ప్రయత్నము చేద్దామా? అప్పుడు రక్షణకు అవసరమైన విశ్వాసము వస్తుంది.

ఈ పుస్తకము చదివిన తర్వాత పాఠకులందరు “యేసుప్రభువే నా వెలుగు, ఆయన వెలుగుగా నేనుంటాను” అను మాటలను హృదయములో దృఢపరచుకొని, మీ జీవితాలలో అన్వయించుకొంటారను ఆశతో ఈ పుస్తకము వ్రాయుటకు పూనుకుంటున్నాను. నా స్వంత యిచ్ఛతో కాక దేవుని ప్రేరేపణతోనే ఏ యోగ్యత లేని నేను ఈ రచన మొదలు పెట్టానను సంగతి గ్రహించాలని మనవి చేసుకుంటున్నాను. కీర్తన 27:1లో దావీదు చెప్పినట్లు “యెహోవా నాకు వెలుగును, రక్షణయునై యున్నాడు, నేను ఎవరికి భయపడను?” అని ధైర్యంగా చెప్పగలిగే స్థితికి మనమందరము ఎదగాలి. దావీదు చెప్పిన మాటలు మనము హృదయ పూర్వకముగా విశ్వసిస్తే మనము కూడా ఎవరికీ భయపడకుండా ఉండగలము. దేవుని ముందు తలవంచితే, ఇంకెవరి ఎదుట తలవంచనవసరము లేదని మనము గుర్తించాలి.

యేసయ్యను "నిజమైన వెలుగు"గా గుర్తించి మనలోనికి ఆహ్వానించాలి. "వెలుగు కలుగును గాక" అను మాటతో సృష్టి ఆరంభమైనట్లు నిజమైన వెలుగైన క్రీస్తు మన హృదయంలోకి ప్రవేశించగానే మన జీవితంలో నూతన సృష్టి గావించబడుతుంది. భూమిపైన వెలుగిచ్చుటకు నాలుగవ రోజు సూర్యుని సృష్టించక ముందు ఈ భూమి దేవుని వెలుగుతో నింపబడి ఉంది. 2 సమూయేలు 22:29లో దావీదు దేవుని స్తుతిస్తూ ఈ విధంగా అంటున్నాడు : "యెహోవా, నీవు నాకు దీపమై యున్నావు. యెహోవా చీకటిని నాకు వెలుగుగా చేయును" అంటున్నాడు. ఈ విధమైన స్తుతి ప్రతి విశ్వాసి నోట ఉండాలి. 1కొరింథీ 2:9లో చెప్పబడినట్లు మనకు దేవుడు ఏర్పరచినవి కనపడవు. "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనపడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు". ఆత్మీయ గ్రుడ్డితనములో ఉన్నంత వరకు మనకేవీ కనపడవు. ఆయన వెలుగు మనలోకి రాగానే మనకు అవి అగుపడతాయి. ఈ వెలుగు మనలోకి రావాలంటే ఆయన వాక్యముపై ఆధారపడాలి. కీర్తన 119:130లో "నీ వాక్యములు వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును" అని వ్రాయబడి ఉన్నది. ఈ వెలుగు మనలోనికి రాకూడదని అపవాది ప్రయత్నిస్తుంటాడని పౌలు 2కొరింథీ 4:4,5లో చెప్తున్నాడు. "దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను".

వెలుగు రాగానే చీకటి వెళ్లిపోతుంది అను దృక్పధముతో ఈ పుస్తకము వ్రాయడము లేదు గాని లోకమనే చీకటి యొక్క వాదముల వలన దేవుని సత్యాన్ని మరచిపోతున్నాము కాబట్టి నిజమైన వెలుగును గురించి అర్థము చేసుకొని ఆ వెలుగుతో నింపబడితే అపవాది మన యొద్దకు రాలేదని తెలుపుటకే వ్రాస్తున్నాను. మానవుడు పాపము వలన పతనమైనప్పటి నుండి వెలుగుతో శతృత్వముంది. అపవాది వారికి గ్రుడ్డితనము కలుగజేసినందున వారు దేవుని మంచితనము గుర్తించలేక పోతున్నారు. చంద్రుడు సూర్యుని కాంతి గ్రహించి లోకమునకు వెలుగిస్తున్నాడు. లోకము దేవునితో శతృత్వము కలిగి యున్నను, శేషించిన విశ్వాసులతో, వారి ద్వారా తన వెలుగును లోకములో ప్రసరింప చేస్తున్నాడు.

# 1. నిజమైన వెలుగు యొక్క దైవత్వము

**“వె**లుగు”, “జీవము” అను అంశములు యోహాను సువార్తికుడు ఎక్కువగా వ్రాసాడు. మత్తయి, మార్కు, లూకా సువార్తలను సమదృక్పథ సువార్తలు అని పిలుస్తారు. ఎందుకంటే వాటిలో ఎక్కువ భాగము ఒకేలాగా ఉంటుంది. యోహాను సువార్త 95 శాతం వేరుగా ఉంటుంది. అతని గమ్యము యేసయ్యను దేవునిగా చూపించుట. సమదృక్పథ సువార్తలు ప్రభువును ఒక చారిత్రాత్మక వ్యక్తిగా పరిచయం చేశారు గాని యోహాను దైవిక యేసయ్యను చూపించాడు. మత్తయి యూదులకు, మార్కు రోమీయులకు, లూకా గ్రీకులకు వ్రాశారు గాని యోహాను అందరికీ వ్రాశాడు.

మత్తయి సువార్త Gospel of might
మార్కు సువార్త Gospel of night
లూకా సువార్త Gospel of sight
యోహాను సువార్త Gospel of light అని పిలుస్తారు.

యోహాను “నిజమైన వెలుగు”ను గురించిన వివరణ మొదలుపెట్టక ముందు ఆ వెలుగు ఎక్కడ నుండి వచ్చినదీ వివరిస్తున్నాడు.

యోహాను 1:1-5 వచనములలో వెలుగును గురించిన పరిచయ వాక్యములు వ్రాస్తున్నాడు: “ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను”.

యోహాను సువార్త వ్రాయుటకు ముఖ్య ఉద్దేశము యోహాను 20:31లో వ్రాశాడు : "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను". అందుకే మొదటి 5 వచనములలో యేసుక్రీస్తు యొక్క దైవత్వము చూపుతున్నాడు. ఈ వాక్య భాగములో మనకు అర్థమయ్యే విషయమేమంటే ఈ దైవమే మన "నిజమైన వెలుగు" అని, ఆయన నిత్యుడగు దేవునిగా ప్రత్యక్షపరచ బడుతున్నాడు. మానవరూపములో ఈ లోకానికి రాకమునుపు ఆయనకున్న హోదా, ఆయన చేస్తున్న పని వివరిస్తూ ఆయన త్రిత్వములో ఒకడని చెప్తున్నాడు. ఇహలోకమునకు రాకముందు ఉన్న క్రీస్తును 'యేసు' అను పేరుతో యోహాను సంబోధించడము లేదు కాని 'వాక్యము' అని అంటున్నాడు. ఈ పదాన్ని గ్రీక్ భాషలో 'లోగోస్' అంటారు. ఈ మాటకు చాలా లోతైన భావము ఉన్నది. "మొదటి కారణము" అను అర్థమిస్తూ సృష్టి వెనుక ఉన్న జ్ఞానముతో కూడిన దైవశక్తి అని చెప్తున్నాడు. సామెతలు గ్రంథములో జ్ఞానమును ఒక మనిషితో పోల్చినట్లుగా ఉంది.

మన నోటి మాటల ద్వారా మనసులోని ఆలోచనలను ఇతరులతో ప్రస్తావిస్తాము. అదే విధంగా దేవుని మనసును మనకు తెలిపే వాక్యమే యేసుక్రీస్తు. "నన్ను చూసిన వాడు నా తండ్రిని చూచినట్లే" అని యేసయ్య చెప్తున్నాడు. ఒక వాక్యము అంటే అక్షరాలు ఉండాలి. ప్రకటన 1:8 ప్రకారము ఆయన అల్ఫా, ఓమెగ – గ్రీకు భాషలోని మొదటి, చివరి అక్షరాలివి. యేసుక్రీస్తు నిత్యత్వములో ఉన్న వాక్యము. ఈ వాక్యము సమస్త జ్ఞానమునకు, శక్తికి మూలమై యుండి దేవునిని మానవాళికి ప్రత్యక్షపరచుటకై నరరూపధారియైనాడు. మనుష్యుల చేత ద్వేషింపబడి, సిలువ వేయబడిన నజరేయుడగు యేసు నిత్యుడగు దేవుడు, సర్వసృష్టికర్త. పాత నిబంధనలో చాలా సందర్భాలలో "యెహోవా వాక్కు" అని ఆయనను గురించి చెప్పబడి ఉంది.

యోహాను 1:1,2 వచనములలో మోషే ఆదికాండములో "ఆదియందు" అని వ్రాసినట్లు గంభీరముగా మొదలు పెడుతున్నాడు, కాని యోహాను ఆదికాండము 1:1 కంటే ఇంకా పురాతన కాలంలోకి వెళ్తున్నాడు. పరలోకంలో

తండ్రి, కుమారుని సాన్నిహిత్యం చూపుచున్నాడు. దేవుని యొద్ద, దేవుడై ఉండెను; ఆది, అంతము లేనివాడు; నిత్యత్వములో తండ్రితో కూడ ఉన్నవాడు; ఆయనే దేవుడై ఉన్నాడను సత్యాలు మనకగుపడుతున్నాయి. “అబ్రాహాముకు ముందే నేనున్నాను” అని ప్రభువు అన్నాడు. తండ్రితో కలిసి సృష్టిని చేశాడను సత్యము “మన స్వరూప మందు” అను మాటలో రుజువు చేయబడింది.

“దేవుడై ఉండెను” అను సత్యాన్ని ఈ సువార్తలో చెప్పాలనుకున్న యోహాను ఆ అంశముతోనే ప్రారంభించాడు. యేసుప్రభువు చేసిన కార్యాలన్నీ దేవుని కార్యాలే. ఈ సత్యము విశ్వసించకుంటే మన ప్రార్థనలన్నీ వ్యర్థమే. **క్రీస్తు దైవత్వాన్ని అంగీకరించుటే క్రైస్తవ్యానికి మూలము.** రెండవ వచనములో నిత్యత్వములో ఆయన ఉన్నాడని చూపుటకు “ఆదియందు” అనుమాట రెండవసారి అంటున్నాడు. “సమస్తమును ఆయన మూలముగా కలిగెను” అని చెప్పుటలో ఆయనే దేవుడు అని చెప్తున్నాడు.

ఇవన్నియు చెప్పాక యోహాను యేసుక్రీస్తులో జీవముందనియు, ఆ జీవము మనుష్యులకు వెలుగై ఉండెనని చెప్తున్నాడు. జీవము, వెలుగు అను పదములు ఈ సువార్తలో చాలాసార్లు వాడాడు. దేవుడే మనిషికి జీవమును ఊదాడు. బైబిలులో “జీవము” అంటే కేవలము శారీరకమైనదేగాక నైతిక, జ్ఞానయుక్తమైన, నిత్యత్వముకు సంబంధించిన జీవము. ఇవన్నిటికీ మూలం క్రీస్తే.

‘జీవము’ అను మాటకు నిఘంటువులోని అర్థము ‘ఆత్మ శరీరాల కలయిక’ జీవానికి మూలము ఆదికాండము 2:7 లో చూడగలము. “దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి, వాని నాసికారంధ్రములో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను”. జీవం అంతా దేవుని నుండి వస్తుంది. 1యోహాను 5:20లో “ఆయనే నిజమైన దేవుడు, నిత్యజీవమునై యున్నాడు” అని వ్రాయబడి ఉంది. జీవం అనేది ఒక గుణం, ఒక లక్షణము, సర్వశక్తిమంతుడైన దేవుని స్వభావం. బైబిలు 3 రకాలు జీవము గురించి చెప్తుంది :

**1. భౌతికమైన ప్రాణం** – దీనిని సృష్టి సమయంలో దేవుడు మానవునికి ఇచ్చాడు.

**2. ఆత్మ సంబంధమైన జీవం** – ఇది నూతన జీవము. ఇది యేసుక్రీస్తు ద్వారా దేవుడు మానవునికిచ్చాడు. ఎఫెసీ 2:1 "మీ అపరాధముల చేతను, పాపముల చేతను, మీరు చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను".

**3. నిత్యజీవము** – ఇది దేవుని స్వభావం, గుణ లక్షణము. "ఈ జీవము మనుష్యులకు వెలుగై యుండెను" అంటూ క్రీస్తు అను వెలుగును యోహాను సువార్తికుడు మనకు పరిచయము చేస్తున్నాడు. ఈ వెలుగు యొక్క రాకడ పాత నిబంధనలో ప్రవచించబడి ఉన్నది. యెషయా 49:6లో "అన్య జనులకు వెలుగై యుండునట్లు నిన్ను నియమించి యున్నాను" అని యేసయ్య మొదటి రాకడ గురించి చెప్పబడి ఉంది. యోహాను 8:12లో ప్రభువే స్వయంగా "నేను లోకమునకు వెలుగును" అన్నాడు. యోహాను 1:9లో "నిజమైన వెలుగు ఉండెను" అని ఆయనను గురించి చెప్పబడి ఉంది. మిగిలిన వెలుగంతా ఆయన నుండే వస్తున్నది.

17వ శతాబ్దపు డచ్ చిత్రకారుడు Rembrandt అనే ఆయన పసి బాలుడైన యేసును గొల్లలు ఆరాధించుట చిత్రీకరించాడు. చీకటి, వెలుగులను చూపించుటలో ఆ చిత్రకారుడు చాలా ఘటికుడు. బెత్లేహేములోని ఆ పశువుల పాక చీకటిగా ఉంది. అక్కడ ఇద్దరు గొల్లలు పశువుల తొట్టి యొద్ద మోకాళ్లూనారు. ఇంకా కొద్దిమంది దూరంగా నిలబడి యున్నారు. వాళ్లలో ఒకడు వెలిగించిన లాంతరును ఎత్తిపట్టుకొన్నాడు, కాని ఆ పసిబాలుని నుండి వెలుగు వచ్చి తన చుట్టు ఉన్నవారిని ప్రకాశింప చేస్తున్నది. యేసు ఈ లోకానికి వెలుగుగా వచ్చినట్లు ఆయన చిత్రీకరించాడు. యేసుప్రభువు ఈ లోకానికి రాకముందు 700 సంవత్సరాల క్రిందటే యెషయా ప్రవక్త ఆయన రాకడ గురించియు, ఆ వెలుగును గురించియు యెషయా 9:2లో ప్రవచించాడు : "చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు. మరణచ్ఛాయగల దేశ నివాసుల మీద వెలుగు ప్రకాశించును".

Rembrandt చిత్రములో చిత్రీకరించిన పశువుల పాకలో మనమందరమూ ఉన్నాము. కొందరు భక్తితో మోకాళ్లూని, కొందరు దూరంగా నిలబడి, మరికొందరు

ఆ వెలుగును చూడలేక చీకటిలో దాగుకొని ఉన్నాము. ఈ వెలుగును గురించిన విశ్వాసమేమంటే చీకటిలోకి దూకకుండా, వెలుగులోకి అడుగు పెట్టాలి. వెలుగై యున్న యేసయ్య యందు విశ్వాసముంచువాడు తండ్రి యందు కూడా విశ్వాసముంచినట్లే, విశ్వాసము లేకుండా నాశనమునకు వెళతాడు. ఆయనలోని వెలుగును మనము అనుభవిస్తుంటే చీకటి నుండి విడుదల పొంది మన చుట్టూ ఉన్న పరిస్థితులను చూస్తూ తండ్రి యందు ఆనందించగలము.

యేసుప్రభువు ఈ లోకానికి రావడము వలన పాపమనే చీకటిలో ఉన్న పాపి జీవితంలో ఉషోదయం కలిగింది. క్రీస్తు, ఆయన సువార్త ప్రపంచానికిచ్చిన ఆత్మీయ వెలుగులో, ఆ వెలుగునందు విశ్వాసముంచి నడచినప్పుడు మనము వెలుగు సంబంధులవుతాము. వెలుగు సంబంధులందరూ దేవుని సొత్తయి ఉన్నారు (1పేతురు 2:9). దేవుడు ఏ విధంగా ప్రేమ, ఆత్మ, దహించుఅగ్ని అయి ఉన్నాడో అదే విధంగా వెలుగై ఉన్నాడు. అది ఆయన స్వభావము. వెలుగు అనేది ఆయన స్వభావమైనందున ఆయన తనలో ఉన్న పరిపూర్ణమైన పరిశుద్ధతను, గొప్పతనమును ప్రత్యక్ష పరచుకుంటున్నాడు. ఆయనలో చీకటి అనేది ఏ మాత్రము లేదు కాబట్టి ఆయనలో దాచిపెట్టుటకు ఏమీ లేదు. 1యోహాను 1:5 – "దేవుడు వెలుగై ఉన్నాడు; ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు".

బైబిలులో వెలుగు, చీకటి అనునవి పవిత్రతకు, పాపమునకు చిహ్నాలుగా ఉన్నాయి. ప్రతి మతములో కూడా ఈ విధంగానే ఉంటాయి. జ్ఞానయుక్తముగా ఆలోచిస్తే వెలుగు అంటే సత్యము, చీకటి అంటే తప్పు లేక అజ్ఞానము, యోహాను క్రీస్తును "నిజమైన వెలుగు"గా చూపిస్తున్నాడు. దుష్టులైన మనుష్యులు ఈ వెలుగును కోరుకోవడములేదు. ఎందుకంటే వారి దుష్టక్రియలను అది బయటపెడుతున్నది. ఇటువంటి వారికి చీకటంటే ఇష్టము. తమ స్వార్థపూరిత మార్గాలను వదులుకోవడము ఇష్టము లేదు. చీకటి వాటిని కప్పివేస్తుంది. క్రీస్తనే వెలుగులో ఏమీ దాచబడవు. వెలుగు లక్షణము ప్రకాశము; చీకటి లక్షణము ఆ ప్రకాశాన్ని తన లోనికి రానీయకపోవడము, గ్రహించకపోవడము. చీకట్లోకి వెలుగు వెళ్లదు,

ఎందుకంటే వెలుగు రాగానే చీకటి పరారయి పోతుంది. వెలుగు ఎంతదూరము పోతుందో అంత దూరము చీకటి పారిపోతుంది.

మనము క్రీస్తులో విశ్వాసముంచినపుడు పాపమనే చీకటిని వదిలి క్రీస్తు వెలుగులోకి వస్తాము. పాపముల విషయమై పశ్చాత్తాపము నొంది క్రీస్తును తన హృదయములోకి ఆహ్వానించిన సత్యవర్తనుడు వెలుగులోకి వస్తాడు. వెలుగులోనికి వచ్చినవారు చీకటిని వదలి చెడును ద్వేషిస్తారు. అప్పుడు వెలుగులోకి వచ్చుటకు భయపడరు. పాపములో ఉన్నవారు చీకటిలో ఉన్నారు కాబట్టి వెలుగు వారిలో ప్రవేశింపలేదు. "నిజమైన వెలుగు" అయిన మన క్రీస్తును గురించి ఇంకా కొన్ని విషయాలు మనము తెలుసుకుందాము.

**1. "He is my illumination" – "ఆయనే నా తేజస్సు" :**

కీర్తన 18:28లో "నా దీపము వెలిగించువాడవు నీవే, నా దేవుడైన యెహోవా చీకటిని నాకు వెలుగుగా చేయును" అని కీర్తనాకారుడు అంటున్నాడు. ఆయనే నన్ను వెలిగిస్తాడు, నా వెలుగు ఆయనే, దీపము ఆరిపోకుండా చూసుకుంటాడు. ఆత్మీయ గుడ్డితనమనే చీకటిలో ఉన్న మనలను దేవుని జ్ఞానమనే వెలుగులోనికి ఆయనే తీసుకొని రాగలడు. దేవుని యందు భయభక్తులు కలిగియుండుటే జ్ఞానమునకు మూలము. ఈ జ్ఞానము లేక తన ప్రజలు నశించిపోతున్నారను బాధ దేవుడు కలిగియున్నాడు. ఆయనను సంతోషపెట్టువారిగా మనము ఉండాలంటే ఆయనను మనలోకి వెలుగుగా రమ్మని ఆహ్వానించాలి.

**2. "He is my brilliance" – "ఆయనే నా ప్రకాశము" :**

మనలను తన ప్రకాశముతో నింపి వెలిగించువాడు ఆయనే. ప్రభువే మన వెలుగు, ప్రకాశము అని అంగీకరించిన విశ్వాసికి వచ్చు ఆశీర్వాదము ప్రకటన 22:5లో ఈ విధముగా చెప్పబడింది ఉంది : "దీపకాంతియైనను, సూర్యకాంతియైనను వారికక్కరలేదు; దేవుడైన ప్రభువే వారిమీద ప్రకాశించును". ప్రకటన 4:3లో దేవుని గురించి వివరిస్తూ "ఆసీనుడైన వాడు, దృష్టికి సూర్యకాంత పద్మరాగములను పోలినవాడు; మరకతము వలె ప్రకాశించు ఇంద్రధనస్సు సింహాసనమును ఆవరించి యుండెను" అని చెప్పబడి ఉన్నది. ఆయన మరకతమువలె ప్రకాశిస్తున్నాడు కాబట్టి

మనలను ప్రకాశింపజేసే శక్తి ఉన్నదని విశ్వసించాలి. ఇంతకు మునుపు వెలుగును గురించి మాట్లాడుతూ, వెలుగు నీటి ద్వారా వెడలుచున్నప్పుడు ఇంద్రధనస్సు లాంటిది ఏర్పడుతుందని చెప్పాను. విజ్ఞాన శాస్త్రములోని ఈ ప్రక్రియకు సమాధానము ఈ వచనములో తెలుసుకోవచ్చును. విశ్వాసులు దేవుని వెలుగును కలిగి ప్రకాశిస్తుంటే దేవునికే మహిమ. ఆయన సన్నిధిలో కొంత సమయము గడిపితే మన ముఖవర్చస్సు కూడా ప్రకాశిస్తుందని అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చును. నిర్గమకాండము 34:29,30 వచనాలలో మోషే సీనాయి కొండపైన దేవునితో మాట్లాడుచున్నప్పుడు అతని ముఖచర్మము ప్రకాశించిన సంగతి మోషేకు తెలియలేదు. “అహరోనును, ఇశ్రాయేలీయులందరును మోషేను చూచినపుడు అతని ముఖచర్మము ప్రకాశించెను గనుక వారు అతని సమీపింప వెరచిరి” అని వ్రాయబడి ఉంది. న్యాయా 5:31లో “ఆయనను ప్రేమించువారు బలముతో ఉదయించు సూర్యునివలె నుందురు” అని వ్రాయబడి ఉంది.

ఒకసారి ఫ్రాన్స్ దేశంలో Francis Fenelon అను ఒక దైవజనుడు, ఒక నాస్తికుడు ఇద్దరు ఒకే గదిలో ఒక రాత్రి గడపవలసి వచ్చినప్పుడు, ఉదయాన్నే ఆ నాస్తికుడు బయటకు పరుగెత్తుట చూసినవారు ఎందుకలా పరుగెత్తుచున్నావని అడిగినపుడు “ఆ దైవజనుని ప్రకాశము భరించలేకపోతున్నాను” అన్నాడు. తన నాస్తికత్వమును వదలివేయవలసి వస్తుందని భయపడి పరుగెత్తుతాడు. క్రీస్తు అను వెలుగుతో మనము నింపబడినపుడు, మనము కూడా యేసును ఎరుగని వారికి ఆ విధముగా కనపడుటకు అవకాశమున్నది.

### 3. "He is my glory" – “ఆయనే నా మహిమ” :

“ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను, చంద్రుడైనను దానికక్కర లేదు; దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొఱ్ఱెపిల్లయే దానికి దీపము” (ప్రకటన 21:23). ఆయన మనలో ఉంటే, ఆయన మహిమ మనలో ఉండి మనము హెచ్చింపబడుతాము. దేవుని బిడ్డలమెవరమైనా ఆయనను కలిగి యుంటే ప్రజలు మనలను మహిమపరుస్తారు. దేవుని మహిమ పరచిన వారిని ఆయన మహిమ పరుస్తాడు. ఆయన బిడ్డలను ఎప్పుడైనా, ఎక్కడైనా తలలుగానే ఉంచుతాడు

గాని తోకల్లా ఉంచడు. ఆయనను మహిమపరచుటకే మనము సృష్టించబడినాము కాబట్టి మన బాధ్యత మనము నెరవేరిస్తే దేవుడు మనలను గొప్ప చేస్తాడు. తన వెలుగును నింపుకొని, తన మహిమార్థము జీవించువారిని దేవుడెన్నడూ మహిమ పరచకుండా ఉండడు.

## 4. "He is my covering" - "ఆయనే నా కప్పు" :

"ఆయన వెలుగును నేను కప్పుకుంటాను". కీర్తన 104:2 లో దావీదు దేవుని స్తుతిస్తూ "వస్త్రము వలె వెలుగును నీవు కప్పుకొని యున్నావు" అంటున్నాడు. క్రీస్తనే వెలుగుతో మనము నింపబడినపుడు మనము కూడా ఆ వెలుగును వస్త్రము వలె కప్పుకుంటాము. ఆ కప్పు క్రింద మనకు సంపూర్ణ రక్షణ ఉంది. గ్రద్ద వచ్చినప్పుడు కోడి తన పిల్లలను రెక్కల క్రింద దాచుకొనినట్లు ఏ భయమైనా, శోధన అయినా మన యొద్దకు వచ్చినప్పుడు ఆయన రెక్కల క్రింద మనకు సంపూర్ణ భద్రత ఉంది.

## 5. "He is my beauty" : – "ఆయనే నా సౌందర్యము" :

కీర్తన 50:2లో ఆసాపు "పరిపూర్ణ సౌందర్యముగల సీయోనులో నుండి దేవుడు ప్రకాశించుచున్నాడు" అంటున్నాడు. సీయోనులో దేవుని సన్నిధి ఉంటుంది కాబట్టి "పరిపూర్ణ సౌందర్యము" కలిగి ఉన్నది. అందుకే ఆయనను కలిగియున్న మనము కూడా పరిపూర్ణ సౌందర్యముతో దేవుని సువాసనతో రక్షకుని యొద్దకు అందరినీ నడిపించగలము, ఆకర్షించగలము. దేవుని సువాసనను మనచుట్టూ వెదజల్లగలము.

## 6. " He is my life" – "ఆయనే నా జీవము" :

కీర్తన 56:3లో దావీదు "నాకు భయము సంభవించు దినమున నిన్ను ఆశ్రయించుచున్నాను" అంటున్నాడు. ప్రాణభయముతో పరుగులు తీస్తున్న దావీదు నీవే నా ఆశ్రయము అని ఆయన సన్నిధికి పరుగెత్తుచున్నాడు. ఆశ్రయదుర్గమై ఉన్న ఆ వెలుగును మనలో కలిగి ఉంటే ఆయనే మనకు జీవము ఇవ్వగలడు. రెండవ మరణము లేకుండా చేయగలవాడు ఆయనే.

**7. "He is unapproachable light" – “ఆయన సమీపింపరాని తేజస్సు” :**

అవిశ్వాసులకు ఆయన సమీపింపరాని తేజస్సు (1తిమోతి 6:16) అయి వున్నాడు గాని విశ్వాసులను ఆయన సమీపించి, వెలుగిచ్చి, ప్రకాశింప చేస్తున్నాడు. దేవుని వెలుగై యున్న విశ్వాసులకు ఆయన తండ్రియై ఉన్నాడు కాబట్టి ఆయనను సమీపించుటకు వెనుదీయరు. అన్యులు ఆయనను సమీపించలేరేమో కాని ఆయన తన బిడ్డలను ప్రేమగా దగ్గరకు తీసుకొని వెలిగిస్తాడు. ఆయన వెలుగును గురించిన గ్రహింపు ఉన్నవారందరినీ యెషయా ప్రవక్త ప్రేమగా పిలుస్తూ “రండి, మనము యెహోవా వెలుగులో నడుద్దాము” (యెషయా 2:5) అంటున్నాడు. David Barnhouse అను దైవజనుడు యేసుప్రభువు ఈ లోకములో ఉన్నప్పుడు సూర్యునితో పోల్చి, సూర్యుడు అస్తమించగానే చంద్రుడు వెలుపలికి వచ్చినట్లుగా, యేసు ఈలోకాన్ని వదిలిపెట్టి వెళ్లగానే యేసయ్య ప్రతినిధులుగా సంఘము వెలుపలికి వచ్చింది. చంద్రునికి స్వంత వెలుగు లేదు, కేవలము సూర్యుని వెలుగును ప్రతిబింబింప చేస్తుంది. అదే విధముగా సంఘము యేసుక్రీస్తు వెలుగును ఇతరులకు చూపాలి. యేసుప్రభువు “నేను లోకమునకు వెలుగై యున్నాను” (యోహాను 8:12) అన్నాడు. ఆయన శిష్యులతో “మీరు లోకమునకు వెలుగై యున్నారు” (మత్తయి 5:14) అన్నాడు.

ఈ యుగములో సంఘము ద్వారా లోకము వెలిగించబడుచున్నది. కొన్నిసార్లు ప్రకాశవంతముగా (పున్నమి చంద్రునిలాగా), మరికొన్ని సార్లు పేలవంగా (ఈనాటి నులివెచ్చని స్థితి). ఈనాడు నిజ క్రైస్తవులు చాలా తక్కువగా ఉన్నారు కాబట్టి లోకానికి వెలుగు సరిపోవడము లేదు. ఎవరెలా ఉన్నా, మనము లోకానికి వెలుగుగా ఉంటూ క్రీస్తును ఎరుగక చీకటిలో ఉన్నవారిని క్రీస్తు జ్ఞానములో ఎదుగునట్లు చేయుట ప్రతి విశ్వాసి యొక్క కర్తవ్యము. మత్తయి 17:2లో రూపాంతర కొండపై యేసుప్రభువు “ముఖము సూర్యునివలె ప్రకాశించెను; ఆయన వస్త్రములు వెలుగు వలె తెల్లనివాయెను” అని వ్రాయబడి ఉన్నది. ఆ వెలుగును గురించి ప్రకటించుట మన బాధ్యత.

ఈ లోక అధిపతి చీకటి రాజైన అపవాది. ఈ చీకటిలో మనము వెలుగై ఉండాలని దేవుని కోరిక. విమానంలో నుండి రాత్రిపూట క్రిందకు చూస్తే దీపాలు

బాగా కనపడుతాయి, అందుకే యుద్ధ సమయంలో Blackout order (అందరూ దీపాలు ఆర్పేయాలి) పెట్టారు. చిన్న దీపమైనా చిమ్మ చీకటిలో కనపడి శత్రువులు బాంబులు వేయడానికి అవకాశమేర్పడుతుంది. వెలుగుకు శక్తి ఎక్కువ కాబట్టి చీకటి ఎంత ఎక్కువగా ఉన్నను దానిని పారిపోజేస్తుంది. అందుకే దేవుడు మనలను లోకమునకు వెలుగై ఉండమని చెప్తున్నాడు. మత్తయి 5:14లో "మీరు లోకమునకు వెలుగై ఉన్నారు" అని విశ్వాసులతో అంటున్నాడు. చీకటి నిండిన ఈ విశాల ప్రపంచములో ఒక్కొక్క విశ్వాసి ఒక్కొక్క చిరుదీపముగా ఉండాలని, చీకటిలో ఉన్నవారికి మార్గము చూపుటకు ఉపయోగపడాలని దేవుని కోరిక.

"నిజమైన వెలుగు" యొక్క దైవత్వము చెప్పుటకు యోహాను నిత్యత్వములో త్రిత్వములోని ప్రత్యేక సంబంధమును చెప్పాడు. "దేవుని యొద్ద" (యోహాను 1:1) అనుటలో "దేవునితో కలిసి యుండుట" అను భావము చూపిస్తున్నాడు. ఆ తర్వాత ఆ వాక్యమే దేవుడు అని చెప్తూ, ఆ వాక్యమే వెలుగు అంటున్నాడు. ఆయన నిత్యుడు, సర్వసృష్టికర్త (తండ్రితోను, పరిశుద్ధాత్మతోను కలిసి సృష్టికార్యములో పాల్గొన్నాడు) తండ్రిని ప్రత్యక్షపరచుటకు ఈ లోకములోనికి వచ్చాడు. జీవము ప్రతి మానవునికి అవసరము, ఆ జీవమే క్రీస్తు అంటున్నాడు. శారీరక, ఆత్మీయ జీవములు రెండూ క్రీస్తు ద్వారానే వస్తాయి. ఈ జీవమే వెలుగు అని చెప్తూ ఆ వెలుగు లోకమునకు వెలుగై ఉన్నదని చెప్తున్నాడు.

ఈ పరిచయ భాగములో యోహాను వెలుగును గురించి మూడు అంశాలు చర్చించాడు :

**ఎ.** చీకటి సామ్రాజ్యాన్ని వెలుగు ఆక్రమించుకుంటుంది;

**బి.** అపవాది, అతని చీకటి శక్తులు ఈ వెలుగును ప్రతిఘటిస్తాయి కాని అపజయము పాలవుతాయి. వెలుగు శక్తి ముందర చీకటి శక్తులు నిలువలేవు,

**సి.** వాక్యమై యున్న వెలుగు ఎంత వ్యతిరేకత ఉన్నా విజయము సాధిస్తుంది.

జీవము, వెలుగు వేరు వేరు కాదు. రెండూ ఒకటే. దైవిక వెలుగును జీవము ప్రత్యక్షపరుస్తుంది. దేవుని జీవము సత్యమైనది, పరిశుద్ధమైనది. ఇది పాపమును,

అబద్ధమునైన చీకటిని దూరపరుస్తుంది. ఈ విధంగా వెలుగు, జీవముకు ఉన్న సంబంధము పాత నిబంధనలో కూడా వివరించబడి ఉన్నది. కీర్తన 36:9లో "నీ యొద్ద జీవపుఊట కలదు. నీ వెలుగును పొందియే మేము వెలుగు చూచుచున్నాము" అని దావీదు అంటున్నాడు. 'వెలుగు' అంటే తండ్రియైన దేవుని జీవము క్రీస్తులో ప్రత్యక్షపరచ బడుటయే.

యోహాను 1:5లో "ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను" అని వ్రాయబడి ఉన్నది. "గ్రహింపకుండెను" అను మాటకు అర్థము "గుర్తించలేదు" అని కాదు గాని "జయించలేదు" అని మూల పదము అర్థము చెప్తున్నది. అపవాదికి క్రీస్తును గురించి మనకంటే బాగా తెలుసు. మత్తయి 8:29లో దయ్యములు ఆయనను గుర్తించి "దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా? అని కేకలు వేసిరి", లూకా 4:34లో కూడా "వాడు – నజరేయుడైన యేసూ మాతో నీకేమి? మమ్ము నశింపజేయుటకు వచ్చితివా? నీవెవరివో నేనెరుగుదును; నీవు దేవుని పరిశుద్ధుడవని బిగ్గరగా కేకలు వేసెను", యాకోబు 2:19లో "దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి" అని యాకోబు అంటున్నాడు. వారికి రాబోవు తీర్పు సంగతి తెలుసును కాబట్టి చీకటి శక్తులు ఈ జీవాన్ని చంపి, వెలుగును ఆర్పివేయాలి అనే మొదటి ప్రయత్నం ప్రారంభం నుండి ఇప్పటివరకు చేస్తూనే ఉన్నాయి. ఈ లోకంలో అవిశ్వాసులు తెలిసికూడా తృణీకరించుట చేత నిత్య నరకానికి వెళుతున్నారు.

దేవుని నుండి వచ్చు జీవము దేవుని నీతినుండి ప్రకాశించు వెలుగుతో ఎప్పుడూ సంబంధము కలిగి ఉంటుంది. "నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండును" (యోహాను 8:12) అని చెప్పుటలో యేసుప్రభువు "జీవము"కు "వెలుగు"కు సంబంధము కలుపుతున్నాడు. జీవమునకు పరిపూర్ణత యేసుప్రభువు ద్వారానే వస్తుంది, ఆయనే దానికి మూలము. సమృద్ధియైన జీవము ఇచ్చుటకు ఆయన ఈ లోకానికి వచ్చాడు. శారీరకంగా జీవముంటేనే, అందులో నుండి శారీరక చూపు వస్తున్నట్లుగా, ఆత్మీయ జీవముంటేనే ఆత్మీయ వెలుగు

ప్రసరిస్తుంది. యోహాను “వెలుగు”ను పునరుద్ధరించే శక్తిగా అభివర్ణిస్తున్నాడు – దేవుని యొద్ద నుండి క్రొత్త జీవము, ఆయన చిత్త ప్రకారము, ఆయన సహవాసములో విధేయతతో జీవించుటకు కావలసిన శక్తి, “వెలుగు” అనేది తన సత్య పరిధిలో ఉండి దేవుని ఆధిపత్యములో క్రీస్తు ద్వారా ప్రత్యక్షపరచబడుతుంది.

“ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది” అను వాక్యమును అర్థము చేసుకొనుటలో కొన్ని భిన్నాభిప్రాయాలున్నవి. సృష్టిని గురించిన వివరణ తర్వాత వెంటనే యోహాను ఈ వాక్యము వ్రాయుట ద్వారా, ఈ మాట సృష్టి సమయంలో, పాపము ఇంకా ఈ లోకంలోకి రాక ముందటి సమయానికి చెందినదేమో అనిపిస్తుంది. ఆదాము హవ్వలు అవిధేయతతో దేవుని మాట వినక దేవునితో సమాధానము పోగొట్టుకొనుట చేత పాపమనే చీకటి, ఆత్మీయ మరణము, శారీరిక మరణము మొదలైనవి వచ్చాయి. అప్పటి నుండి మానవుడు దేవుని గురించి తెలుసుకున్నా కూడా ఆత్మీయ గ్రుడ్డితనములో ఉన్నందున మరణభయముతో జీవిస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో కూడా వెలుగు ప్రకాశిస్తున్నది కాని చీకటి దానిని గ్రహించుటకు ఇష్టపడలేదు. ఆయన వెలుగు నిన్న, నేడు, నిరంతరము ప్రకాశిస్తూనే ఉంటుంది. చీకటి ఎంత భయంకరముగా ఉన్నను, క్రీస్తు యేసు మహిమ ద్వారా వచ్చు వెలుగును జయించలేదు. ‘గ్రహింపకుండుట’ అంటే ‘జయించలేకపోవుట’ అని ఇంతకు ముందు అనుకున్నాము. విశ్వాసము ద్వారా క్రీస్తు మనలో ఉంటే, క్రీస్తు వెలుగు మనచుట్టు ఉన్న చీకటి కంటే చాలా గొప్పది కాబట్టి, చీకటి శక్తుల చెడు మనలను ఏమి చేయలేదు, ‘గ్రహింపకుండుట’ అంటే ‘అర్థము చేసుకోలేకపోవుట’ అను అర్థము తీసుకున్నా, చీకటిలో, అవిశ్వాసములో ఉండుటకు నిర్ణయము తీసుకున్నవారికి క్రీస్తునుండి వచ్చు ఆత్మీయ వెలుగు ఆయనే అను సత్యము అర్థము చేసుకోలేరు.

“నిజమైన వెలుగు”ను గురించి యోహాను 1:9–12 వరకు ఉన్న వాక్య భాగములో యోహాను ఈ విధముగా వ్రాస్తున్నాడు : “నిజమైన వెలుగు ఉండెను; అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది. ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెను కాని లోకమాయనను

తెలిసికొనలేదు. ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింప లేదు. తన్ను ఎందరంగీకరించిరో వారందరికి, అనగా తన నామము నందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను". "లోకములోనికి వచ్చుచు" అను మాట వాక్యమై ఉన్న క్రీస్తు నరరూపధారిగా ఈ లోకములోనికి రావడము గురించి తెలుపుతుంది. ప్రతి మనుష్యుని వెలిగించుటకు ఈ లోకములోనికి వచ్చిన యేసుక్రీస్తును గురించిన సువార్త ఆయన సృష్టించిన మానవాళికి ప్రకటించవలసిన బాధ్యత మనకు ఉన్నది. పైపెచ్చు అది దేవుడు మనకిచ్చిన ఆజ్ఞ.

ఆయన ఈ లోకములోనికి వచ్చినపుడు తాను తన కొరకు సృష్టించుకున్న మానవులు తనను తృణీకరించారు. ఇది చాలా విచారించదగిన పరిస్థితి. ప్రతి తరములో ఎక్కువ శాతం ప్రజలు తమ సృష్టికర్తను తృణీకరించి ఆయనకు దూరమైపోతున్నారు. ఆయనతో ముఖాముఖిగా కలుసుకున్న ప్రతి మనిషి ఆయనను నిజమైన వెలుగుగా అంగీకరించవలసి యున్నది. ఎప్పుడైతే ప్రజలు యేసుక్రీస్తు నందు విశ్వాసముంచరో, దాని అర్థము వారి క్రియలు చెడ్డవై ఉన్నందున వారికి చీకటి ఇష్టమని, చీకటిలోనే కొనసాగాలని నిర్ణయము తీసుకొనుట. యేసుక్రీస్తు మనుషులను సృష్టించాడు కాబట్టి ఒక మొక్క ఏ విధంగా సూర్యరశ్మి కోరుకుంటుందో, అదే విధంగా మానవుడు కూడా సహజంగా తనకు జీవమిచ్చే క్రీస్తు వైపు మరలాలి. ఆయన వాక్యమును, ఆయన క్రియలను గుర్తించని వారు కావాలని అవిధేయత చూపడమో లేక సత్యమును అణచివేయాలని చేసే ప్రయత్నమో అయి ఉండవచ్చును. "ఆయన స్వకీయులు" అంటే యూదులు. ఇశ్రాయేలీయుల కొరకే ఈ లోకములోకి వచ్చిన ఆయనను తనవారే గుర్తించలేదు. వారి పితరుల వలె, యేసుప్రభువు కాలంలోని ఇశ్రాయేలీయులు వారి మనసులను కఠినపరచుకున్నారు. నెహెమ్యా 9:29లో ఈ విధంగా వ్రాయబడి ఉన్నది – "నీ ఆజ్ఞలను, విధులను ఒకడు ఆచరించిన యెడల వాటివలన వాడు బ్రదుకును గదా. వారు మరల నీ ధర్మశాస్త్రము ననుసరించి నడుచునట్లు నీవు వారి మీద సాక్ష్యము పలికినను, వారు గర్వించి, నీ ఆజ్ఞలకు లోబడక నీ విధుల విషయములో పాపులై నిన్ను తిరస్కరించి తమ

మనస్సును కఠినపరచుకొని నీ మాట వినకపోయిరి". పాత నిబంధన లేఖనములు ఆయనను గురించి ఇచ్చిన ఖచ్చితమైన సాక్ష్యములను కూడా వారు తిరస్కరించారు.

యోహాను 5:39లో యేసుప్రభువు యూదా మత పెద్దలతో అనిన మాటలు: "లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించు చున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి". అయినా వారు తనను అంగీకరించుటకు సిద్ధంగా లేరని యేసయ్య బాధపడుచున్నాడు. వారు తమ పాపములను ఒప్పుకొని, పశ్చాత్తాప హృదయముతో ఆయనను తమ రక్షకునిగా అంగీకరించుటకు బదులు "సిలువ వేయుడి" అని కేకలు వేయడమే గాక "వాని రక్తము మా మీదను, మా పిల్లల మీదను ఉండును గాకనిరి" (మత్తయి 27:25). ఈ తిరస్కారమునకు కారణము వారి మనసులు చీకటిలోను, అపవాది ఆధీనంలోను ఉన్నాయి. వారు క్రీస్తుయొక్క నిజమైన వెలుగును చూడనీయకుండ వారి ఆత్మీయ కన్నులు మూయబడ్డాయి. ఈనాడు కూడా అవే పరిస్థితులు నెలకొన్నాయి. క్రైస్తవ కుటుంబాలలో జన్మించిన వారే ఆయన వాక్యము చదువుటకు, ప్రార్థించుటకు, ఆయన పరిచర్యలో పాల్గొనుటకు ఇష్టపడుట లేదు. మనలను మనము పరీక్షించుకొని ఏ విధంగా ఉన్నామో ఆలోచించాలి.

యేసుప్రభువు యూదా గోత్రములో, దావీదు వంశములో పుట్టాడు. యేసయ్య తన సొంత గూటికి వచ్చినా తన వారెవరూ తనను గుర్తించక ఆయనను ఒంటిరివాణ్ణి చేశారు. ఇశ్రాయేలీయుల చరిత్ర అంతటిలో దేవుడు వారిని తమ మెస్సయ్య కొరకు ఎదురుచూచు వారిగా తయారు చేశాడు, కాని చాలామంది ఆయనను గుర్తించలేదు. కొద్దిమంది మాత్రమే ఆయనను గుర్తించి, ఆయనను విశ్వసించిన అన్యులతో పాటు నిలబడ్డారు. యేసుప్రభువును దేవుని కుమారునిగా అంగీకరించి, ఈ లోకానికి వెలుగుగా వచ్చిన ఏకైక రకక్షకునిగాను విశ్వసించిన వారితో సంఘము స్థాపించబడినది. అంగీకరించి, నమ్మినవారికి ఆయన పిల్లలగుటకు అధికారము ఇవ్వబడింది. యోహాను ఇక్కడ రెండు మాటలు వాడాడు. 'అంగీకరించుట', 'విశ్వసించుట'.

యేసుప్రభువు ఈ లోకములో ఉన్నప్పుడు ఆయన మెస్సియా అని ఒప్పుకోవడాన్ని 'అంగీకరించుట' అన్నారు. కాని ఇప్పుడు ఆయనను 'అంగీకరించుట' అంటే ఆయనను పరిశుద్ధాత్మ సాయంతో మనలోనికి స్వీకరించుట. అంటే ఆయన మన ప్రభువు, రాజు, పాపములో నుండి రక్షించుటకు శక్తిగల ఏకైక దేవుడు అని గుర్తించుట, ఆయనను అంగీకరించుట అనేది నిరంతర ప్రక్రియ – యేసుక్రీస్తు మన తలంపులలో, సంభాషణలో, కుటుంబములో, బయటి ప్రపంచములో ఉన్నప్పుడు ప్రథమస్థానములో ఉంచాలి. విశ్వసించుట అంటే ఆయనను అంగీకరించి, ఆయనకు చెందిన వారమనే భావంతో, ఆ సత్యములో జీవించుటకు మనలను మనము సమర్పించుకొనుట. ఈ రెండు ప్రక్రియలను కలిపి నిత్యజీవానికి క్రీస్తు అనే ద్వారము నుండి ప్రవేశించుట అని చెప్పవచ్చును. యేసుక్రీస్తును అంగీకరించుట ద్వారా దేవునితో క్రొత్త అనుబంధము ఏర్పడుతుంది. – ఆయన పిల్లలమవుతాము. 'పిల్లలు' అనే మాటకు పాత నిబంధనలో, క్రొత్త నిబంధనలో వేరు వేరు అర్థాలున్నాయి. పాత నిబంధనలో ఎవరైనా పిల్లలు కావచ్చు. ఉదాహరణకు ఇశ్రాయేలీయులంతా దేవుని పిల్లలే, అయితే ఇది విశ్వాసము మీద ఆధారపడి లేదు. అందుకే వీరికి రక్షణ నిశ్చయతగాని, ఆత్మీయ ఎదుగుదలగాని లేవు. క్రొత్త నిబంధనలో దేవుని పిల్లలగుట కేవలము విశ్వాసముపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే వీరికి రక్షణ నిశ్చయత, ఆత్మీయ సంబంధమైన జీవితాలు కలిగి ఉంటారు.

'అనుగ్రహించెను' అనుటలో అది సంపాదించుకున్నది కాదు గాని ఉచితంగా ఇవ్వబడిన బహుమతి – కృపావరము – అని గ్రహించాలి. పాత నిబంధనలోని పిల్లలు శరీరేచ్ఛలను బట్టి పుట్టారు గాని దేవుని వలన పుట్టిన వారు కారు. 'తిరిగి జన్మించుట' అను అంశము వారికి అర్థము కాదు. అందుకే మతబోధకుడు, ధర్మశాస్త్రము క్షుణ్ణంగా తెలిసి ఉన్న నీకొదేముకు కూడా అర్థము కాలేదు కనుక యేసుప్రభువును అడుగుటకు ఆయన దగ్గరకు వెళ్లాడు. 'రక్షణ' సంఘమునకు సంబంధించినది. యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించిన విశ్వాసులు ఆయన వెలుగులో, వెలుగు సంబంధులుగా నడుస్తారు.

యేసుప్రభువు ఈ లోకములోనికి వచ్చుటను గురించి లూకా సువార్తికుడు వివరిస్తూ ఈ విధంగా అంటున్నాడు “చీకటిలోను, మరణచ్ఛాయలోను కూర్చుండు వారికి వెలిగిచ్చుటకై ఆ మహావాత్సల్యమును బట్టి పైనుండి ఆయన మనకు అరుణోదయ దర్శనమనుగ్రహించెను”. జన్మత: పాపులమైన మనకు ఆయన రాక ఒక నూతన దినము వచ్చినట్లుగా ఉంది. పాపము వలన ఆత్మీయ గ్రుడ్డితనములో ఉన్న ప్రతి మానవుడు ఈ వెలుగును ఆహ్వానిస్తారని అనుకుంటాము కాని ఆ విధంగా జరుగుటలేదు. “నిజమైన వెలుగు”ను చీకటి శక్తులు అడ్డుకునే ప్రయత్నము చేస్తుంటాయి. వారి మనసులలో ఉన్న చీకటిని తొలగించుటకు వారికి వీలుకాదు. యేసుప్రభువు చెప్పిన ఆత్మీయ సత్యాలను అర్థము చేసుకోకపోవుటకు కారణము వారి ఆత్మీయ గ్రుడ్డితనమే. అపవాది నశించువారిని చీకటిలోనే ఉంచుటకు ప్రయత్నిస్తాడు. ఎందుకంటే చీకటి అంటే మరణము, నరకము కాగా వెలుగు అంటే జీవము, పరలోకము. యోహాను సువార్త క్రమబధంగా, కాలక్రమము బట్టి (Chronologically) వ్రాశాడు. మొదటి 12 అధ్యాయములు సర్వజనులకు పరిచర్య; 13–17 అధ్యాయములు వ్యక్తిగతమైన పరిచర్య; 18–21 అధ్యాయములు ఆత్మీయ పరిచర్యగా అగుపడుతున్నాయి. మొదటి భాగంలో వెలుగనియు; రెండవ భాగంలో ప్రేమనియు; మూడవ భాగంలో క్రీస్తు జీవమనియు, ఆయన చనిపోవుట ద్వారా మనకు జీవము వచ్చిందనియు చెప్తున్నాడు.

యోహాను సువార్త మొదటి అధ్యాయములో యోహాను “నిజమైన వెలుగు” యొక్క వ్యక్తిత్వమును లేక దైవత్వమును రుజువు చేయుటకు ఏడు బిరుదులు చెప్తున్నాడు.

1. యేసుక్రీస్తు నిత్యత్వములో ఉన్న వాక్యము;
2. ఆయనే వెలుగు, జీవము;
3. ఆయనే దేవుని కుమారుడు;
4. దేవుని గొర్రెపిల్ల ఆయనే;
5. ఆయనే యూదులు ఎదురు చూస్తున్న మెస్సయ్య;
6. ఇశ్రాయేలు రాజు ఆయనే;
7. మనుష్యకుమారుడు ఆయనే అని పరిచయం చేశాడు.

ఈ బిరుదులన్నీ సత్యమని సాక్ష్యులను కూడా యోహాను ఏర్పాటు చేశాడు. బాప్తిస్మమిచ్చు యోహాను ఆయనను గురించి ప్రకటించుటకును, వెలుగై ఉన్న ఆయనను గురించి సాక్ష్యమిచ్చుటకును దేవుడే స్వయంగా పంపాడు. ఆయన శిష్యులనుగా ఏర్పరచుకున్న అంద్రెయ, నతనియేలు కూడా చెప్పారు. యూదులు గొప్ప జనులుగా భావించే పాత నిబంధనలోని ఏడుగురు భక్తులను గురించి కూడా అక్కడక్కడ యోహాను ప్రస్తావిస్తూ వారికంటే యేసుప్రభువు గొప్పగా మెలిగాడని రుజువు చేస్తున్నాడు. వారిని గురించి ధ్యానిద్దాము :

**1. మోషే :** మోషే గురించి యోహాను చాలా సందర్భాలలో చెప్తూ, మోషే ద్వారా ధర్మశాస్త్రము ఈ లోకములోనికి వచ్చింది కాని దాని ద్వారా పరలోకమునకు పోలేము. పరలోకము నుండి వచ్చిన యేసయ్య ద్వారా జీవము, కృప వచ్చాయి. వీటి ద్వారా పరలోక ద్వారము ఏర్పడింది అని చెప్తూ తానే "మార్గమును, సత్యమును. జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పిన యేసయ్యను ప్రత్యక్షపరచాడు.

**2. యోసేపు :** యోహాను 4:5లో యోసేపు పేరు కనబడుతుంది. యోసేపుకు ఫరో పెట్టిన పేరు జప్నత్పనేహు (ఆది 41:45), దాని అర్థము లోక రక్షకుడు. దేవుడు యోసేపును ఐగుప్తులో పెట్టి, బహు ప్రజలను బ్రదికించునట్లుగా ఏర్పాటు చేశాడు. యేసుప్రభువు లోక పాపములు మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్లగా, బలి పశువుగా ఈ లోకాన్ని రక్షించుటకు వచ్చాడు.

**3. యాకోబు :** యోహాను 4:12 లో సమరయ స్త్రీ యాకోబు బావియొద్దకు నీటి కొరకు వచ్చి యేసయ్యతో "యీ బావి నీళ్ళు త్రాగి మాకిచ్చిన మన తండ్రియైన యాకోబు కంటె నీవు గొప్పవాడవా?" అని అన్నప్పుడు, యాకోబు బావిలో నీరు ఎండిపోవచ్చు, ఆ నీళ్లు త్రాగువాడు మరల దప్పిగొంటాడు గాని "నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను" (యోహాను 4:13-14).

**4. అబ్రాహాము :** యోహాను 8:58లో యేసయ్య తాము అబ్రాహాము సంతానమని చెప్పుకుంటున్న యూదులతో "అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నాను" అని చెప్పాడు. వారి పితరుని కంటే తాను గొప్పవాడనన్నాడు.

**5. దావీదు :** దావీదును ఇశ్రాయేలీయులు తమ రాజుగా భావించి, అంతకు మించిన రాజులు లేరనుకున్నారు. 12:13లో "ఇశ్రాయేలు రాజు స్తుతింపబడును గాక" అని యేసుప్రభువును చూచి కేకలు వేశారు.

**6. యెషయా :** యెషయా 6:1-5లో యెషయా ప్రవక్త దేవుని మహిమను చూశాడు కాబట్టి యూదులు ఆయన చాలా గొప్ప ప్రవక్తగా భావించారు, కాని యేసుప్రభువే దేవుని మహిమ (17:5) అని యోహాను చూపించాడు.

**7. యోనా :** యోహాను 21:17లో "యోహాను కుమారుడవైన సీమోను" (మత్తయి 16:17లో సీమోను బర్‌యోనా) అని పేతురును పిలుస్తున్నాడు. యోనా ప్రవక్త గురించి యూదులకు తెలుసు. పేతురుకు బర్‌యోనా అని పేరు. దాని అర్థము యోనా కుమారుడు (సీమోను పేతురు తండ్రి పేరు యోనా). దేవుడు చెప్పినట్లు యోనా నీనెవె పోకుండా యొప్పేకు పోయిన విధముగా పేతురు కూడా అన్య జనుల యొద్దకు వెళ్లుటకు మొదట్లో ఒప్పుకోలేదు కాని అన్యుల మధ్య తన పరిచర్య యొప్పే నుండే ప్రారంభించాడు (అపొ. కా. 9,10 అధ్యాయములు)

"నిజమైన వెలుగు"గా ఈ లోకాన్ని వెలిగించుటకును, పాపమనే చీకటిలో మగ్గుతున్న మానవాళిని సత్యమైనే వెలుగులోనికి తీసుకెళ్లుటకు యేసుక్రీస్తు నరావతారిగా ఈ లోకానికి వచ్చాడని యోహాను సువార్తికుడు రాస్తున్నాడు.

# ౨. వెలుగును గురించిన సాక్షులు

**యో**హాను సువార్తీకుడు యేసుక్రీస్తును “నిజమైన వెలుగు” గాను, దేవుని కుమారునిగాను మనకు పరిచయము చేస్తూ, తాను చెప్పిన మాటలన్నీ సత్యములే అని రుజువు చేయుటకు కొందరు సాక్షులను ఎన్నుకున్నాడు. యోహాను సువార్తలో ఏడుగురు సాక్షులు కనపడుతారు. వారు వెలుగును గురించి చెప్పిన మాటలు ధ్యానించుకుందాము :

1. బాప్తిస్మమిచ్చు యోహాను – యోహాను 1:6–8
2. విశ్వసించిన మనుషులు – యోహాను 4:39; 12:17; 15:27; 19:35; 21:24.
3. తండ్రియైన దేవుడు – యోహాను 5:31,32,37; 8:18.
4. యేసుప్రభువు చేసిన క్రియలు – యోహాను 5:36; 10:25.
5. లేఖనములు – యోహాను 5:39, 45, 46.
6. క్రీస్తు (తనకు తానే) – యోహాను 8:12–14.
7. పరిశుద్ధాత్మ దేవుడు – యోహాను 15:26.

యేసుక్రీస్తు శిష్యుడైన యోహాను తన ప్రభువు ఈ లోకానికి వెలుగుగా వచ్చాడని రుజువు చేయుట చాలా ప్రాముఖ్యంగా తీసుకున్నాడు. ఎందుకంటే ఆనాటి కాలంలోనే యేసుప్రభువును గురించి అబద్ధబోధలున్నాయి. అవి ఖండించుటకును, సత్యాన్ని చూపుటకు గాను ఈ సువార్త వ్రాశాడు. అందుకే తాను చెప్తున్న విషయాలన్నీ అందరూ విశ్వాసించాలనే ఆశతో ఈ సాక్షులను ప్రవేశ పెడుతున్నాడు. న్యాయస్థానములో ఏ విషయమైనా రుజువు చేయుటకు ఇద్దరు

సాక్షులుంటే చాలు, కాని యేసుక్రీస్తు "నిజమైన వెలుగు" అని స్థిరపరచుటకు యోహాను చాలా మంది సాక్షులను ఎన్నుకున్నాడు. ఏడు అను సంఖ్య పరిపూర్ణతకు చిహ్నము కాబట్టి ఈ సువార్తలో 7 రకాల సాక్షులు కనపడుతున్నారు. వీరిని గురించి కొన్ని సంగతులు మనము ధ్యానించుకుందాము.

## 1. బాప్తిస్మమిచ్చు యోహాను :

యోహాను సువార్తికుడు బాప్తిస్మమిచ్చు యోహానును మొదట్లోనే ప్రవేశ పెడుతున్నాడు. అతని గురించి వ్రాయబడిన మాటలు చదువుకుందాము : "దేవుని యొద్ద నుండి పంపబడిన యొక మనుష్యుండుండెను; అతని పేరు యోహాను, అతని మూలముగా అందరు విశ్వసించునట్లు అతడు ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు సాక్షిగా వచ్చెను. అతడు ఆ వెలుగై యుండలేదు గాని ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు అతడు వచ్చెను" (1:6-8). "దేవుని యొద్ద నుండి పంపబడిన వాడు" అని చెప్పబడిన ఈ సాక్షిని గురించి చాలా విషయాలు ప్రాముఖ్యంగా చెప్పు కోవచ్చును. దేవుని యొద్ద ఇదివరకే ఉన్నవాడు. ఈ పనిమీద దేవునిచే పంపబడిన వాడు, సాక్షిగా ఉండుటకు ప్రత్యేకముగా పంపబడినవాడు, నాజీరు వ్రతమును ఆచరించినవాడు, భూలోకమునకు వెలుగై ఉండుటకు వచ్చిన ఆయనను గురించి సాక్ష్యమిచ్చుటకు దేవుని యొద్ద నుండి పంపబడ్డాడు.

యోహాను పరిచర్య గురించి యెషయా 40:3-5లోనూ, మలాకీ 3:1లోనూ ప్రవచింపబడి ఉంది.

యేసుప్రభువు పుట్టుకను గురించిన ప్రవచనాల తర్వాత బైబిలు అంతటిలో యోహాను గురించి తప్ప ఏ మనిషి గురించి గాని, ఏ ప్రవక్త గురించి గాని ఇంత స్పష్టంగా ప్రవచింపబడలేదు. ప్రవచన నెరవేర్పుగా ఈ లోకమునకు రావడము అనునది యోహానుకు ఉన్న విశిష్టత. బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క జననము గురించి, అతని తల్లిదండ్రుల గురించి లూకా సువార్తీకుడు చాలా విశదంగా వ్రాశాడు. యోహాను సువార్తీకుడు కేవలము అతనిని సాక్షిగా మాత్రమే పరిచయం చేస్తున్నాడు కాబట్టి అతని పుట్టుపుర్వోత్తరాల గురించి చెప్పడము అవసరము లేదనుకున్నాడు. పాఠకులకు అతని గురించి తెలుసుకోవలసిన అవసరముంది కాబట్టి క్లుప్తంగా జ్ఞాపకము చేసుకుందాము.

హేరోదు రాజు పరిపాలనలోని చివరి దశలో బాప్తిస్మమిచ్చు యోహాను జన్మించాడు. అతడు యేసయ్య తల్లి మరియకు, బంధువురాలైన ఎలీసబెతు, జెకర్యాల కుమారుడు, వారిరువురు లేవీ గోత్రపువారు, ఎలీసబెతు గొడ్రాలుగా ఉన్నది, జెకర్యా యాజక ధర్మము జరిగించుచుండగా గబ్రియేలు దూత ప్రత్యక్షమై యోహాను జననము గురించి ప్రకటించాడు. దూత సందేశములో 7 సంగతులు జెకర్యాకు చెప్పాడు.

1. యోహాను (యెహోవా కృప అని అర్థము) అను పేరు పెట్టుదువు.
2. అతడు ప్రభువు దృష్టికి గొప్పవాడుగా ఉండును.
3. ద్రాక్షారసమైనను, మద్యమైనను త్రాగక నాజీరు చేయబడాలి.
4. తల్లి గర్భమున పడినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఉండును.
5. ఇశ్రాయేలీయులలో అనేకులను ప్రభువువైపునకు తిప్పును. ప్రభువు మొదటి ఆగమనమునకు ముందు ఈ పని బాప్తిస్మమిచ్చు యోహాను చేశాడు, రెండవ రాకడ ముందు ఏలీయా చేస్తాడని మలాకీ 4:5,6లో వ్రాయబడి ఉంది.
6. ఏలీయా యొక్క ఆత్మయు, శక్తిగలవాడై ప్రజలను ఆయత్తపరచును.
7. మెస్సీయ మార్గమును సిద్ధపరచును. యెషయా 40:3లో ఉన్న ప్రవచనము నెరవేరును. యెషయా 40:3లో "ఆలకించుడి, అడవిలో ఒకడు ప్రకటించు చున్నాడు ఎట్లనగా – అరణ్యములో యెహోవాకు మార్గము సిద్ధపరచుడి, ఎడారిలో మా దేవుని రాజమార్గము సరాళము చేయుడి".

మార్గము సిద్ధపరచుటకు ఒకడు వస్తాడని యెషయా ప్రవచించాడు. క్రీస్తు తీసుకొని రాబోయే సువార్తను ప్రజలు అంగీకరించుటకును, "లోయలు" అనగా ఆత్మ సంబంధమైన లోపాలు తీసివేయుటకును, "పర్వతాలు", "మెట్టలు" వంటి గర్వాహంకారములు అడ్డులేకుండా వాటిని చదును చేయుటకు గాను, వంకర మార్గాలలో నడిచే వారిని తిన్నని మార్గాలలో నడిపించుటకై పంపబడ్డాడు. ఈ అడ్డంకులన్నీ తొలగితేనే గాని సకల శరీరులు దేవుని రక్షణ చూడలేరు, యేసుక్రీస్తును వెలుగును గుర్తించి ఆ వెలుగులోనికి ప్రవేశించలేరు.

"స్త్రీలు కనినవారిలో యోహాను కంటె గొప్పవాడెవడును లేడు" (లూకా 7:28) అని యేసుప్రభువు అతని గురించి చెప్పాడు. ఎందుకాయన ఇలాంటి ఘనత ఇచ్చాడో చూద్దాము :

1. తాను ఎందుకైతే పంపబడ్డాడో అందుకే బ్రతికాడు, అడవిలో జీవించాడు. ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలు దట్టి ధరించుకొనువాడు – అవసరమైనంత మట్టుకు మాత్రమే. మిడతలు, అడవి తేనెయు అతని ఆహారము. తేనె దేవుని వాక్యమునకు సాదృశ్యము. ఇహలోక వాసులకు దూరముగా ఉంటూ తన పిలుపు వచ్చు వరకు తనను తాను సిద్ధపరచుకొన్నాడు. గమ్యం వైపు నడిచాడు. పిలుపు రాగానే క్రీస్తును గురించి ప్రకటించుట మొదలు పెట్టాడు. క్రీస్తను వెలుగుకు సాక్షిగా, అంటే కల్పితాలు కాకుండా ఉన్నదున్నట్లుగా సత్యాలు ప్రకటించుట. మారుమనసు పొంది వెలుగును గుర్తించండి అని చెప్పాడు. నిజమైన వెలుగు గురించి అద్భుత సాక్షాలు ప్రకటించాడు.

2. తన్ను తాను మరుగు పరచుకొని, కేవలము "నిజమైన వెలుగు"ను మాత్రమే మహిమ పరచాడు. తానెవరు అని యూదా మత పెద్దలు అడిగినపుడు, వారనుకున్నట్లు తాను ఏలీయాను కాననియు, క్రీస్తును కాననియు చెప్పి తాను అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒక శబ్దము మాత్రమే అన్నాడు.

3. వెలుగైయున్న క్రీస్తు యొక్క చెప్పుల వారును విప్పుటకైనను తాను యోగ్యుడను కాననియు, ఆయన హెచ్చవలసి యున్నది. తాను తగ్గవలసి యున్నదని చెప్పాడు.

4. తాను పెండ్లి కుమారుని స్నేహితుడనని చెప్పాడు. పెండ్లి కుమారుని స్నేహితుడెప్పుడూ పెండ్లి కుమారుని ప్రశంసిస్తాడు.

5. ఇతను ప్రవక్తలలో చివరివాడు. ప్రవక్తలు దేవుని నుండి సందేశాలు తెచ్చేవారు. యేసుప్రభువనే "నిజమైన వెలుగు" ను గురించి సాక్ష్యమిచ్చుటకు దేవుడే పంపాడు. యేసుప్రభువు మొదటిసారి వచ్చినపుడు పరిశుద్ధాత్మతోను,రెండవ సారి అగ్నితోను బాప్తిస్మమిస్తాడని ప్రభువును గురించి చెప్పాడు.

6. యెహోవా యందలి భయభక్తులు బహు ధైర్యము పుట్టించును అని లేఖనములు చెప్పినట్లు అతను భయపడకుండా హేరోదు రాజు చేస్తున్న పాపమును ఎత్తి చూపించి, తద్వారా శిరచ్ఛేదనము గావించబడ్డాడు.

7. అతని శిష్యులలో ఇరువురు – అంద్రెయ, పేతురు యేసును గురించి తెలిసికొని తనను వదిలిపెట్టి "నిజమైన వెలుగు" (యేసయ్య) ను వెంబడించినపుడు సంతోషించి, ప్రోత్సహించాడు.

ఈ కారణాలన్నిటిని బట్టి ప్రజలు అతనిని బాగుగా ఎరుగుదురు కనుక అతనిని మొదటి సాక్షిగా యోహాను సువార్తికుడు ఎన్నుకున్నాడు.

"నిజమైన వెలుగు"కు సాక్షిగా వచ్చిన బాప్తిస్మమిచ్చు యోహాను తన బాధ్యత నెరవేర్చుటకు సిద్ధపడుతూ, దేవుని పిలుపు కొరకు ఎదురు చూస్తున్న సమయంలో దేవుని వాక్యము వచ్చినట్లుగా చూస్తున్నాము. బాప్తిస్మమిచ్చు యోహాను అరణ్యములో ప్రకటించుట మొదలు పెట్టగానే చాలా మంది యూదయ, యెరూషలేము నుండి వచ్చి వినుట మొదలు పెట్టారు. పరిశుద్ధాత్మ దేవుడు యోహాను ద్వారా శక్తివంతముగా మాట్లాడి వారి పాపాలు ఒప్పుకొనేటట్లు చేశాడు. దేవుని వెలుగులో తమ పాపాలు చూసుకొనేటట్లుగా వారి మనసులను త్రిప్పాడు. పాపపు ఒప్పుకోలు, బాప్తిస్మము మనకు అవసరం లేదు అనుకున్న యూదులు కూడా మారిపోయి, లోకానికి వెలుగుగా రాబోతున్న మెస్సయ్య కొరకు నిరీక్షించేవారిగా తయారు చేశాడు. బాప్తిస్మమిచ్చు యోహానే తాము ఎదురుచూస్తున్న వెలుగు అనుకున్నారు గాని తాను ఆ వెలుగును కాదనియు, ఆ వెలుగును గురించి ప్రకటించుటకు వచ్చిన సాక్షిని మాత్రమే అని చెప్పాడు. యేసుప్రభువు నిజమైన వెలుగై ఉండగా, ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు వచ్చిన వాడనని యోహాను గుర్తించి ఆ విధముగానే ప్రవర్తించాడు. యేసు అతనిని గురించి చెప్తూ అతనిని "ప్రజ్వరిల్లు దీపము" అన్నాడు. దీపమే గాని వెలుగును కాను అను విషయము యోహాను అర్థము చేసుకున్నాడు. దీపము కుంచము క్రింద పెట్టరు గాని అందరికీ వెలుగిచ్చుటకు దీపస్తంభముపైన పెడ్తారు. బాప్తిస్మమిచ్చు యోహానును దేవుడు దీపస్తంభము మీద ఉంచి "నిజమైన వెలుగు"

యొద్దకు దారి చూపించేవాడిగా ఏర్పాటు చేశాడు. యోహాను తన జీవితాంతము యేసుప్రభువును హెచ్చించేవాడిగా ఉండి, ఇతరులకు ప్రయోజనకరంగా ఉన్నాడు. “నిజమైన వెలుగు” మార్గంలో నడవాలని నిర్ణయించుకున్న మనమందరము యోహాను వలె క్రీస్తుకు సాక్షులుగా ఉండాలనునదే దేవుని చిత్తము.

బాప్తిస్మమిచ్చు యోహాను తాను పంపబడిన పనిని మాత్రమే చేసాడనుటకు ఇంకొక రుజువు సువార్తీకుడైన యోహాను చూపిస్తున్నాడు. యోహాను సువార్త మొదటి అధ్యాయములో ‘మరునాడు’ అనుమాట మూడుసార్లు కనబడుతుంది. ఇందులో నాలుగు రోజులలో జరిగిన సంఘటనలు గ్రంథస్తము చేయబడి ఉన్నాయి. ఈ నాలుగు దినాలలో బాప్తిస్మమిచ్చు యోహాను గురించి, అతని శిష్యులను గురించి వ్రాయబడి ఉంది. ఆ నాలుగు దినాలలో బాప్తిస్మమిచ్చు యోహాను కేవలము నిజమైన వెలుగును గురించి పరిచయములు, నమ్మిన వారికి బాప్తిస్మమిచ్చుట తప్ప వేరే పని ఏదీ చేసినట్లుగా వ్రాయబడలేదు. అన్ని రోజులూ తాను సాక్ష్యమిచ్చుటకు వచ్చాడు కాబట్టి, సాక్షిగానే ఉన్నాడు. తనను గూర్చి తాను చెప్పుకోవాలని ఏనాడూ అనుకొనలేదు. మొదటి రోజు “నా వెనుక వచ్చువాడు నాకంటె ప్రముఖుడు గనుక ఆయన కంటె ముందటి వాడాయెననియు, నేను చెప్పినవాడు ఈయనే అనియు ఎలుగెత్తి చెప్పెను”; రెండవ రోజు “ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల” (1:29) అని పరిచయం చేశాడు; “ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితిననెను” (1:34); మూడవరోజు కూడా “ఇదిగో దేవుని గొర్రెపిల్ల” (1:36) అని చెప్పాడు. అతని మాటలను బట్టి అతని శిష్యులైన పేతురు, ఆంద్రెయలు యేసయ్యను వెంబడించారు; నాల్గవరోజు యోహాను సాక్ష్యము వలన ఫిలిప్పు, నతనయేలు అనువారు యేసుప్రభువును వెంబడించారు.

యోహాను సువార్తీకుడు తన సాక్షుల ద్వారా “నిజమైన వెలుగు” అయిన యేసయ్య లోకరక్షకునిగా ఈ లోకానికి మానవరూపంలో వచ్చిన దైవకుమారుడు అని రుజువు చేస్తున్నాడు. “సాక్షి” అనుమాట యోహాను సువార్తలో చాలా ప్రాముఖ్యంగా కనపడుతుంది, బాప్తిస్మమిచ్చు యోహాను కేవలము సాక్షిగా ఉండుటకే ప్రవచ

నాత్మకంగా పంపబడినవాడు. అతను చెప్పిన సాక్ష్యము యోహాను 1:32-34లో చూడగలము – "మరియు యోహాను సాక్ష్యమిచ్చుచు ఆత్మ పావురమువలె ఆకాశము నుండి దిగి వచ్చుట చూచితిని; ఆ ఆత్మ ఆయన మీద నిలిచెను, నేను ఆయనను ఎరుగనైతిని గాని నీళ్లలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపినవాడు నీవేనని నీ మీద ఆత్మ దిగివచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చు వాడని నాతో చెప్పెను. ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితిననెను".

మనము వెలుగును గురించిన 7 రకాల సాక్ష్యములు ఈ అధ్యాయములో చూస్తున్నాము. ఈ సాక్ష్యాలన్నీ ఎందుకు అనే అనుమానాలు మనలో కలుగుచుండ వచ్చును. పాపమనే చీకటిలో మగ్గుతున్న మానవాళిని నిత్యజీవమనే వెలుగులోనికి తీసికొని వెళ్లుటకు "నిజమైన వెలుగు" గా ఈ లోకానికి వచ్చిన యేసుప్రభువు జననము నుండి పరిచర్యకు వచ్చే సమయానికి మధ్య ముప్పది సంవత్సరములు గడిచింది. ఆ సమయంలో ఆయన నజరేతులో ఒక వడ్లవానిగా ఉన్నాడు, కాని ఇప్పుడు ఆయన సిలువలో ముగించవలసిన బహిరంగ పరిచర్యకు సమయము ఆసన్నమైంది. ఆయన ఇంకా "నిజమైన వెలుగు"గా ఉండుటకు యోగ్యత ఉన్నదా? ఆయనను అయోగ్యునిగా చేయుటకు ఏమైనా సంభవించిందా? అను ప్రశ్నలు సామాన్య మానవుని మదిలో తలెత్తి ఉండవచ్చును. ఈ ప్రశ్నలకు జవాబు ఇవ్వడానికి, ఆయన దేవుని కుమారుడని రుజువు చేయుటకు సాక్షులు అవసరమైనారు. ఆ సాక్షులలో యోహాను ప్రధాన పాత్ర పోషించాడు.

బాప్మిస్మమిచ్చు యోహాను పాత నిబంధన ప్రవక్తలలో చివరి ప్రవక్తగా పేర్కొనబడ్డాడు. అబ్రాహాము, మోషేలాంటి ప్రవక్తలున్నా సమూయేలు ప్రవక్త, ప్రవక్తల తరములో మొదటివానిగా పరిగణించబడ్డాడు. ఆయన ఇశ్రాయేలీయుల యొక్క మొదటి రాజు సౌలును పరిచయం చేయగా, యోహాను ప్రవక్త రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు, నిత్యుడగు దైవకుమారుడు, లోకానికి నిజమైన వెలుగుగా వచ్చిన యేసుప్రభువును మానవాళికి పరిచయం చేశాడు. తనకప్పగింపబడిన బాధ్యత

నెరవేర్చుటలో ధైర్యము ప్రదర్శించాడు. పరిసయ్యులు, సద్దూకయ్యులు, ఇంకా మిగిలిన యూదా మత పెద్దల వేషధారణను ఎత్తి చూపిస్తూ వారు ఆత్మీయ గ్రుడ్డితనములో ఉన్నారను సత్యము తెలుపుటకు వెనుదీయలేదు. "సర్పసంతానమా" అని సంబోధిస్తూ రాబోవు ఉగ్రతను వారు తప్పించుకోలేరని చెప్పాడు. సమాజములో అన్ని వర్గాల వారికి జీవిత విధానాలలో అవసరమైన మార్పులను గురించి బోధించాడు. మారుమనస్సు పొంది పాపముల నుండి విముక్తి పొందాలని బోధించాడు. యోహాను బోధలు యేసుప్రభువు బోధలను పోలి ఉండేవి. ఆ కాలంలో యోహాను అను పేరు చాలా మందికి ఉండేది. యోహాను పరిచర్యలో "బాప్తిస్మము" చాలా ప్రాముఖ్యత వహించినందున ఆయనను బాప్తిస్మమిచ్చు యోహాను అని పిలిచేవారు. ఆయన మాటల చేత ప్రభావితులైన వారు యోర్దాను నదిలో ఆయన చేత బాప్తిస్మము తీసుకొనేవారు.

యేసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడనియు, ఆయనే దేవుని కుమారుడనియు, లోక రక్షణార్థము బలిపశువుగా వచ్చిన దేవుని గొర్రెపిల్ల అని సాక్ష్యము చెప్పడము వలన అనేకులు యేసునందు విశ్వాసముంచారు. యోహాను ఏ బోధకుని యొద్ద నేర్చుకోకపోయినను, తల్లి గర్భమునుండే పరిశుద్ధాత్మతో నింపబడిన వాడు కాబట్టి పరిశుద్ధాత్మ సాయంతో బోధించుట చేత, వినిన వారిని ఆయన మాటలు బాగా ప్రభావితము చేశాయి. అతని మాటలు దేవుని మాటలు కాబట్టి రెండంచుల పదునుగల ఖడ్గములాగే వేలాది మంది ప్రజల హృదయాలలోకి ప్రవేశించి, వారిని శుద్ధిచేసి, పాపక్షమాపణ, ప్రాయశ్చిత్త బాప్తిస్మము యొద్దకు నడిపించాయి.

తనకు అప్పగించిన పనిలో అపనమ్మకస్థుడు కాకుండునట్లు ప్రజలను తనవైపు ఆకర్షించుకోలేదు. అంతేగాక, తనను గాక వెలుగైన క్రీస్తునే ప్రజలకు కనుపరచాడు.

## 2. విశ్వసించిన మనుషులు "నిజమైన వెలుగు"కు సాక్షులు :

యేసుప్రభువు మరణించి, తిరిగిలేచి, పరలోకమునకు ఆరోహణుడవక ముందు తన శిష్యులను పిలిచి "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునపుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ

దేశముల యందంతటను, భూదింగతముల వరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అపొస్తలుల కార్యములు 1:8). సాక్షులై యుండుట ప్రభువు చిత్తము, ఆయన వెలుగులోకి వెళ్లి, ఆ వెలుగులోని ఆనందము అనుభవించినవారు తమ ఆనందాన్ని ఇతరులకు పంచాలని ఆశిస్తారు.

ఇంతకూ సాక్షులుగా ఉండుట అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. 'సాక్షి' 'సాక్ష్యము' అనునవి న్యాయ స్థానములో వాడే పదాలు. యేసుప్రభువు విషయములో యేసుప్రభువు ముద్దాయి; మనము ఆయన పక్షముగా సాక్ష్యము చెప్పేవారము; పరిశుద్ధాత్మ దేవుడు యేసయ్య పక్షముగా వాదించు న్యాయవాది, అపరాధము మోపువాడు అపవాది, న్యాయమూర్తి అన్యుడు (యేసుప్రభువును ఎరుగనివాడు). ఈ విషయము మనము సరిగా అర్థము చేసుకుంటే అపవాది యేసుప్రభువుపై నేరారోపణ చేస్తుండగా, పరిశుద్ధాత్మ సాయంతో యేసయ్య పక్షముగా మనము సాక్షులుగా నిలబడి, అన్యుడికి ఆయన గొప్పతనము రుజువు చేయాలి. దేవుడు తన ఏకైక కుమారుని మన నిమిత్తము ఈ లోకములోనికి "నిజమైన వెలుగు" గా పంపించి, చీకటి అనే పాపకూపములో నుండి మనలను బయటకు లాగి తన నిత్య వెలుగులోనికి, తద్వారా పరలోకములోనికి తీసికొని వెళ్లుటకు యోగ్యుడు అని మనము సాక్ష్యము ఇవ్వగలగాలి, ప్రభావవంతముగా మనము సాక్ష్యము ఇవ్వాలంటే మొదట మనము ఆయన వెలుగులో ప్రవేశించి, దానివలన లాభములు, ఆశీర్వాదములు అనుభవపూర్వకముగా తెలుసుకోవాలి.

యోహాను సువార్తీకుడు తాను యేసుప్రభువును "నిజమైన వెలుగుగా" పరిచయం చేయతలంచాడు కాబట్టి, అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వారి సాక్ష్యములు గ్రంథస్తము చేశాడు.

**ఎ.** యోహాను 4:39లో "నేను చేసినవన్నియు నాతో చెప్పెనని సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్క మాటను బట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి" అని వ్రాయబడి ఉంది. యోహాను 4వ అధ్యాయములో ఒక సమరయ స్త్రీ యొక్క అద్భుత సాక్ష్యము గ్రంథస్తము చేయబడి ఉన్నది. సమరయలోని

సుఖారను ఊరిలోని ఒక స్త్రీని యేసుప్రభువు సంధించాడు. ఆమె లేఖనములు, ఆచారాలు బాగా తెలిసిన వ్యక్తి, అంటే ఇహలోక పరమైన జ్ఞానము కలిగిన స్త్రీ, కాని పాపమనే చీకటిలో జీవిస్తూ ఆత్మీయ జ్ఞానము లేకుండా ఉన్నది, సత్యమును అన్వేషిస్తూ, అయిదుగురు భర్తలను వదిలేసి, ఆరవవాడితో అక్రమ సంబంధము పెట్టుకొని, అతనితో జీవిస్తూ ఊరి వారితో ద్వేషింపబడుతున్న సమయంలో "నిజమైన వెలుగు"గా ఈ లోకంలోకి వచ్చిన యేసయ్య ఆమె జీవితంలోని చీకటిని పారద్రోలాడు. ఆమెకు దేవుడిని ఆరాధించే విధానము నేర్పించి, తానే వారు ఎదురు చూస్తున్న మెస్సీయ అని తనను తాను ప్రత్యక్షపరచుకోగానే ఆమె ఆత్మీయ గ్రుడ్డితనము వీడి నిజమైన వెలుగులోనికి నడిపించబడింది. తాను అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యము తన ఊరివారితో చెప్పుటకు పరుగులు తీసింది. "ఆ స్త్రీ తన కుండ విడిచి పెట్టి ఊరిలోనికి వెళ్లి – మీరు వచ్చి, నేను చేసినవన్నీ నాతో చెప్పిన మనుష్యుని చూడుడి; ఈయన క్రీస్తుకాడా అని ఆ ఊరివారితో చెప్పగా, వారు ఊరిలో నుండి బయలుదేరి ఆయన యొద్దకు వచ్చుచుండిరి" (యోహాను 4:28–30). ఆమెను అంతవరకు పాపాత్మురాలిగా ఎంచిన ఆ ఊరి ప్రజలు యేసుప్రభువు వెలుగును తన నుండి ప్రసరింపచేస్తున్న ఆమెను చూడగానే ఆమె చెప్తున్న విషయము సత్యమని స్థిరపరచుకొని, యేసయ్య యొద్దకు వచ్చారు. ఈ సంఘటనలో సమరయ స్త్రీ సాక్షిగా నిలబడి తన ఊరివారినందరినీ యేసయ్య వెలుగులోకి నడిపించింది.

**బి.** యోహాను 12:17 – "ఆయన లాజరును సమాధిలో నుండి పిలిచి మృతులలో నుండి అతని లేపినప్పుడు ఆయనతో కూడా ఉండిన జనులు సాక్ష్యమిచ్చిరి". బేతనియ గ్రామంలో జరిగిన అద్భుతము చూసిన జనులంతా సాక్షులుగా నిలిచారు. మార్త, మరియల సహోదరుడైన లాజరు మరణించినపుడు, వారు యేసయ్యకు కబురు పంపారు. తానే పునరుత్థానమును, జీవమునై యున్నానను సత్యమును రుజువు చేయతలంచిన ప్రభువు నాలుగు రోజులనంతరము బేతనియకు వచ్చి లాజరు సమాధి యొద్దకు వెళ్లి "లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా, చనిపోయినవాడు, కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను" (యోహాను 11:43,44). ఈ సంఘటనకు ముందు "నీవు నమ్మిన యెడల

దేవుని మహిమ చూతువని" మార్తకు చెప్పియుండెను. "నిజమైన వెలుగు" దేవుని మహిమయై ఉన్నది. ఆయన మహిమ చూచిన జనులందరు ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చిరి.

**సి.** యోహాను 15:27 – "మీరు మొదటి నుండి నా యొద్ద ఉన్న వారు గనుక మీరును సాక్ష్యమిత్తురు". యేసుప్రభువు సిలువ శ్రమలకు ముందు చివరి వారము తన శిష్యులకు బోధించుటలో ఎక్కువ సమయము గడిపాడు. తాను ఈ లోకములో నుండి వెళ్ళిపోయిన తర్వాత వారందరు ప్రధాన సాక్షులుగా ఉండాలని ఆయన ఉద్దేశము. మూడున్నర సంవత్సరాలు ఆయనతో పూర్తిగా సమయము గడిపిన శిష్యులు ఆయన నైజము, ఆయన అలవాట్లు ఆయన వ్యక్తిత్వము, ఆయన దైవత్వము, మానవత్వము, ఆయన వెలుగును గురించి అనుభవ జ్ఞానము కలిగియున్నారు కాబట్టి వారితో ఈ మాటను అంటున్నాడు. ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా వారి మధ్య నుండి వెళ్లిపోయిన తర్వాత యేసయ్య వారితో అనేక విషయాలు ప్రస్తావించాడు. సార్వభౌముడైన ఆయన వారిని కలవరపడకుడని చెప్పి, తన తర్వాత పరిశుద్ధాత్మ దేవునిని తాను పంపుతాననియు, ఆయన వారితో ఉండి అన్ని విషయములలోను వారికి ఆదరణకర్తగాను, సహాయకారిగాను ఉంటాడనియు చెప్పిన తర్వాత, ఆయన ఎలాగూ సాక్షిగానే ఉంటాడు, మీరు కూడా ఉండండని చెప్పాడు.

సంఘముపై ప్రపంచానికి ఉండబోవు శతృత్వమును గురించి కూడా చెప్తూ, ఆ చీకటిలో వీరిని వెలుగై ఉండమనియు, "నిజమైన వెలుగు"కు సాక్ష్యులుగాను ఉండమని చెప్పాడు.

**డి.** యోహాను 19:35, 36 – "ఇది చూచినవాడు సాక్ష్యమిచ్చుచున్నాడు; అతని సాక్ష్యము సత్యమే. మీరు నమ్మునట్లు అతడు సత్యము చెప్పుచున్నాడని ఆయనెరుగును – అతని యెముకలలో ఒకటైనను విరువబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను".

యేసుప్రభువును బంధించి, సిలువ వేయుటలో ప్రధానపాత్ర పోషించిన సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కలో పొడిచినపుడు, యేసయ్య ప్రక్కనుండి రక్తము, నీరు కారినపుడు అతను ఇచ్చిన సాక్ష్యమిది. ఆయన నిజముగా ఈ లోకానికి వచ్చిన వెలుగు, రక్షకుడు అని గుర్తించి సాక్ష్యమిచ్చాడు. ఆయనకు

శత్రువులుగా ఉన్నావారు అనుభవపూర్వకంగా తెలుసుకొని, నమ్మి చెప్పిన సాక్ష్యము బహు అమూల్యమైనది, యోహాను సువార్తీకుడు ఇతని సాక్ష్యమును గ్రంథస్తము చేస్తూ ఆ సాక్ష్యము ప్రవచన నెరవేర్పు అని కూడా చెప్తున్నాడు. యేసుప్రభువు దైవకుమారుడు, అతనిలో ఏ పాపము లేదను సత్యము ఆనాటి శత్రువులందరికీ తెలుసు. అపవాదికి కూడా తెలుసు కాని ఉద్దేశపూర్వకంగా అపవాది వారికి ఆత్మీయ గ్రుడ్డితనము కలుగజేసి "నిజమైన వెలుగు" ను వారి జీవితాలలోకి ఆహ్వానించకుండా అడ్డుకున్నాడు. యూదా మతపెద్దలందరు లేఖనములు విస్తారంగా పఠించినవారైనా ఆయనను గుర్తించలేదు. రోమా అధికారులు ఆయన నిర్దోషి అని తెలిసినా ఆయనను శిక్షించుట ఆపలేదు. ఈ సందర్భములో ఒక సైనికుడు ఆయనను గుర్తించాడు. "నిజమైన వెలుగు"ను గుర్తించి, గ్రహించిన వారు ఏ హోదాలో ఉన్నను రక్షింప బడుతారు.

**ఇ.** యోహాను 21:24 – "ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసిన శిష్యుడు ఇతడే; ఇతని సాక్ష్యము సత్యమని యెరుగుదము". యోహాను సువార్తీకుడు తనను గురించి తాను చెప్పుకుంటున్నాడు. తాను యేసుప్రభువు ప్రేమించిన శిష్యుడనని చెప్పాడు. అతను యేసయ్య అంతరంగిక శిష్యులలో ఒకడు. ప్రభువుకు స్వయానా పినతల్లి కుమారుడైనందున ఆయనతో అత్యంత చనువుగా ఉంటూ ఆయన రొమ్మున ఆనుకున్న శిష్యుడు. అందుకే యేసుప్రభువును చాలా సమీపంగా తెలిసికొని చెప్పగలుగుతున్నాడు. ఈయన సాక్ష్యము సత్యమని మనము గ్రహింపగలము.

వీరందరి లాగా యేసుప్రభువు వెలుగును మనలో నుండి ఇతరులకు ప్రసరిస్తూ సాక్షులుగా జీవించాలి.

### 3. తండ్రియైన దేవుడు నిజమైన వెలుగుకు సాక్షి :

**ఎ.** యోహాను 5:31-32 – "నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనిన యెడల నా సాక్ష్యము సత్యము కాదు. నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు వేరొకడు కలడు; ఆయన నన్ను గూర్చి ఇచ్చు సాక్ష్యము సత్యమని యెరుగుదును". యేసుప్రభువు యూదా పెద్దలతో మాట్లాడుతూ నేను చెప్పిన మాటలు ఒకవేళ మీరు నమ్మకపోయినా వేరేవాళ్లు ఇచ్చిన సాక్ష్యమైనా నమ్మండి అన్నాడు.

**బి.** యోహాను 5:37 – “మరియు నన్ను పంపిన తండ్రియే నన్నుగూర్చి సాక్ష్యమిచ్చు చున్నాడు; మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు; ఆయన స్వరూపము చూడలేదు” అని యేసయ్య అంటున్నాడు.

**సి.** యోహాను 8:18 – “నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనువాడను; నన్ను పంపిన తండ్రియు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు చున్నాడని చెప్పెను”.

యేసుప్రభువును “నిజమైన వెలుగు” గా ఈ లోకానికి పంపిన దేవుడు తానే సాక్ష్యమిస్తున్నాడు. యేసుప్రభువు బాప్తిస్మము గురించి యోహాను సువార్తీకుడు గ్రంథస్తము చేయలేదు గాని మిగిలిన సువార్తలలో బాప్తిస్మ సమయంలో తండ్రియైన దేవుడు యేసుప్రభువు తన ప్రియ కుమారుడని సాక్ష్యము చెప్పినట్లుగా వ్రాయబడి ఉన్నది.

యూదులందరూ యెహోవా దేవుని విశ్వసిస్తారు కాబట్టి ఆయన సాక్ష్యములు కూడా యోహాను చూపుతున్నాడు.

## 4. యేసుప్రభువు చేసిన క్రియలే ఆయన పక్షాన సాక్ష్యము:

**ఎ.** యోహాను 5:36 – యేసుప్రభువు బాప్తిస్మమిచ్చు యోహాను సాక్ష్యము గురించి ప్రస్తావిస్తూ ఈ విధంగా అంటున్నాడు: “అయితే యోహాను సాక్ష్యము కంటె నా కెక్కువైన సాక్ష్యము కలదు; అదేమనిన, నేను నెరవేర్చుటకై తండ్రి యే క్రియలను నాకిచ్చియున్నాడో, నేను చేయుచున్న ఆ క్రియలే తండ్రి నన్ను పంపి యున్నాడని నన్ను గూర్చి సాక్షమిచ్చుచున్నవి” అంటున్నాడు. బాప్తిస్మమిచ్చు యోహాను “నిజమైన వెలుగు” ను గురించి సాక్ష్యమిచ్చుటకు దేవుని యొద్దనుండి పంపబడినవాడు. అతను తనకు నిర్దేశింపబడిన పనిని మాత్రము చేయుచు యేసుప్రభువును “నిజమైన వెలుగు”గా జనులందరికీ పరిచయము చేశాడు. అయితే ఇక్కడ ప్రభువు తన క్రియలు యోహాను మాటలకంటే శక్తివంతమైన సాక్ష్యాలుగా ఉన్నాయని చెప్తున్నాడు.

Actions speak louder than words – “మాటల కంటే చేతలే గట్టిగా మాట్లాడుతాయి”, ప్రభావవంతముగా ఉంటాయి. మనము కూడా మన క్రియల ద్వారా యేసయ్య వెలుగును ఇతరులకు ప్రసరింపజేయాలి. “లోకానికి మీరు వెలుగై యున్నారు” అని యేసయ్య చెప్పిన మాటల భావమిదే.

**బి.** యోహాను 10:25 – “అందుకు యేసు – మీతో చెప్పితిని గాని మీరు నమ్మరు, నేను నా తండ్రి నామమందు చేయుచున్న క్రియలు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి”. యూదా మతనాయకులు యేసుప్రభువు పరిచర్య ఆరంభము నుండి ఆయనను వెంబడిస్తూ, ఆయన బోధలలో తప్పులు వెదుకుతూ, ఆయన క్రియలను తప్పులు పడుతూ, ఆయన దేవదూషణ చేస్తున్నాడని ఆరోపిస్తూ ఆయన వెంబడే తిరుగుతూ ఉన్నా కూడా ఆయనను నమ్మలేదు. అందుకే యేసయ్య ఈ విధంగా అంటున్నాడు. తాను చేస్తున్న క్రియలన్నియు పరిశీలిస్తున్న వారికి ఆయనే “నిజమైన వెలుగు” అని తెలిసికొని ఉండవలసింది కాని వారి ఆత్మీయ కనులు, చెవులు అపవాది మూసి ఉండుట చేత వారు గుర్తించలేదు.

## 5. లేఖనములు కూడా ఆయనకు సాక్షి :

**ఎ.** యోహాను 5:39 – “లేఖనముల యందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి”

**బి.** యోహాను 5:45–47 – “మీ రాశ్రయించుచున్న మోషే మీ మీద నేరము మోపును. అతడు నన్ను గూర్చి వ్రాసెను. గనుక మీరు మోషేను నమ్మినట్లయిన నన్నును నమ్ముదురు. మీరతని లేఖనములను నమ్మని యెడల నా మాటలు ఏలాగు నమ్ముదురనెను”.

లేఖనములు బాగుగా ఎరిగియున్న పరిసయ్యులు, సద్దూకయ్యులు లేఖనములు యేసయ్యే “నిజమైన వెలుగు” గా వచ్చి ఉన్నాడు అని తెలియజెప్తున్నా కూడా వారు నమ్ముటకు సిద్ధంగా లేరు.

## 6. క్రీస్తు (తనకు తానే) సాక్షి :

యోహాను 8:12–14 – “మరల యేసు – నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగి యుండునని వారితో చెప్పెను. కాబట్టి పరిసయ్యులు – నిన్ను గూర్చి నీవే సాక్ష్యము చెప్పుకొను చున్నావు; నీ సాక్ష్యము సత్యము కాదని ఆయనతో అనగా, యేసు – నేను ఎక్కడనుండి వచ్చితినో యెక్కడికి వెళ్లుదునో నేనెరుగుదును కనుక నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనినను నా సాక్ష్యము సత్యమే”.

ఒకరి గురించి ఇంకొకరు చెప్పినపుడు ఆ సమాచారముగాని, సాక్ష్యము గాని పాక్షికంగానే ఉంటుంది కాని పరిపూర్ణముగా ఉండదు. యేసుప్రభువు తననుగూర్చి తాను చెప్తున్నాడు. ఆయన అపవాదిలాగా అబద్ధానికి జనకుడు కాదు గాని నమ్మదగినవాడు, పరిపూర్ణుడు. నిర్గమకాండములో మోషేతో “నేనే” అని చెప్పిన యెహోవా దేవుని సాక్ష్యము నమ్మిన యూదులు, యేసుప్రభువు సాక్ష్యము నమ్ముటకు సిద్ధంగా లేరు. తమ మెస్సీయ ఒక రారాజుగా వచ్చి రోమా ప్రభుత్వపు బానిసత్వము నుండి తమను తప్పిస్తాడని ఎదురుచూస్తున్న ఇశ్రాయేలీయులు, ఆయన ఒక సామాన్యుడిగా రావడాన్ని ఆస్వాదించుకోలేకున్నారు. ఎన్ని సాక్ష్యాలు కనపడుతున్నా వారు గ్రహించలేకున్నారు.

## 7. పరిశుద్ధాత్మ దేవుడు కూడా సాక్షి :

యోహాను 15:26 – “తండ్రి యొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త, అనగా తండ్రియొద్ద నుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును” – యేసుప్రభువు తన శిష్యులతో చెప్పిన మాటలివి.

యోహాను సువార్తికుడు తాను చెప్తున్న మాటలు సత్యమని రుజువు చేయుటకు ఇన్ని సాక్షాలను చూపెడుతున్నాడు. అపవాది మన ఆత్మీయ కన్నులు మూస్తే, మనకెవరెన్ని సాక్ష్యాలు చూపినా నమ్మము. నిత్యజీవానికి వెళ్లాలంటే సాక్ష్యములు నమ్ముటే గాకుండా మనము సాక్షులుగా నిలవాలి.

# 3. ఆత్మీయ చీకటి నుండి క్రీస్తు వెలుగులోనికి

**యోహా**ను సువార్తీకుడు తన సువార్తలోని 8,9 అధ్యాయములలో యేసుప్రభువు తనను తాను "నేను లోకమునకు వెలుగు"ను అని పరిచయము చేసుకోవడము. ఆ తర్వాత ఆయనను అంగీకరించని వారి యొక్క ఆత్మీయ గుడ్డితనమును గురించి చూపించాడు. ఒక పుట్టుగుడ్డివానిని స్వస్థపరచు ప్రక్రియలో భాగంగా ఆత్మీయ గుడ్డితనము నుండి బయటపడిన వ్యక్తియొక్క ఆత్మీయ స్థితి, తనకు వెలుగిచ్చిన వాని గురించి ఒక్కో కోణంలో ఒక్కోవిధంగా అర్థము చేసికొనుటను గురించి గ్రంథస్తము చేస్తున్నాడు.

యోహాను 8:12లో యేసుప్రభువు "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగి యుండునని వారితో చెప్పెను". ఈ మాటలు దేవాలయములోని ప్రజలతో అంటున్నాడు. మనము ఒక విషయము గమనిస్తే, ఆయన పరిచర్య అంతటిలో శాస్త్రులు, పరిసయ్యులు ఆయన బహిరంగంగా బోధించిన స్థలములన్నింటిలో ఉన్నారు. ఆయనను వెంబడించువారిలో విశ్వాసులున్నారు, అవిశ్వాసులున్నారు. విశ్వసించిన వారు జీవములోనికి, అవిశ్వాసులు మరణములోనికి వెళతారు. యేసుప్రభువు తనను విశ్వసించిన వారితో "మీరు లోకమునకు వెలుగై యున్నారు" అన్నాడు.

వెలుగు లక్షణాలను కొన్నింటిని చూద్దాము :

## 1. వెలుగు జీవమిస్తుంది :

ఈ ప్రపంచములోని ప్రాణకోటి కంతయు వెలుగు అవసరము, వెలుగు లేకుంటే ఏ ప్రాణి జీవించలేదు. అందుకే దేవుడు ప్రథమంగా వెలుగును సృజించాడు.

శారీరకంగా మన జీవము నిలుచుటకు వెలుగు ఏ విధంగా అవసరమో, ఆత్మీయంగా నిత్యజీవములోనికి వెళ్లుటకు క్రీస్తనే "నిజమైన వెలుగు" కావాలి. యోబు 33:28లో యోబు స్నేహితుడైన ఎలీహు యోబుతో మాట్లాడుతూ ఈ విధంగా అంటున్నాడు : "కూపములోనికి దిగిపోకుండ నా ప్రాణమును ఆయన విమోచించి యున్నాడు. నా జీవము వెలుగును చూచుచున్నది". ఈ వాక్యభాగములో విమోచకుడు, రక్షకుడు కనపడుచున్నారు. నరకకూపములోనికి పోకుండా మనలను విమోచించి, నిత్యజీవమనే వెలుగులోనికి తీసికొనిపోవు మధ్యవర్తిని గురించి మాట్లాడుతున్నాడు. 1తిమోతి 2:5,6 వచనములలో యేసుప్రభువను "నిజమైన వెలుగు"ను గురించి పౌలు ఈ విధంగా అంటున్నాడు. "దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను" లోకమునకు వెలుగుగా వచ్చిన యేసుప్రభువు మన జీవితములో నుండి చీకటిని తీసివేసి సమృద్ధియైన జీవమునిచ్చి, విశ్వసించిన వారినందరిని సంతృప్తిపరుస్తున్నాడు.

సామెతలు 11:25 ప్రకారము "ఔదార్యముగలవారు పుష్టినొందుదురు. నీళ్లుపోయువారికి నీళ్లుపోయబడును". మనము ఇతరులకు వెలుగుగా ఉండి నరక కూపములోనికి వెళుతున్న వారిని యేసుప్రభువు వెలుగులోనికి తెస్తే, దేవుడు మనకు, మనతోపాటు ఆయన వెలుగులోకి వచ్చిన వారికి సమృద్ధియైన జీవమిస్తాడు. "నిజమైన వెలుగు" లోకి వెళ్లలేకపోతే మనకు జీవము ఉండదు కాబట్టి చీకటిలోకి త్రోయ బడుతాము.

## 2. వెలుగు సరియైన మార్గము చూపుతుంది :

పాపమనే భయంకరమైన చీకటిలో మగ్గుతున్న మానవాళికి జీవ వెలుగు లేకుంటే, జీవమార్గము తెలియదు. క్రైస్తవులు, విశ్వాసులు యేసుప్రభువును కలిగి ఉంటే క్రీస్తు వెలుగు వారిలో నుండి బయటకు వచ్చి తాము సరియైన మార్గములో వెళ్లడమే గాకుండ, యేసుప్రభువును గూర్చి తెలియని అన్యులను కూడా సరియైన

మార్గములో నడిపించుటకు దోహదపడుతుంది. "మీరు లోకమునకు వెలుగై ఉన్నారు" అని యేసయ్య విశ్వాసులకు చెప్పిన మాటలోని అర్థము, ఇతరులను వెలుగు మార్గములో నడిపించాలని. మనము సరైన మార్గములో నడుస్తుంటేనే గాని ఇతరులను నడిపించలేము.

నెహెమ్యా 9 :19లో నెహెమ్యా దేవుడు ఇశ్రాయేలీయుల పట్ల చేసిన మేలులను గుర్తు చేసుకుంటూ ఈ విధముగా గ్రంథస్థము చేస్తున్నాడు – "వారు ఎడారిలో ఉండగా నీవు బహు విస్తారమైన కృప కలిగినవాడవై వారిని విసర్జింపలేదు; మార్గము గుండ వారిని తోడుకొని పోవుటకు పగలు మేఘ స్తంభమును, దారిలో వారికి వెలుగిచ్చుటకు రాత్రి అగ్ని స్తంభమును వారిపై నుండి వెళ్లిపోక నిలిచెను" ఇక్కడ చెప్పబడిన వెలుగు, "నిజమైన వెలుగు" అయి ఉన్న యేసయ్య సన్నిధి. 'ఎడారి' మన నిర్జీవ జీవితానికి సాదృశ్యముగా ఉన్నది. మనము ఎటువంటి ప్రతికూల పరిస్థితులలో ఉన్నను, "నిజమైన వెలుగు"ను విశ్వసిస్తే, ఆయన మనలను వెలుగు మార్గములో నడిపిస్తాడు. ఈనాటి సమాజంలో జనులు భయంకరమైన పాపాలు, వ్యసనాలు, వ్యభిచారములో సహజీవనము చేస్తూ ఇతరులను ప్రేరేపిస్తున్నారు. మనము క్రీస్తు వెలుగుగా ఉంటూ అటువంటి వారికి సత్యమార్గము చూపించాలి. రెండవ రాకడ సమీపిస్తున్న ఈ దినాలలో ప్రజలు లోతు దినముల యందలి ప్రజల వలె పాపములో మునిగి తేలుతూ తమకు ఇష్టమైన విధంగా జీవిస్తున్నారు. అందుకే క్రీస్తు వెలుగును కలిగియున్న మనము అటువంటి వారిని నిజమైన వెలుగు నొద్దకు రమ్మని సరైన మార్గము చూపిస్తూ బ్రతిమాలాలి. యేసుప్రభువు చూపించిన రెండు మార్గాలలో పరలోకానికి వెళ్లు ఇరుకు మార్గంలో మనము ముందుండి నడిపించాలి. మనముందు క్రీస్తనే నిజమైన వెలుగు నడుస్తుంటే, ఆయన మార్గములో మనము నడుస్తూ ఇతరులను కూడా తీసుకెళ్లాలి. యెషయా 5:20లో ప్రవక్త చెప్పినట్లు "కీడు మేలనియు, మేలు కీడనియు చెప్పుకొని, చీకటి వెలుగనియు వెలుగు చీకటి అనియు ఎంచుకొను వారికి శ్రమ" అని మనము కూడా చెప్పగలగాలి. శ్రమ వస్తుందని చెప్పుట మన బాధ్యత.

### 3. వెలుగు చీకటిని పారద్రోలుతుంది :

వెలుగు ఉన్న చోట చీకటికి తావులేదు. వెలుగు ఎంత దూరము ప్రసరిస్తుందో, అంత దూరము చీకటి పారిపోతుంది.

యెషయా 9:2లో యేసుప్రభువు మొదటి ఆగమనమును గురించిన ప్రవచనములో ఆయన గురించి చెప్తూ "చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు, మరణచ్ఛాయగల దేశనివాసుల మీద వెలుగు ప్రకాశించును" అని వ్రాయబడి ఉంది. చీకటి అంటే పాపము, తద్వారా వచ్చు మరణము. ప్రజలంతా ఆదాము చేసిన పాపము సంక్రమించుకొని చీకటిలో జీవిస్తున్నారు. చీకటిలో ఉన్నంతవరకు వారికి పరలోక భాగ్యముండదు. యేసుక్రీస్తను "నిజమైన వెలుగు" లోకి రాకపోతే నరకమనే ఊబిలోనికి వెళ్లిపోతారు. "మరణచ్ఛాయగల" అంటే రెండవ మరణమైన నరకపు ఛాయలు గల జనులని అర్థము. ఆ చీకటిని యేసయ్య వెలుగు పారద్రోలుతుంది. మనచుట్టు ఉన్న జనులనేకులు ఈ వెలుగును కనుగొనలేక శ్రమలు, బాధలు, కష్టాలు భరించలేక త్రాగుడుకు బానిసలై ఉన్నారు. ఇటువంటి వారిమధ్య క్రీస్తు వెలుగును ప్రసరింపచేయాలి. అది దేవుని చిత్తము, దేవుని చిత్తములో ఉండుట మన బాధ్యత.

### 4. వెలుగు చీకటి క్రియలను నశింపచేస్తుంది :

1యోహాను 3:8 : "అపవాది మొదటి నుండి పాపము చేయుచున్నాడు. గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి. అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను". అపవాది చేసేవన్నీ చీకటిక్రియలే. ఆ చీకటి క్రియలను నాశనము చేయుట కొరకే యేసు ప్రభువు లోకమునకు వెలుగుగా ఈ లోకానికి వచ్చాడు. అవినీతి పనులు ఏవైనా చీకటిలోనే జరుగుతాయి.

రోమా 1:28-31 వరకు ఉన్న వాక్య భాగములో పౌలు చెప్తున్న మాటలు చాలా బాధాకరంగా ఉన్నాయి. "నిజమైన వెలుగు" కు మనసులో చోటియ్యలేని వారు "సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వము చేతను, లోభము చేతను, ఈర్ష్య

చేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమను వాటితో నిండినవారై కొండెగాండ్రును, అపవాదకులను, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును, మాట తప్పువారును, అనురాగ రహితులు, నిర్ధయులునైరి" అంటున్నాడు.

పైన పేర్కొనబడినవన్నియు చీకటి గుణాలు, చీకటి క్రియలు, ఆ చీకటి క్రియలన్నిటిని లయపరచుటకే యేసుక్రీస్తు ఈ లోకమునకు వెలుగుగా వచ్చాడు.

## 5. వెలుగులో ఉండువారు పడిపోరు :

వెలుగులో ఉండువారు పాపమనే చీకటి జోలికి పోరు. ఎందుకంటే దీపము అందరికీ అగుపడేలా ఎప్పుడూ దీపస్తంభముపై పెట్టబడుతుంది.

దేవుని భయంతో వారు పాపమునకు దూరంగా ఉంటారు. అదేగాక "నిజమైన వెలుగై"న యేసయ్యను తమలో కలిగి యున్న యెడల వాడు "తన్ను భద్రము చేసికొనును గనుక దుష్టుడు వానిని ముట్టడు" (1యోహాను 5:18).

యోహాను 8:12లో వ్రాయబడి ఉన్నట్లు ఆయనను వెంబడిస్తూ, ఆయన ఆజ్ఞలను పాటిస్తూ, ఆయన మహిమార్థము ఇతరులకు వెలుగుగా ఉండాలి. అప్పుడు మనము కూడా మీకా ప్రవక్తలాగా ధైర్యంగా ఈ విధంగా చెప్పగలము. "అయినను యెహోవా కొరకు నేను ఎదురు చూచెదను. రక్షణ కర్తయగు నా దేవుని కొరకు నేను కనిపెట్టి యుందును, నా దేవుడు నా ప్రార్థన ఆలకించును. నా శత్రువా, నా మీద అతిశయింప వద్దు, నేను క్రిందపడినను, తిరిగి లేతును; నేను అంధకారమందు కూర్చున్నను యెహోవా నాకు వెలుగుగా నుండును" (మీకా 7:7-8).

"నేను లోకమునకు వెలుగును" అని చెప్పిన యేసుప్రభువు 9వ అధ్యాయములో ఆత్మీయ గుడ్డితనము గురించి శిష్యులకును, యూదా పెద్దలకును బోధించుట కొరకై ఒక అద్భుతము చేస్తున్నాడు. యోహాను సువార్తీకుడు మిగిలిన సువార్తలలోవలె యేసుప్రభువు చేసిన అద్భుతాలన్నింటిని గ్రంథస్తము చేయలేదు. తాను బోధించ

దలచిన సత్యములను స్థిరపచుటకు మాత్రమే అవసరమైన సూచనలు వ్రాశాడు. ఇక్కడ ఆనాటి మత పెద్దల ఆత్మీయ గుడ్డితనము, వేషధారణ చూపుటకు ఈ సూచక క్రియ చేశాడు. యోహాను సువార్తీకుడు ఒక అధ్యాయమంతా గుడ్డివాడిని స్వస్థపరచుటను గురించే గ్రంథస్తము చేశాడంటే అంధకారము నుండి బయటకు వచ్చి క్రీస్తు వెలుగులోకి రావడము ఎంత ప్రాముఖ్యమో తెలుస్తున్నది. మన లోకానికి వెలుగుగా వచ్చిన యేసుప్రభువు మనకు శారీరిక, ఆత్మీయ స్వస్థతలు దయచేయాలనే ఇచ్ఛ కలిగి యున్నాడు. ఎవరూ నశించిపోవుట ఆయనకిష్టము లేదు కాబట్టి అడిగిన వారినంతా, విశ్వసించిన వారినంతా తన వెలుగులోనికి తీసుకుంటాడు.

పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 4వ అధ్యాయములోని 3 నుండి 6 వరకు ఉన్న వాక్యభాగము చూద్దాము : “మా సువార్త మరుగు చేయబడిన యెడల నశించుచున్న వారి విషయములోనే మరుగు చేయబడియున్నది, దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను, అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడి పరచుటకు మా హృదయములలో ప్రకాశించెను, గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుట లేదు గాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము”. పౌలు యేసయ్య వెలుగును అందరికీ ప్రసరింపచేయాలని చాలా ఆసక్తితో పనిచేశాడు. అపవాది అవిశ్వాసుల మనో నేత్రములకు గుడ్డితనము కలుగజేసినందున తానెంత ప్రయత్నించినను, వారిని క్రీస్తనే నిజమైన వెలుగులోనికి నడిపించలేకపోయానని బాధపడుచున్నాడు. దేవుని వెలుగు తమ ద్వారా వ్యాపింప చేయాలి కాబట్టి అందరికీ నిరంతరము ప్రకటిస్తున్నాము అంటున్నాడు. పౌలు మాత్రమే గాక, ప్రతి విశ్వాసి, యేసయ్య వెలుగులోకి నడిపించబడి, ఆ పైన ఇతరులను కూడా నడిపించాలను ఆశ కలిగి యుండాలి.

అవిశ్వాసులు పాపమను చీకటిలో ఉన్నందున వెలుగులోకి రాలేకున్నారు. "మీరు లోకానికి వెలుగై ఉన్నారు" అని మన గురించి చెప్పిన యేసయ్యను గురించి చెప్తూ ఆయన మన జీవితాలలో చేసిన అద్భుతాలను సాక్ష్యముగా చెప్పినపుడు ఆ వెలుగు వారి జీవితాలలోకి ప్రవేశిస్తుంది.

యోహాను 9వ అధ్యాయము ఆద్యంతము ఒక గ్రుడ్డివానిని స్వస్థపరచుట గురించి వ్రాయబడి ఉంది. వెలుగు వచ్చినప్పుడు ఏమి జరుగుతుందో ఇక్కడ చెప్పబడి ఉంది. గుడ్డివానికి చూపు వచ్చినప్పుడు అతని జీవన విధానములో పెనుమార్పులు వచ్చాయి.

**1. అతడిని ఆవహించిన చీకటి :** యేసుప్రభువు, ఆయన శిష్యులు వెళ్లుచుండగా వారు ఒక పుట్టుగ్రుడ్డివానిని చూశారు. అతడిని చూసినపుడు శిష్యులు అడిగిన ప్రశ్నలు – "వీడు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపము చేసెను? వీడా, వీని కన్నవారా"? ఈ ప్రశ్నల ద్వారా ఆనాటి పరిస్థితులు, వారి నమ్మకాలు అర్థము చేసుకోవచ్చు. ఆ కాలంలో ఒక మనిషి శారీరక శ్రమలు తాను చేసిన పాపముల వలననో, లేక వారి తల్లిదండ్రులు చేసిన పాపము వలననో కలుగుతాయనే సిద్ధాంతాన్ని అప్పటి యూదులు నమ్మేవారు. ఇక్కడి గుడ్డివాడు పుట్టుకతో గ్రుడ్డివాడు కనుక అతని తల్లిదండ్రుల పాపమే అని నిర్ణయించి ఉంటారేమో. ఆ కాలం నాటి నమ్మకాల వలన శిష్యులు ఆ విధంగా అడుగుటలో తప్పులేదు. లేఖనాలలో కూడా కొన్ని సందర్భాలలో వారు చేసిన పాపము వలన శిక్షింపబడినట్లుగా చూడగలము. సంఖ్యాకాండము 12:10లో మిర్యాము తన తమ్ముడైన మోషేకు విరోధముగా మాట్లాడినందున దేవుడు ఆమెను కుష్ఠరోగముతో శిక్షించినట్లుగా చూడగలము; యోహాను 5:14లో యేసుప్రభువు బేతెస్థ కోనేటి యొద్ద ఒక రోగిని స్వస్థపరచిన తర్వాత అతనితో "ఇదిగో స్వస్థత నొందితివి; మరి యెక్కువ కీడు నీకు కలుగ కుండునట్లు ఇకను పాపము చేయకుము" అన్నాడు. 1కొరింథీ11:30లో తన్నుతాను పరీక్షించుకొనక ప్రభువు బల్లలో పాల్గొనే వారిని గురించి చెప్తూ "ఇందువలననే మీలో అనేకులు బలహీనులును, రోగులునై యున్నారు; చాలామంది నిద్రించు

చున్నారు” అంటున్నాడు. శిష్యులు పాత నిబంధనలోని కొన్ని సంఘటనలు, మాటలు గుర్తు చేసుకుంటూ ఉండి ఉండవచ్చు. నిర్గమకాండము 20:5లో “నీ దేవుడైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పింతును” అంటున్నాడు. ఇదే మాట నిర్గమ 34:7లోను, సంఖ్యాకాండము 14:18, ద్వితీయోపదేశకాండము 5:9లోను చెప్పబడి ఉంది. ఈ మాటలన్నీ వ్యక్తిగతంగా ఒక మనిషికి చెప్పినవి కావు, ఇశ్రాయేలు దేశమును ఉద్దేశించి చెప్పబడినవి. ఒక తరమువారు చేసిన తప్పుల వలన, తర్వాతి తరముల వారు శిక్షననుభవిస్తారని దేవుడు చెప్పాడు. ఇవన్నీ మనసున ఉన్నందున శిష్యులావిధముగా అడిగారు. ఇక్కడ పుట్టుగ్రుడ్డివానిని వ్యక్తిగతంగా చీకటి ఆవహించింది. అతడు దేవుడు సృష్టించిన వెలుగును గాని, దేవుని వెలుగును గాని చూడలేదు. మనమంతా స్వతహాగా ఆధ్యాత్మిక అంధులము. రక్షింపబడిన తర్వాత మనలో వెలుగు వస్తుంది, చూడగలము. ఒక గ్రుడ్డివానికి ఏదైనా చూపిస్తే “నాకు కనపడదు” అంటాడు. అదేరీతిగా దేవుని ఎరుగని వ్యక్తికి దేవుని అద్భుతాలు చూపెడితే అదే సమాధానము చెపుతాడు. ప్రభువు కళ్లు తెరవకపోతే, ఎవరూ దేవుని వెలుగు చూడలేరు, ఆయన గురించిన సత్యాన్ని గ్రహించలేరు.

**2. అతడి చుట్టూ ఉన్న చీకటి :** యేసయ్య తన శిష్యులడిగిన ప్రశ్నలకు సమాధానము చెప్తూ వాడైనను, వాడిని కన్నవారైనను పాపము చేయలేదు గాని, పాపానికి మూలమైన శక్తిని ఛేధించి, తొలగించి, దేవుని క్రియలు వానియందు ప్రత్యక్షపరచబడి, తద్వారా దేవుడు మహిమ పరచబడాలని వాడు గుడ్డివానిగా పుట్టాడని యేసయ్య వివరించాడు. యేసుప్రభువు తండ్రి చిత్తము నెరవేర్చుటకు విధేయుడై ఈ లోకానికి వచ్చాడు, ఆయన చేసిన ప్రతి పనిద్వారా మహిమ ప్రత్యక్ష పరచబడాలని దేవుని ప్రణాళిక. యేసుప్రభువు సమాధానము ద్వారా తమ ఆలోచనా విధానములో పొరపాటు ఉందని శిష్యులు గ్రహించారు. తన వెలుగును తన శిష్యుల ద్వారా లోకానికి ప్రసరింపచేయాలని తలంచిన ప్రభువు వారికి ఓపికగా

వివరించాడు. వారు భూతకాలము గురించి, అందులోని విషయాలను తెలుసు కోవాలని ఆలోచిస్తుంటే యేసయ్య దేవుని పని చేస్తూ ముందుకు సాగాలని వారిని హెచ్చరిస్తున్నాడు. ఆయన ఈ లోకంలో ఉన్నంత వరకు లోకానికి వెలుగై ఉన్నాడు. కాబట్టి ఆ గుడ్డివాని చుట్టూ ఉన్న చీకటిని తొలగించాలని చెప్తున్నాడు. లోకానికి నిజమైన ఆత్మీయ వెలుగుగా వచ్చిన యేసుప్రభువు, తన జీవితమంతా చీకటిలో జీవించిన గుడ్డివానికి శారీరక వెలుగును కూడా అనుగ్రహిస్తున్నాడు. పగలున్నంత వరకు తండ్రి అప్పగించిన పనులు చేస్తున్నాడు.

**3. అతడిని స్వస్థపరచిన అద్భుతము :** 9:5,7 వచనములలో ఆయన చేసిన స్వస్థత గ్రంథస్తము చేయబడింది. యేసయ్య నేలమీద ఉమ్మివేసి ఉమ్మితో బురదచేసి, వారి కన్నుల మీద పూసాడు, సిలోయము కోనేటిలో కడుగుకొనుమని చెప్పాడు. విధేయత చూపి ఆ గ్రుడ్డివాడు చూపు పొందాడు. ఆ కాలంలో ఒక గొప్ప దైవజనుని ఉమ్మిగాని, ఉపవాస దీక్షలో ఉన్నవారి ఉమ్మిగాని స్వస్థపరచు లక్షణాలు కలిగి ఉంటుందని ఆ కాలపు ప్రజలు నమ్మేవారు. అందుకే ఆయన తన ఎంగిలి వాడాడని కొందరు తలుస్తారు. ఇక్కడ పోయిన దృష్టి తిరిగి తీసుకొని రావడము కాదు, క్రొత్తగా దృష్టి సృష్టిస్తున్నాడు యేసయ్య అని కొందరు వ్యాఖ్యానిస్తారు. మట్టితో మనిషిని చేసిన సృష్టికర్త, ఆ మట్టితోనే నూతన కనుగుడ్లు చేస్తున్నాడని తలంచవచ్చు. సిలోయమను కోనేటిలో కడుగుకొనుట విశ్వాసమునకు పరీక్ష. "సిలోయమను మాటకు పంపబడిన వాడని అర్థము" - తండ్రియైన దేవుని ద్వారా లోకానికి వెలుగుగా ఉండుటకు పంపబడిన వాడని మనము గుర్తు చేసుకోవాలి.

**4. గుడ్డివాని మీదికి చెలరేగిన వ్యతిరేకత :** 9:8-34 వరకు ఉన్న వచన భాగములో ఆ గుడ్డివాని పట్ల ఇరుగుపొరుగు వారిలో, పరిసయ్యులు, మత నాయకులలో చెలరేగిన వ్యతిరేకత చూడగలము.

ఆయనెవరో తెలియకపోయినా యేసయ్య స్పర్శను గుడ్డివాడు గుర్తించాడు. యేసయ్య అతనిని శారీరకంగా, ఆత్మీయంగా ముట్టాడు. ఇంతవరకు చీకటిలో ఉన్న అతను ఆత్మీయ వెలుగులో యేసయ్యను చూశాడు. ఇహలోకపు వెలుగుతో సృష్టిని, సృష్టి అందాలు చూశాడు. అతడు అడగకపోయినా, యేసయ్యే అతని

దగ్గరకు వచ్చాడు. ప్రతి మానవుడు యేసయ్య స్పర్శించే వరకు ఆత్మీయ గుడ్డితనము లోనే ఉంటాడు. పాపము వలన దేవునికి దూరముగా ఉన్నవారు ఆయనకు దగ్గరవగానే వారికి తనను తాను నెమ్మదిగా ప్రత్యక్షపరచుకుంటాడు.

పుట్టు గుడ్డివానిగా మార్గము ప్రక్కన బిక్షమెత్తుకొనువాడు అకస్మాత్తుగా కంటిచూపు గలవాడై తిరుగుచుండుట చూసి ఇరుగుపొరుగు వారు నమ్మలేక పోయారు. వారిలో వారు తర్జనలు పడి వాడినే అడిగి నిజము తెలుసుకున్నారు. అతనిని బాగుచేసినవాడెవడని అడిగినప్పుడు “యేసు అనునొక మనుష్యుడు” అని చెప్పాడు. అంతకంటే ఆయనను గురించి ఏమీ తెలియదు. తర్వాత అతనిని పరిసయ్యుల యొద్దకు తీసికొని పోయిరి. జరిగిన విషయము గుడ్డివాని ద్వారా మరొకసారి వినిన పరిసయ్యులు, ఆ గుడ్డివానికి చూపు వచ్చినందుకు ఆనందించుటకు బదులు, విశ్రాంతి దినమున స్వస్థత జరుగుట వారి ఆచారానికి విరుద్ధమను సంగతి బయలుపరుస్తున్నారు. “ఈ మనుష్యుడు విశ్రాంతి దినము ఆచరించుట లేదు గనుక దేవుని యొద్ద నుండి వచ్చినవాడు కాడనిరి”, మరి కొందరు పాపియైన మనుష్యుడు ఇలాటి అద్భుతము చేయలేడు గదా అని వారిలో వారు వాదించుకొని, ఆ తర్వాత ఆ గ్రుడ్డివాని అభిప్రాయము అడిగారు. వాడు “ఆయన ఒక ప్రవక్త” అన్నాడు.

ఆ తర్వాత యూదా మత పెద్దలు ఆ గుడ్డివాని తల్లిదండ్రులను పిలిచి అడిగారు. అంతకు మునుపే యేసయ్య క్రీస్తని ఎవరైనను ఒప్పుకుంటే వానిని సమాజ మందిరములో నుండి వెలివేయాలని నిర్ణయించుకొని ఉన్నందువలన ఆ తల్లిదండ్రులు యూదులకు భయపడి సరైన సమాధానము చెప్పలేదు. తమ కొడుకునే అడగమని చెప్పారు. తిరిగి అతనిని అడుగుట మొదలు పెట్టగానే వాడు ఇంకా గట్టిగా తన సాక్ష్యము చెప్పడము ప్రారంభించాడు. వాడిని శ్రమపెట్టేకొద్దీ యేసయ్యను గురించి తెలసుకోవడము ప్రారంభించాడు. ధైర్యముగా వారితో మాట్లాడుతూ యేసుప్రభువు దేవుని యొద్ద నుండి వచ్చినవాడై ఉంటాడని చెప్పాడు. యేసయ్యను గురించి తెలుసుకునే కొద్దీ మనుషులను బట్టి భయపడుట మానేశాడు. ఇది గమనించిన మతాధికారులు అతనిని సమాజమందిరము నుండి వెలివేశారు.

ఆత్మీయ గుడ్డితనములో ఉన్న ఆ మతాధికారులు వెలివేసినది గుడ్డివానిని కాదు – యేసయ్యనే. వారి వ్యతిరేకత గుడ్డివానిని బట్టి కాదు గాని నిజమైన వెలుగును బట్టి. యోహాను 1:11లో చెప్పబడినట్లు "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరించలేదు". విచారకరమైన విషయమేమంటే తానెవరి కొరకైతే ఈ లోకానికి వచ్చాడో, వారే ఆయనను గుర్తించలేకపోయారు. వారి ఆత్మీయ గుడ్డితనమే వారిని నాశనానికి తీసికొని వెళ్లింది. లేఖనాలు క్షుణ్ణంగా తెలిసిన మత పెద్దలు లేఖనాలు సాక్షులుగా ఉన్నా కూడా వారి గుడ్డితనము వలన ఆ వెలుగును చూడలేకపోయారు.

**5. యేసయ్య ఆ గ్రుడ్డివానికి ఇచ్చిన అభయము :** 9:35-38 వరకు వున్న వాక్య భాగములో కనపడుతుంది. ఆ గుడ్డివానిని సమాజ మందిరము నుండి వెలివేశారని తెలుసుకున్న యేసయ్య అతని యొద్దకు వెళ్లాడు. ఇప్పుడు ఆ గుడ్డివాని జీవితములోకి ఇంకా గొప్ప వెలుగు రాబోతున్నది. యేసయ్య తనను తాను దేవుని కుమారునిగా ప్రత్యక్షపరచుకున్నాడు. వెంటనే ఆ గుడ్డివాడు ఆయనకు మ్రొక్కాడు. యేసయ్య అతనికి అభయమిచ్చి ఆశీర్వదించాడు.

ఎఫెసీ 2:8లో "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే" అని వ్రాయబడి ఉన్నది. రక్షణకు అవసరమైనది కేవలము విశ్వాసమొక్కటే. గుడ్డివాని విశ్వాసము, విధేయత వలన అతనికి విజయము కలుగుటే గాక దేవుని ప్రత్యక్షత లభించింది.

రక్షణ మార్గములో వెళుతున్న ప్రతి విశ్వాసి ఈ గుడ్డివానిలాగా నెమ్మది నెమ్మదిగా ఆయనను కనుగొనాలి. ఆయనే నిజమైన వెలుగని గుర్తించి ఆయన వెలుగులోనికి వచ్చిన వారికి ఆయన ప్రత్యక్షపరచబడతాడు. శారీరక గ్రుడ్డితనము నుండి ఆత్మీయ వెలుగులోకి వచ్చినవాడు మొదట ఆయన కేవలము "యేసు అను మనుష్యుడు" అనుకున్నాడు, తర్వాత ఆయన ప్రవక్త అనియు, దేవుని యొద్దనుండి పంపబడిన వాడై ఉంటాడనియు మత పెద్దలతో వాదించాడు. తత్ఫలితముగా యేసయ్య తననుతాను దేవుని కుమారునిగా ప్రత్యక్షపరచుకున్నాడు. అతను

యేసయ్యను చూశాడు, విశ్వసించాడు, ఆరాధించాడు. ఆత్మీయ చీకటి నుండి నిజమైన వెలుగైన యేసయ్య యొద్దకు వచ్చిన మనమందరము ఈ విధమైన ప్రత్యక్షత పొందగలము, ఆత్మీయ దృష్టి పొందగలము.

ఈ సంఘటన చివరి భాగంలో పరిసయ్యులతో యేసుప్రభువు మాట్లాడు చున్నాడు. తీర్పు నిమిత్తము నేనీలోకమునకు వచ్చానని చెప్పుటలో దేవుని ప్రణాళికలో తన స్థానమును గురించి చెప్తున్నాడు. చివరి వచనములు యెషయా 6:9,10 వచనాలు గుర్తు చేస్తాయి. ఇక్కడ దేవుడు జనులతో చెప్పుమని యెషయా ప్రవక్తతో చెప్పిన మాటలు ఉన్నాయి – "మీరు నిత్యము వినుచుందురు గాని గ్రహింపకుందురు; నిత్యము చూచుచుందురు గాని తెలిసికొనకుందురు. వారు కన్నులతో చూచి; చెవులతో విని, హృదయముతో గ్రహించి, మనస్సు మార్చుకొని స్వస్థత పొందకపోవునట్లు ఈ జనుల హృదయము క్రొవ్వచేసి వారి చెవులు మందపరచి వారి కన్నులు మూయించుము" అని దేవుడు కోపంతో అంటున్నాడు. అపవాది "నిజమైన వెలుగు"ను కనుగొనకుండునట్లు ప్రజల చెవులు, కన్నులు మూసేస్తున్నాడు. ఆత్మీయ అంధత్వములో ఉన్న యూదా మత పెద్దలు లేఖనాలు తెలిసి కూడా మెస్సయ్యను కనుగొనలేక పోతున్నారు.

లేఖనాలలో అంతటా ఆత్మీయ గుడ్డితనము అనేది ఆధ్యాత్మిక సత్యమును అర్థము చేసుకోలేక నశిస్తున్న స్థితిని సూచిస్తున్నది. ఇటువంటి వారి గురించి "కన్నులుండి అంధులైన వారిని, చెవులుండి బధిరులైన వారు" (యెషయా 43:8) అని యెషయా వివరిస్తున్నాడు. యిర్మీయా ప్రవక్త అయితే "కన్నులుండియు చూడకయు, చెవులుండియు వినకయు నున్న వివేకములేని మూఢులారా" అని సంబోధిస్తున్నాడు. శతాబ్దాల తర్వాత ఇటువంటి వారిని యేసయ్య "అంధులైన మార్గదర్శకులారా" (మత్తయి 23:16) అనియు, "అవివేకులారా, అంధులారా" (మత్తయి 23:17) అనియు పిలుస్తున్నాడు. వీరు తమ పితరులవలె ఆత్మీయ వెలుగును గ్రహించలేక పోతున్నారు, "నిజమైన వెలుగు"ను గుర్తించలేకున్నారు.

క్రీస్తు పునరుత్థాన, ఆరోహణముల తర్వాత అపొస్తలుడైన పౌలుతో చెప్పినమాటలివి – “నీవు లేచి నీ పాదములు మోపి నిలువుము; నేను ఈ ప్రజల వలనను, అన్యజనుల వలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను; వారు చీకటిలో నుండి వెలుగులోనికి, సాతాను అధికారము నుండి దేవుని వైపునకు తిరిగి, నా యందలి విశ్వాసము చేత పాపక్షమాపణను, పరిశుద్ధపరచబడిన వారిలో స్వాస్థ్యమును, పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారి యొద్దకు పంపెదనని చెప్పెను” (అపొ.కా. 26:18). “అన్యులైన వారు కూడా అంధకార మనస్సు గలవారై, తమ హృదయ కాఠిన్యము వలన తమలో నున్న అజ్ఞానము చేత దేవుని వలన కలుగు జీవములో నుండి వేరుపరచబడినవారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొనుచున్నారు” (ఎఫెసీ. 4:18).

ప్రకటన గ్రంథములో సంఘములో వారిని కూడా వారి ఆత్మీయ అంధత్వము ను గురించి యేసయ్య హెచ్చరించాడు. ప్రకటన 3:17లో “నీవు దౌర్భాగ్యుడవును, దిక్కుమాలిన వాడవును, దరిద్రుడవును, గ్రుడ్డివాడవును, దిగంబరుడవునై యున్నావని యెరుగక – నేను ధనవంతుడను, ధనవృద్ధి చేసి యున్నాను, నాకేమియు కొదువ లేదని చెప్పుకొనుచున్నావు” అని లవొదికయ సంఘమును తప్పుపడుతున్నాడు. యూదా మతాధికారులు అన్యజనులు, క్రైస్తవులమని చెప్పుకొనేవారు – అందరూ ఈ ఆత్మీయ అంధత్వములో ఉన్నారు. ఆ చీకటి నుండి క్రీస్తనే “నిజమైన వెలుగు” లోనికి నడిపించబడకపోతే అందరూ నశించిపోతారు. ఆ ఆత్మీయ గుడ్డితనమనే రోగానికి ఒకటే మందు – ప్రభువైన క్రీస్తుయేసు నందు విశ్వాసముంచుటయే. యెషయా 42:7లో “చీకటిలో నివసించు వారిని బందీ గృహములో నుండి వెలుపలికి తెచ్చుటకు” మెస్సయ్య వస్తాడనియు; యెషయా 49:6లో దేవుడు మెస్సయ్యతో మాట్లాడుతూ “అన్యజనులకు వెలుగై యుండునట్లు నిన్ను నియమించియున్నాను” అన్నాడు.

రక్షకుడు “మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను”

(కొలొస్స 1:13). విశ్వాసులు "నిజమైన వెలుగు"ను కనుగొనక పూర్వము చీకటియై యున్నారు; ఇప్పుడైతే ప్రభువునందు వెలుగై యున్నారు (ఎఫెసీ 5:8).

యోహాను సువార్తికుడు ఈ అధ్యాయములో ఆత్మీయ దృష్టిని గురించి నాలుగు సంగతులు బోధిస్తున్నాడు : ఆత్మీయ దృష్టి కావాలంటే దైవిక అంకురార్పణ కావాలి; ఆత్మీయ దృష్టి విశ్వాసముతో స్పందిస్తుంది; క్రీస్తును గుర్తిస్తుంది; తద్వారా దేవుని ఆరాధిస్తుంది.

ఆత్మీయ దృష్టి పొందుటకు సిద్ధంగా ఉన్న ఈ పుట్టు గుడ్డివానిని యేసయ్యే సమీపించాడు. తాను శారీరక దృష్టి పొందిన తర్వాత ఇరుగు పొరుగువారు, తల్లిదండ్రులు, సమాజ మందిరపు అధికారులు వెలివేశారు. అప్పుడు యేసు "వాని కనుగొని", వాడికి తన్ను తాను ప్రత్యక్షపరచుకొని, ఆత్మీయ కన్నులు తెరచాడు. యేసయ్య తన శిష్యులతో "మీరు నన్ను ఏర్పరచుకొనలేదు, నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16) అన్నాడు. రక్షణ కార్యమునకు దేవుడు అంకురార్పణ చేయకపోయి ఉంటే మనమెవరము ఆయన వెలుగులోనికి వచ్చి ఉండేవారము కాదు.

యేసుప్రభువు స్వస్థత పొందిన గుడ్డివానితో "నీవు దేవుని కుమారుని యందు విశ్వాసముంచుచున్నావా అని అడిగెను" "ఆయన యందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడు?" అని అతను అడిగినప్పుడు యేసయ్య తనను తాను ప్రత్యక్ష పరచుకున్నాడు. యేసయ్య అతనిని కనుగొన్నాడు కాని అతని స్పందన విశ్వాసముతో కూడినది కాకుంటే అతనికి ఆత్మీయ దృష్టి వచ్చి ఉండేది కాదు. విశ్వాసము లేకుంటే రక్షణ రాదని లేఖనములు చెప్తున్నాయి. దేవుడు మొదలుపెట్టిన రక్షణ కార్యము పూర్తిగావించ బడాలంటే రక్షింపబడవలసిన వ్యక్తికి విశ్వాసము ఉండాలి. ఈ సత్యము అపొ.కా. 13:48లో మనకు బోధింపబడి ఉంది. "అన్యజనులు ఆ మాట విని సంతోషించి దేవుని వాక్యమును మహిమ పరచిరి; మరియు నిత్య జీవమునకు నిర్ణయింపబడిన వారందరు విశ్వసించిరి" సార్వభౌముడైన దేవుడు తానేర్పరచు కొన్నవారు విశ్వాసముతో స్పందించేట్లు చేస్తాడు.

ఆత్మీయ దృష్టి పొందినవాడు క్రీస్తును గుర్తిస్తాడు. యేసుప్రభువు తనను తాను ప్రత్యక్షపరచుకోగానే అతడు నమ్మాడు. సమరయ స్త్రీ కూడా తానే మెస్సయ్యనని యేసయ్య ప్రత్యక్షపరచుకోగానే విశ్వసించి, తన గ్రామ ప్రజలందరినీ ఆయన యొద్దకు నడిపించింది. పుట్టు గుడ్డివాడు విశ్వాసముతో స్పందించి యేసయ్యను గుర్తించి, వెంటనే ఆరాధించాడు. "నిజమైన వెలుగు"ను గుర్తించిన ప్రతి విశ్వాసి స్పందన ఆ విధంగానే ఉంటుంది. శిష్యులలో ఒకడైన తోమా యేసయ్య పునరుత్థానుడైన పిమ్మట, తాను ఆయన గాయములలో చేయిపెట్టి చూస్తేగాని నమ్మను అని చెప్పినవాడు, ప్రభువు తన గాయములు చూపగానే గుర్తించి "నా దేవా, నా ప్రభువా" అంటూ యేసయ్యను ఆరాధించాడు.

యేసుప్రభువు 9వ అధ్యాయము చివరి భాగములో పరిసయ్యులతో మాట్లాడిన మాటలలో ఆత్మీయ గుడ్డితనమును గురించి కూడా నాలుగు సంగతులు చూడగలము :ఆత్మీయ గుడ్డితనము తీర్పులోనికి తీసుకెళుతుంది; తన గుడ్డితనమును అంగీకరించదు; ఆత్మీయ వెలుగును తిరస్కరిస్తుంది; తద్వారా నాశనానికి దారితీస్తుంది.

"లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:17) అను మాటకు విరుద్ధంగా ఇక్కడ "తీర్పు నిమిత్తము నేనీలోకమునకు వచ్చితిని" అంటున్నాడేమిటా అని ఆలోచన రావచ్చు. ఇవి రెండూ ఒకే సత్యానికి రెండు కోణాలు. యేసయ్య ఇచ్చు సమాధానమును అంగీకరించని వాడు ఆయన శిక్షకు పాత్రుడవుతాడు; ఆయన కృపను అంగీకరించనివాడు ఆయన న్యాయము యొద్దకు వస్తాడు; ఆయన కనికరమును అంగీకరించనివాడు ఆయన ఉగ్రతలోనికి వస్తాడు; ఆయన ప్రేమను అంగీకరించనివాడు ఆయన కోపాన్ని ఎదుర్కోవలసి వస్తుంది; ఆయన క్షమాపణను అంగీకరించనివాడు ఆయన తీర్పులోనికి వస్తాడు. యేసుప్రభువు ఈ లోకానికి రక్షకునిగానే వచ్చాడు గాని ఆయన సువార్తను అంగీకరించనివాడు నాశనములోనికి వెళ్తాడు, తీర్పులోనికి వెళతాడు. తమ ఆత్మీయ గుడ్డితనమును ప్రభువు దగ్గర ఒప్పుకొని, తమను ఆయన వెలుగులోనికి తెమ్మని అడిగినప్పుడే ఆత్మీయ వెలుగు వస్తుంది. తమంతట తామే చూడగలము అనుకొనే వారు ఎప్పటికీ గ్రుడ్డివారిగానే ఉంటారు.

“దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనపడకుండునట్లు వెలుగు నొద్దకు రాడు” (యోహాను 3:20)

ఆత్మీయ గుడ్డితనము నాశనానికి దారి తీస్తుంది. మాలో ఏ పాపము లేదు, మేము చూడగలుగుచున్నాము అను వారిలో పాపము నిలిచి యుంటుంది.

పుట్టు గుడ్డివానిలాగా తమ ఆత్మీయ గుడ్డితనము గుర్తించి వెలుగువైపు తిరిగినవారు “చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుందురు” (యోహాను 8:12). కాని పరిసయ్యుల వలె చీకటిలోనే నడుచుటకు ఇష్టపడేవారు చీకటిలోనే గమ్యంలేని వారిగా జీవిస్తారు. మొదటి గుంపు నిత్యత్వములో నిజమైన వెలుగుతో జీవిస్తారు కాని రెండవ గుంపులో వారు నిత్య నరకములోనికి ప్రవేశిస్తారు.

# 4. వెలుగును గురించిన ఏడు ప్రత్యక్షతలు

**యో**హాను సువార్త వ్రాయుటలో సువార్తికుడి ఉద్దేశము ఇంతకు మునుపే మనము చూశాము. యేసుక్రీస్తు దేవుని కుమారుడని అందరూ నమ్మాలనియు, ఆయనను విశ్వసించుట చేత నిత్యజీవము కలగాలనియు ఉద్దేశము కలిగియున్న యోహాను, బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా యేసు "నిజమైన వెలుగు" అని లోకానికి తెలియపరచాడు. యేసుక్రీస్తు యొక్క దైవలక్షణాలు రుజువు చేయుటకు ప్రయత్నించిన యోహాను, ప్రభువే స్వయంగా తన గురించి తాను ప్రత్యక్షపరచుకున్న సత్యములను గ్రంథస్తము చేశాడు. బైబిలు అంతటిలో ప్రాధాన్యత సంతరించుకున్న 'నేనే' అను ఏడు ప్రత్యక్షతలు ఈ సువార్తలో చూస్తాము. "నిజమైన వెలుగు"గా యేసయ్యను మనకు చూపిస్తున్న యోహాను, ఆయన చెప్పిన ఇంకా కొన్ని సంగతులను చెప్తున్నాడు. యేసుప్రభువు తన దైవత్వమును చూపించుటకు చెప్పిన ఏడు ప్రత్యేకమైన ప్రత్యక్షతలు:

1. యోహాను 6:35 – "జీవాహారము నేనే";
2. యోహాను 8:12 – "నేను లోకమునకు వెలుగును";
3. యోహాను 10:9 – "నేనే ద్వారమును";
4. యోహాను 10:14 – "నేను గొఱ్ఱెల మంచి కాపరిని";
5. యోహాను 11:25 – "పునరుత్థానమును, జీవమును నేనే";
6. యోహాను 14:6 – "నేనే మార్గమును, సత్యమును, జీవమును"
7. యోహాను 15:1 – "నేను నిజమైన ద్రాక్షావల్లిని"

ఇటువంటి ప్రత్యక్షతలు ఎవరైనా తనను గురించి తాను చెప్పుకుంటే ఆ విషయాలు సత్యమై ఉండాలి లేక చెప్పినవాడు పిచ్చివాడై ఉండాలి. ఇటువంటి విషయాలు అసత్యాలై ఉంటే ఎవరూ అధికారంతో చెప్పలేరు. ఆయన మాటలు కనికరముతో కూడినవై, ఆయన క్రియలు మహిమగలవై ఉన్నాయి. ఆయన మాటలోని శక్తిని బట్టి ఆయన చెప్పినది నిజమని నమ్మారు. ఇతరులు మన గురించి పరిచయం చేయవలసి వస్తే, వారికి మన గురించి పాక్షికంగానే తెలుస్తుంది, కాని మనమే చెప్తే పూర్తిగా చెప్పగలము. అదే విధంగా యేసుప్రభువు తన గురించి తాను చెప్పిన విషయాలు సంపూర్ణ సత్యములై ఉన్నవి. తన తండ్రిని నమ్మినవారు తనను కూడా నమ్ముడని చెప్పినప్పుడు నమ్మినవారు తమ ప్రాణాలిచ్చేంతగా ప్రేమించారు గాని, కొందరు వ్యతిరేకులై, చంప ప్రయత్నించారు, ఒక సందర్భములో, ఆయనను బంధించి తీసుకుని వచ్చుటకు సైనికులను పంపితే, వారు చెప్పిన పని చేయకయే తిరిగి వచ్చారు. వారు వచ్చి ఆయనలాగా అధికారంతో ఎవరూ ఇంతవరకు మాట్లాడలేదని చెప్పారు. ఆయనకు ఆత్మలు, సృష్టి విధేయత చూపాయి; చనిపోయిన వారిని లేపాడు, రోగులను స్వస్థపరచాడు, దయ్యాలను వెళ్లగొట్టాడు, ఇంకా ఎన్నో అద్భుతాలు చేశాడు. అందుకే ఆయన ప్రకటించిన సత్యాలు అసత్యాలు కావని అర్థము చేసుకోగలము. చెప్పబడిన ప్రత్యక్షతలు లోతుగా అర్థము చేసుకొనుటకు ప్రయత్నిద్దాము.....

## 1. “జీవాహారము నేనే” :

“నిజమైన వెలుగు”ను గురించిన ప్రత్యక్షతలలో ఇది మొదటిది. యోహాను సువార్త 6వ అధ్యాయములో ఈ సత్యము యేసుప్రభువు స్వయంగా చెప్పాడు. ఈ సత్యము తనను వెంబడించిన జనులకు చెప్పకముందు అయిదు రొట్టెలు, రెండు చేపలతో అయిదు వేలమందికి తృప్తిగా భోజనము పెట్టాడు. ఆయనిచ్చిన ఇహలోక పరమైన ఆహారము కొరకు ఆయనను వెదకుచు వచ్చిన జనులను చూసి “రొట్టెలు భుజించి తృప్తిపొందుట వలననే నన్ను వెదకుచున్నారని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” అని వారితో అని, “క్షయమైన ఆహారము కొరకు కష్టపడకుడి గాని నిత్య జీవము కలుగజేయు అక్షయమైన ఆహారము కొరకు కష్టపడుడి;

మనుష్య కుమారుడు దానిని మీకిచ్చును" (యోహాను 6:2) అని అద్భుతమైన సలహా ఇచ్చాడు. అందుకు ఆ జనులు ఆయన చెప్పే ఆహారము వారికిమ్మని అడిగినపుడు "యేసు వారితో ఇట్లనెను – జీవాహారము నేనే; నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు" (యోహాను 6:35) అన్నాడు. పై వచనములోని రెండవ భాగము సమరయ స్త్రీని గుర్తుచేస్తాయి. యోహాను 4:10లో "అందుకు యేసు – నీవు దేవుని వరమును – నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్న వాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను", ఈ వాక్యములో "నిజమైన వెలుగు" గా ఈ లోకానికి వచ్చిన యేసయ్య దేవుడు మనకిచ్చిన గొప్పవరమను సంగతిని కూడా వెల్లడి పరుస్తున్నాడు. యోహాను 4:14లో యేసయ్య ఆమెతో జీవజలమును గురించి వివరిస్తున్నాడు : "నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను". ఇది మానవాళికంతటికీ ఇవ్వబడిన గొప్ప సువార్త. "జీవాహారము"ను గురించిన ఈ బోధ క్రీస్తుకు, ప్రజలకు మధ్య జరిగిన ఒక సంభాషణలాంటిది, ముఖ్యంగా యూదా మత నాయకులు. ఈ అధ్యాయములో జనుల నుండి నాలుగు రకముల స్పందనలు కనపడుతాయి – "జీవాహారము నేనే" అని యేసుప్రభువు చెప్పిన సత్యమును బట్టి వచ్చిన స్పందన 6:22–40లో ప్రజలు ఆయనను వెదుకుచున్నారు; 41–51లో ఆయనను బట్టి సణుగుకొంటున్నారు; 60–71లో ఆయనను వదిలి వెళుతున్నారు.

**ఎ. వెదకుచున్నవారు :** ఆయనను వెదకుచున్నవారు ఆత్మీయ లాభము కొరకు ఆయనను వెదకుట లేదు. హృదయాంతరంగాలు తెలిసిన ప్రభువుకు ఆ సంగతి తెలుసు. ఆయనిచ్చే అనుదినాహారము కొరకు వెదుక్కుంటూ వచ్చారు. వారికి యేసుప్రభువు రెండు రకాల ఆహారము – క్షయమైనది, అక్షయమైనది – గురించి వివరించాడు. ఆయన చేస్తున్న అద్భుతాలను బట్టి ఆయన దగ్గరికి వచ్చి ఉంటే నీకొదేము లాగా రక్షింపబడే అవకాశముండేది. కాని వారు ఆయనిచ్చే ఇహలోక పరమైన ఆహారము కోరుకునే స్థాయికి దిగజారిపోయినందుకు వారికి జీవాహారము

గురించి బోధిస్తున్నాడు. శారీరక ఆహారము అందరికీ అవసరమే గాని నిత్యత్వానికి పోవాలంటే జీవాహారము కావాలని చెప్తున్నాడు. ఇక్కడ యెషయా 55:2 గుర్తుకు వస్తుంది : "ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు? సంతుష్టి కలుగ జేయని వాటి కొరకు మీ కష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థము భుజించుడి, మీ ప్రాణము సారమైన దాని యందు సుఖింపనియ్యుడి".

"అక్షయమైన ఆహారము కొరకు కష్టపడుడి" అని యేసయ్య చెప్పిన మాటలు వారికి సరిగా అర్థము కాలేదు. నిత్యజీవము కొరకు, రక్షణ కొరకు వారు ఏమైనా క్రియలు చేయాలేమో అనుకున్నారు. దేవుని క్రియలు చేయాలంటే ఏమి చేయాలని ఆయనను అడిగినపుడు ఆయన – "ఆయన పంపిన వాని యందు మీరు విశ్వాస ముంచుటయే దేవుని క్రియయని వారితో చెప్పెను" (యోహాను 6:29). విశ్వసించు నిమిత్తము ఏదైనా సూచకక్రియ చేయమని అడిగారు. పౌలు 1 కొరింథీ 1:22లో "యూదులు సూచక క్రియలు చేయుమని అడుగుచున్నారు" అన్నాడు.

యేసయ్య ఈ లోకానికి వచ్చినప్పుడు మోషేలాగా ఆయన కూడా ఆకాశము నుండి మన్నాను కురిపిస్తాడని యూదా రబ్బీలు ప్రజలకు నేర్పించారు. అందుకే యేసయ్యను ఆ సూచక క్రియ చేయమని అడిగారు. వారు చూచి, విశ్వసించాలను కున్నారు కాని విశ్వాసము వాక్య సత్యముపై కాక సూచకక్రియలపై ఆధారపడితే జనులు తప్పుమార్గములోకి వెళతారు. ఎందుకంటే అపవాది కూడా "నానా విధములైన సూచకక్రియలతోను, మహాత్కార్యములతోను" ప్రజలను మోసగించును (2థెస్స. 2:9) అని వ్రాయబడి ఉంది. వారికి జవాబుగా ప్రభువు వారికి వాక్య సత్యపు లోతులను వివరిస్తున్నాడు. మన్నా కురిపించింది మోషే కాదు గాని దేవుడే కాబట్టి మోషేపై నుండి వారి దృష్టిని మరల్చి దేవునిపై దృష్టి ఉంచుడని చెప్తున్నాడు. దేవుడు పూర్వకాలమున మన్నా ఇచ్చాడు గాని ఇప్పుడు నిజమైన జీవాహారమును యేసుక్రీస్తనే వ్యక్తి ద్వారా ఇస్తున్నాడని బోధించాడు. గతంలో జరిగిన సంఘటన

ముగిసిపోయింది గాని ఇప్పుడు దేవుడనుగ్రహిస్తున్న జీవాహారము ఆత్మీయమైన అనుభవము, అది కొనసాగుతుంది అని చెప్పాడు. పరలోకమునుండి దేవుడు పంపిన జీవాహారము తానే అని అర్థమయ్యేట్లుగా చెప్పాడు. తాను సకల లోక రక్షణార్థము తండ్రియైన దేవుడు పంపిన జీవాహారమును అనియు, తండ్రి చిత్తము నెరవేర్చుటకే తాను వచ్చాననియు వారికి వివరించాడు.

ఈ సంభాషణ యేసుప్రభువును వెదకుటతో ప్రారంభమై, ఒక సూచన కావాలని అడిగి, ఆ తర్వాత ఆయన చెప్పిన జీవాహారమును వెదకుట ప్రారంభించారు. యేసుప్రభువు వారితో రెండు మాటలు చెప్తున్నాడు. నా యొద్దకు రావాలి, నాపై విశ్వాసముంచాలి, ఎందుకంటే ఆయన దగ్గరికి వచ్చువాడు ఆయనిచ్చే జీవాహారము వలనను, జీవజలముల వలనను ఆకలి దప్పులు లేకుండా ఉండగలరు. ఆహారము, నీరు తీసుకున్నట్లు ఆయనను మనలోకి తీసుకోవాలని చెప్పాడు.

యోహాను 6:37-40 వరకు ఉన్న వాక్య భాగములో వ్యక్తిగత రక్షణ గురించిన వివరణ యేసయ్య ఇచ్చాడు. ఇవి ఆయన చెప్పిన మాటల్లో కెల్లా చాలా గొప్ప ఆత్మీయ సూత్రాలు. రక్షణలో దేవుని సార్వభౌమత్వము, మానవుని బాధ్యత అను రెండు అంశాలు ఇమిడి ఉన్నాయన్నాడు. తండ్రి కుమారునికి ప్రజలను ఇస్తాడు, కాని ఆ ప్రజలు కుమారుని విశ్వసించి ఆయన యొద్దకు రావాలి. కుమారుని వద్దకు వచ్చిన వారెవరూ నశించక అంత్య దినమున లేపబడతారు. ఆయనను వెదకు వారికి ఆయన దొరుకును, ఆయనను విశ్వసించిన వారిని ఆయన విడువడు, నాశనానికి పంపడు.

**బి. సణిగేవారు :** యోహాను 6:41-51 వరకు ఉన్న వాక్యభాగములో యేసు ప్రభువును బట్టి సణిగేవారిని చూస్తున్నాము. యూదామత నాయకులు “పరలోకము నుండి దిగివచ్చితిని” (6:38) అని యేసుప్రభువు చెప్పిన మాటలు జీర్ణించుకోలే కున్నారు, ఎందుకంటే అది నేను దేవునితో సమానమని, నేను దేవుణ్ణి అని చెప్పడముతో సమానము. ప్రభువు దేవదూషణ చేస్తున్నాడనుకుంటున్నారు. ఆయన నజరేతు వాడనియు, యోసేపు కుమారుడనియు వారికి తెలుసు కాబట్టి ఆయనను

అంగీకరించలేకున్నారు. వారు ఆయన గురించి ఇంకా తెలుసుకోవాలని ప్రయత్నించి ఉంటే ఆయన బెత్లేహేములో పుట్టాడనియు, కన్య గర్భాన పుట్టాడన్న సంగతియు తెలుసుకొని, లేఖనములు పరిశీలించి ఉంటే తెలిసి ఉండేది.

మోషే కాలంలో కూడా యూదులు సణిగేవారు, వారికది అలవాటే. యేసుప్రభువు తాను పరలోకము నుండి దిగివచ్చాడని అయిదుసార్లు చెప్పాడు గాని వారు నమ్మలేదు. యేసయ్య "జీవాహారము నేనే" అని ప్రకటించినపుడు, తాను మన్నావలె ఉన్నాను అనుట లేదు గాని మన్నాకంటే గొప్పవాడనని చెప్తున్నాడు. మన్నా కేవలము ఇశ్రాయేలు ప్రజల శారీరక ఆకలి తీర్చింది గాని యేసయ్య ప్రపంచమంతటికీ ఆత్మీయ ఆకలి తీర్చుటకు వచ్చాడు. ఇశ్రాయేలీయులు ప్రతిరోజు మన్నా తిని కూడా చనిపోయారు కాని యేసు అనే జీవాహారము తినినవారు ఎన్నడూ చనిపోరు. శారీరక మరణము ఎవరికైనా తప్పదు కాని యేసుప్రభువును తినిన వారికి రెండవ మరణము ఉండదు, నరకానికి పోనవసరము లేదు. దేవుడు మన్నాను యూదులకు బహుమతిగా ఇచ్చాడు గాని యేసయ్య ద్వారా తనను తానే ఇచ్చుకున్నాడు. ప్రతిదినము మన్నా ఇవ్వడానికి దేవునికేమీ కష్టములేదు, ఖర్చులేదు గాని తన ఏకైక కుమారుని ఇచ్చుట చాలా ఖర్చుతోనూ, వేదనతోనూ, త్యాగముతోను కూడినది. యూదులు ప్రతిరోజు మన్నాను తినవలసి ఉండేది కాని ఒక పాపి యేసయ్యను విశ్వసించి, ఒక్కసారి ఆయనను భుజిస్తే, నిత్యత్వములో సమృద్ధి జీవము ఇవ్వబడుతుంది.

మన్నాలో కూడా యేసుక్రీస్తును మనం చూడగలము. ఇశ్రాయేలీయులకు మన్నా ఏమిటో అర్థము కాలేదు : "ఇశ్రాయేలీయులు దాని చూచినప్పుడు అది ఏమైనది తెలియక – ఇదేమి (హెబ్రీ బాషలో 'మన్నా') అని ఒకరితో ఒకరు చెప్పుకొనిరి" (నిర్గమ 16:15). యేసుప్రభువును చూచిన వారికి కూడా ఆయన ఒక మర్మముగానే ఉన్నాడు. మన్నా రాత్రివేళ పరలోకము నుండి పడింది, ఇహలోక వాసులందరూ ఆత్మీయ, నైతిక చీకటిలో ఉన్నప్పుడు యేసయ్య ఈ లోకములోకి వచ్చాడు. మన్నా చిన్నగా (ఆయన దీనత్వము), గుండ్రంగా (ఆయన నిత్యత్వము),

తెల్లగా (ఆయన పరిశుద్ధత) ఉండేది. రుచికి తీయగా ఉండేది. కీర్తన 34:8లో "యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలుసుకొనుడి" అని వ్రాయబడి ఉంది, మన్నా ప్రజలందరి అవసరాలు తీర్చేదిగా ఉండేది. యేసయ్య మన అందరి అవసరాలు తీర్చేవాడుగా ఉన్నాడు. "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19).

దేవుని యొద్ద నుండి అనేక ఆశీర్వాదాలు పొందికూడా, గర్విష్టులై, ఆయనను తృణీకరించిన ప్రజలకు ఆయన మన్నాను ఇచ్చాడు. వారు చేయాల్సినదంతా వంగి పోగుచేసుకోవడమే. పోగుచేసుకోకపోతే దానిని త్రొక్కేవారు. ఈనాడు కూడా యేసయ్య మన యొద్దనే అందరికీ అందుబాటులో ఉన్నాడు. పాపి చేయాల్సినదంతా తన పాపమును ఒప్పుకొని, తన్నుతాను తగ్గించుకొని, ఉచితంగా దొరికే రక్షణ వరాన్ని అందుకోవడమే. అంత సులభమైన పనిని చేయకుండా, గర్విష్టులై దేవుని కుమారుని కాళ్లతో త్రొక్కుతున్నారు. తాను పరిశుద్ధ పరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును, ఆయన కృపను తిరస్కరించినవాడు దేవుని కుమారుని పాదములతో త్రొక్కుతున్నాడు (హెబ్రీ 10:29).

"నేనిచ్చు ఆహారము లోకమునకు జీవము కొరకైన నా శరీరమే" అని చెప్పినపుడు ఆయన పట్ల వ్యతిరేకత ఇంకా పెరిగింది. లోకానికి "నిజమైన వెలుగు"గా వచ్చిన ప్రభువు యొక్క ప్రత్యామ్నాయ మరణమును అందరూ సరిగా అర్థము చేసుకోవాలి. ఆయన లోకము కొరకు, తన గొర్రెల కొరకు, ఇశ్రాయేలీయుల కొరకు, తన స్నేహితుల కొరకు మరణించుటకు వచ్చాడు. తన శరీరాన్ని బలిగా అర్పించాడు. ఆయన కేవలము మన పాపముల కొరకేగాక, లోకస్థులందరి పాపముల కొరకు మరణించాడు (1యోహాను 2:2).

**సి. వాదించేవారు :** యోహాను 6:52-59 వరకు ఉన్న వాక్య భాగములో యూదులు యేసయ్య చెప్పిన సత్యమును వ్యతిరేకించి, ఆయనతో వాదించుట చూస్తున్నాము. పరిసయ్యులు, శాస్త్రులు సాంప్రదాయమును అనుసరించువారు కాబట్టి వారికి రక్తము త్రాగుట గాని, మనుష్య శరీరము తినుట నిషేదము (లేవీయ 17:10-16) అని తెలుసు. ఆత్మీయ సత్యమును అక్షరార్థముగా తీసుకొనుట

వలన వారందరు తప్పుగా అర్థము చేసుకుంటున్నారు. యేసుప్రభువు చెప్పిన మాటలేమంటే "మీరు ఆహారము, నీరు మీ శరీరములోనికి తీసుకొని శక్తిపొందినట్లు, నన్ను మీ ఆంతర్యములోకి తీసుకొని జీవము, సమృద్ధి జీవము పొందండి" అంటున్నాడు.

**డి. కఠినంగా ఉన్నవారు :** ఈ కఠినమైన మాటలు విన్న అనేకులు ఆయన యొద్ద నుండి తొలగిపోయారు. యోహాను 6:60-71 వరకు ఉన్న వాక్య భాగములో ఈ విషయములు గ్రంథస్తము చేయబడి ఉన్నాయి. యేసుప్రభువు బోధలు అర్థము చేసుకున్న తర్వాత ఆచరించుట తప్పనిసరి. యూదా మత అధికారులు అర్థము చేసుకోలేదు, పైపెచ్చు ఆయనను వ్యతిరేకించి, తృణీకరించారు. ఆయన బోధలు వారికి వెగటుగా ఉన్నాయి. ఆయన పరలోకము నుండి వచ్చాడను సత్యమే కాకుండా, ఆయన శరీరము తిని, రక్తము త్రాగడము అనే సత్యము వారు భరించలేకపోయారు. వారు ఆ సత్యాలను బట్టి అభ్యంతరపడితే, మనుష్య కుమారుడు వారేమి చేస్తారని యేసయ్య వారిని అడిగాడు (యోహాను 6:62). తర్వాత వారితో తన మాటలు వివరించాడు. అక్షర ప్రకారము అర్థము చేసుకోగూడదనియు, ఆత్మీయంగా అర్థము చేసుకోవాలనియు బోధించాడు. శరీరము వలన రక్షణ రాదనియు, వాక్యము ద్వారా శరీరము తినుట, రక్తము త్రాగుట చేయాలని చెప్పాడు. వాక్యము శరీరధారియై ఈ లోకానికి వచ్చాడని గుర్తు చేశాడు. యిర్మీయా 31:31-34 వరకు ఉన్న వాక్య భాగమును జ్ఞాపకము చేసుకున్న శాస్త్రులకు ఈ విషయము అర్థమై ఉంటుంది. దేవుడు వారితో క్రొత్త నిబంధన చేసుకొని వారి హృదయములో వ్రాస్తానని చెప్పాడు.

ఈ బోధ అయిన తర్వాత అంతవరకు యేసును అనుసరించిన వారనేకులు ఆయనను వెంబడించుట మానేశారు. తన 12 మంది శిష్యులు కూడా వెళ్లాలను కొంటున్నారేమోనని వారిని ప్రశ్నించినపుడు వారు ఆయనను వదిలి వెళ్లమని చెప్పారు. ఆయనే జీవాహారము అని నమ్మిన శిష్యులు ఆయనను వదిలి వెళ్లకూడదనే నిర్ణయాని కొచ్చారు.

"నిజమైన వెలుగు"ను గురించిన ఈ మొదటి ప్రత్యక్షతను గురించి తెలుసుకున్న పాఠకులందరు ఈ సత్యమును గ్రహించి, ఆయన జీవాహారము కనుక ఆయనను వదిలి ఎప్పటికీ తొలగిపోకూడదనే నిర్ణయానికి రావాలని ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

## 2. “నేను లోకమునకు వెలుగును” :

యోహాను 8:12లో ఈ ప్రత్యక్షత గ్రంథస్తము చేయబడి ఉన్నది. యోహాను సువార్తీకుడు తన సువార్త ఆరంభములోనే వెలుగును గురించిన ప్రస్తావన తెచ్చాడు. యేసయ్యను వాక్యముగా పరిచయం చేసి, ఆయనలో జీవముందని చెప్పి, “ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను”, ఆ వెలుగే “నిజమైన వెలుగు” అన్నాడు. “అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది” అని చెప్తున్నాడు. వాక్యానికి, జీవానికి అవినాభావ సంబంధము ఉన్నది. వాక్యానికి జీవము శరీరము లేక ప్రమిదలాటిది. ప్రమిదలోని నూనె, వత్తీ వెలుగిచ్చినట్లు వాక్యములోని జీవము వెలుగునిస్తుంది. ఇవి కలిసి పనిచేస్తూ మనిషిలోని వెలుగును ఆరిపోకుండా చేస్తాయి. వెలుగునకు 3 ప్రధాన లక్షణాలున్నాయి – ప్రకాశించడము, చలింప చేయడము, వేడి పుట్టించడము. జీవపు వెలుగు మానవులను, కదిలించి, చైతన్యము కలిగిస్తుంది. ఆ కదలిక నుండి సహవాసము, సంఘము ఏర్పడి, వెలుగులోని సువార్త ప్రకాశము ఇతరులను ఆకర్షిస్తుంది. ఈ వెలిగించి, జీవమిచ్చే శక్తి యేసులోనే ఉంది. అందుకే ఆయన “నేనే లోకమునకు వెలుగును” అన్నాడు.

యేసుప్రభువు ఈ ప్రకటన చేసినపుడు ఆయన సమాజమందిరములో బోధిస్తున్నాడు. ఆ సమయములో యెరూషలేములో గుడారాల పండుగ జరుపు కుంటున్నారు. ఆ పండుగ సమయంలో మందిరావరణములో నాలుగు చాలా పెద్ద దీపాలు వెలిగిస్తారు. యాజకుల పాత వస్త్రాలతో ఆ దీపాలకు వత్తులను చేస్తారు. మందిర ఆవరణమంతటా ఆ దీపాల కాంతితో నింపబడి ఉంటుంది. ఆ వెలుగులో జనులంతా నృత్యాలు చేస్తూ సంతోషంగా దేవుని ఆరాధిస్తారు. సమాజములో గౌరవనీయులైన గొప్ప నాయకులు కూడా ఆ రాత్రి అంతా దీపాలు చేతుల్లో పట్టుకొని నృత్యాలు చేస్తూ, పాడుతూ, సందడి చేస్తూ దేవుని స్తుతిస్తారు. ఆ దీపాలు ఇశ్రాయేలు జనాంగానికి తమ అరణ్య ప్రయాణములో పగలు మేఘస్తంభము వలెను, రాత్రి అగ్ని స్తంభము వలెను దేవుడు తమతో ఉండి కాపాడిన సంఘటనలను జ్ఞాపకము చేస్తాయి (సంఖ్యా 9:15–23). అటువంటి తరుణంలో యేసుప్రభువు తానే “లోకమునకు వెలుగుగా ఉన్నాను” అని చెప్పడము సబబుగా ఉన్నది. ఆ దీపాల వలె కాక ఆయన ఆరిపోని దీపము, నిత్యము వెలుగుతూ అందరినీ

నిత్యజీవమనే వెలుగులోనికి తీసికెళ్లే వెలుగు. లోకము పాపము, చెడుతనము, అవివేకమను చీకటితో నిండియున్నప్పుడు ఆయన వెలుగుగా, ఈ లోకాన్ని వెలిగించుటకు వచ్చాడు. బైబిలులో "వెలుగు" దేవునికి, ఆయన పరిశుద్ధతకు సూచనగా ఉంది. యేసుప్రభువు "నిజమైన వెలుగు"గా ఈ లోకానికి వచ్చాడు. "నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండునని వారితో చెప్పెను" ఆయనను 'వెంబడించుట' అంటే ఆయనను విశ్వసించి, విధేయత చూపుట. "జీవపు వెలుగు" అంటే రక్షణ. రక్షణ లేకుంటే పరలోకమునకు పోలేము కాబట్టి మనమంతా ఆయనను వెంబడించాలి. రక్షణ కొరకు ఆయన యొద్దకు వెళ్లిన వారికి క్రొత్త జీవితము వస్తుంది. విశ్వసించినవాడు ఇంకెన్నడూ పాపమనే చీకటిలో నడువడు, అతనికి వెలుగుగాను, రక్షణగాను క్రీస్తు ఉన్నాడు. మారుమనసు పొందకుండా క్రీస్తును వెంబడించలేము. మారుమనసు అంటే మన పాపములను ఒప్పుకొని, పశ్చాత్తాప హృదయముతో దేవుని సన్నిధిలో యేసయ్యను ప్రభువుగా విశ్వసించి, ఒప్పుకొని, తమ్మును తాము పూర్ణ హృదయముతో సమర్పించుకొనుట.

"నేను లోకానికి వెలుగై ఉన్నాను"అనుటలో తానే దేవుడనని చెప్పు కుంటున్నాడు. కీర్తన 27:1లో దావీదు "యెహోవా నాకు వెలుగును, రక్షణయునై ఉన్నాడు" అన్నాడు; "యెహోవాయే నీకు నిత్యమైన వెలుగవును" అని యెషయా ప్రవచిస్తున్నాడు (యెషయా 60:19); "దేవుడు వెలుగై యున్నాడు" అని 1 యోహాను 1:5లో చెప్పబడి ఉంది. తానే లోకానికి వెలుగై ఉండుటకు దేవునిచే పంపబడిన మెస్సయ్య అని చెప్పుకుంటున్నాడు. యేసయ్య  వెలుగు కాబట్టి, ఆ వెలుగులో ఆయనను వెంబడించుట చాలా సులభము. చీకటిలో ఉంటే తొట్రుపాటు పడుతుంటాము.


ఈ మాటలు చెప్పగానే పరిసయ్యులు "నిన్ను గూర్చి నీవే సాక్ష్యము చెప్పుకొనుచున్నావు; నీ సాక్ష్యము సత్యము కాదు" (యోహాను 8:13) అని సవాలు చేశారు. తనకు తానే సాక్షిగా ఉండుట చెల్లదు అన్నారు. స్వంత - ధృవీకరణ కొన్ని సందర్భాలలో చెల్లుబాటు కాదు. చట్టము ఒక సత్యమును ధృవీకరించుటకు ఇద్దరు సాక్షులను కోరుకుంటుంది. యూదా రబ్బీలు స్వంత - ధృవీకరణను తృణీకరించారు. కొన్ని సమయాలలో సత్యము స్థాపించుటకు స్వంత-ధృవీకరణ

ఒకటే మార్గమవుతుంది. కొన్ని సందర్భాలలో ఒక వ్యక్తికి మాత్రమే తన గురించిన విషయాలు తెలుస్తాయి. దేవుని గురించి దేవుడు మాత్రమే సాక్ష్యమివ్వగలడు. యేసుప్రభువు దేవుడు కాబట్టి ఆయన గురించి పూర్తిగా ఆయనకు మాత్రమే తెలుస్తుంది. 7వ అధ్యాయము 29,33,34 వచనములలో తానెక్కడ నుండి వచ్చాడో, ఎక్కడికి వెళతాడో తనకు తెలుసునని నిశ్చయముగా చెప్పాడు. ఆయన పరలోక సంబంధి, దేవుని కుమారుడని వారికి తెలియదు కాబట్టి, వారెవరికీ తనను గురించి తీర్పు తీర్చుటకు యోగ్యత లేదని చెప్పాడు. "మీరు శరీరమును బట్టి తీర్పు తీర్చుచున్నారు" అంటే పాపములో ఉన్న మనుషులు ఇహలోక ప్రమాణాలను బట్టి తీర్పు తీరుస్తున్నారు అంటున్నాడు. యేసయ్య యొక్క పరలోక మూలం వారికి తెలియదు కాబట్టి వారు ఆయనను అర్థము చేసుకోలేకున్నారు. లోకానికి వెలుగుగా వచ్చిన ఆయన వెలుగులో మనము నడవాలి.

### 3. "నేనే ద్వారమును" :

నిజమైన వెలుగుగా తనను తాను ప్రత్యక్షపరచుకున్న మూడవ సందర్భము యోహాను 10:1-10 వచనాలలో వ్రాయబడి ఉన్నది. యేసుప్రభువు పుట్టు గుడ్డివానిని బాగుచేసిన తర్వాత వాడు సమాజమందిరము నుండి వెలివేయబడిన తరువాత జరిగిన బోధ ఇది. ఆ కాలంలోని యూదులకు 'కాపరి', 'గొర్రెలు' అను పదాలు బాగా అర్థమవుతాయి. పాలస్తీనా దేశములోని యూదుల వృత్తి ప్రధానముగా గొర్రెల పెంపకము. కాపరి, గొర్రెలు అనే మాటలు పాత నిబంధనలో చాలాసార్లు వాడబడ్డాయి. దేవుడు కాపరిగాను, ఇశ్రాయేలు ప్రజలు గొర్రెలగాను పోల్చబడేవారు. "కాపరి" అనే పదము సంఘనాయకులకు, రాజకీయ నాయకులకు కూడా వాడేవారు. "కాపరి" అంటే నాయకుడు, నడిపించేవాడని అర్థము. యేసుప్రభువు కాపరే కాకుండా, గొర్రెల దొడ్డికి ద్వారముగా కూడా ఉన్నాడు.

ఆ కాలంలో వారి ఆచారాలను కొన్నింటిని మనము తెలుసుకుంటే ఈ ప్రత్యక్షత సులువుగా అర్థము చేసుకోగలము. ఒక గొర్రెల దొడ్డిని మనము చిత్రీకరించుకోవాలి. పాలస్తీనా దేశములో చాలా ప్రాంతాలు ఎడారి ప్రాంతాలుగా ఉంటాయి కాబట్టి ఒయాసిస్ (నీటి చెలమ) లాంటి పచ్చికగల ప్రదేశాలు ఎంచుకొని రాళ్ళతో పెద్దదొడ్డి ఏర్పాటు చేసుకొని, దానికి ఒక తలుపు పెట్టుకుంటారు. కొద్దిమంది



కాపరులు ఉమ్మడిగా దొడ్డిని ఏర్పరచుకొని, దానికి ఒక కాపలావాడిని ఏర్పరచు కుంటారు. అతడు ఆ ద్వారమునకు అడ్డుగా పడుకొని తన యజమానులను, వారి మందలను మాత్రమే లోనికి రానిస్తాడు. పగలంతా బయట పచ్చిక మేయించుకొని రాత్రివేళ తమ గొర్రెల మందతో పాటు దొడ్డిలోనికి వాటిని తోలుతారు. తిరిగి ఉదయాన్నే తమ తమ మందలను కూర్చుకొని బయటకు తీసుకొని వెళతారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఏ కాపరి గొర్రెలు ఆ కాపరి యొద్దకు చేరడము, కాపరి స్వరము గుర్తించి తమ యజమాని యొద్దకు పరుగెడుతాయి. ఒక సంఘకాపరి తన సంఘసభ్యులకు ఈ సత్యము రుజువు చేయుట కొరకు వారిని ఒక గొర్రెల దొడ్డియొద్దకు తీసికెళ్లాడు. వారు ఆ గొర్రెల కాపరిని ప్రశ్నించి, అతడు ఏ విధముగా వాటిని పిలుస్తాడో నేర్చుకొని, అదే విధంగా వాటిని పిలవడానికి ప్రయత్నించారు. ఒకరి తర్వాత ఒకరు పిలుస్తున్నా, అవి పట్టించుకోనేలేదు కాని వాటి యజమాని పిలువగానే పరుగెత్తి అతని యొద్దకు వచ్చాయి. ఆ దృశ్యము ప్రతి యూదునికి సుపరిచితమే కాబట్టి యేసుప్రభువు ఈ పోలిక వాడాడు. సమాజమందిరము నుండి గ్రుడ్డివానిని వెలివేసిన కాపరులు దయాదాక్షిణ్యము లేని కాపరులు అను విషయము వారు అర్థము చేసుకోవాలని ప్రభువు ప్రయత్నిస్తున్నాడు. ఇశ్రాయేలీయులు తమను గురించి తాము “మనము ఆయన ప్రజలము, ఆయన మేపు గొర్రెలము” (కీర్తన 100:3) అంటారు. దేవుని గొర్రెలుగా ఉండే ఆధిక్యత దేవుడు వారికిచ్చాడు. “దేవుని ఇశ్రాయేలు” (గలతీ. 6:16)గా మనలను ఏర్పరచుకున్న దేవుడు మనకు కూడా కాపరిగా ఉన్నాడు.

10వ అధ్యాయము మొదటి భాగములో యేసయ్య ద్వారము యొక్క ప్రాముఖ్యత చెప్తున్నాడు. దొడ్డికి ఒకే ద్వారము ఉంటుంది. నిజమైన గొర్రెల కాపరి ద్వారము నుండే ప్రవేశిస్తాడు, కాపాలాదారుడు అతనికి తలుపు తీస్తాడు. కొన్నిసార్లు దొంగలు ఆ ద్వారము నుండి ప్రవేశించలేరు కాబట్టి దొడ్డి గోడలు ఎక్కి లోపల ప్రవేశిస్తారు. మోసంతో లోపలికి వచ్చినా, గొర్రెలు దొంగ వెంబడి పోవు, ఎందుకంటే అవి తమ యజమాని స్వరము గుర్తిస్తాయి. నిజమైన కాపరి తన గొర్రెలన్నింటిని పోగుచేసుకొని ముందు నడుస్తుంటే, అవి వెంబడిస్తాయి. దొంగ వెంబడి ఆ విధంగా వెళ్లవు. ఈ మాటలు ఎందుకు, ఎవరి మేలు కొరకు చెప్తున్నాడో వారికి అర్థము కాలేదు. అందుకే మళ్లీ ఇంకొకసారి వివరిస్తున్నాడు. “నేనే ద్వారమును” అను మాట రెండు సార్లు పలికాడు. తానే గొర్రెల దొడ్డికి ద్వారముగాఉండి యూదా మతము నుండి బయటికి వచ్చిన వారిని తన మందలో చేర్చుకొంటానంటున్నాడు. మనోకాఠిన్యముతో గుడ్డివానిని వెలివేస్తే యేసుప్రభువు కనికరపడి అతనిని చేర్చుకున్న సంగతి వారికి గుర్తుచేస్తున్నాడు. కాపరి ద్వారము ద్వారా మందను బయటకు తీసుకెళ్లడమే గాకుండా, లోపలికి తీసికొని వస్తాడు.

ఈ మాటలన్నీ యేసయ్య కొన్ని చిహ్నాలు ద్వారా వారికి తెలుపుచున్నాడు. “నేనే ద్వారమును” అని చెప్పుటలో రక్షణలోకి వెళ్లుటకు ద్వారము తానే అంటున్నాడు. ఎవరైనా ఆ ద్వారము ద్వారా వెళితే, వారు స్వాతంత్ర్యములోనికి ప్రవేశిస్తారు. “లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచు నుండును” రక్షింపబడిన విశ్వాసికి పూర్తి స్వాతంత్ర్యము వస్తుంది. అపవాదికి వాడిపై అధికారము లేదు. ఒక ఖైదీ చట్టపరంగా విడుదల పొందితే వచ్చే ధైర్యము వలన ఇకపై ఎవరికీ భయపడనవసరము లేదనే నిశ్చింత వస్తుంది. దొంగకాపరి తనను ఎత్తుకుపోతాడేమోనన్న భయము అవసరము లేదు. ద్వారము దగ్గరుండే కాపలాదారుడు స్వతంత్రంగా ప్రవేశించవచ్చును.

యేసయ్య ఆనాటి మతనాయకులను దొంగలతో పోలుస్తున్నాడు. వారికి తమ గొర్రెలపై ప్రేమ లేదు, వారిని దోచుకొనువారై ఉన్నారు. పుట్టుగుడ్డి వాడైన భిక్షగాడిపట్ల వారి ప్రవర్తన ఇందుకు రుజువుగా ఉన్నది. ఆనాటి మతనాయకులు

ఎల్లవేళలా తమ స్వప్రయోజనాలు చూసుకునేవారు. పరిసయ్యులు ధనాపేక్ష గలవారై (లూకా 16:14), విధవరాండ్ర యిండ్లు దిగమ్రింగుచు (మార్కు 12:40) ఉండేవారు. ప్రార్థనా మందిరమును దొంగల గుహగా చేసి (మత్తయి 21:13), యేసయ్యను చంపుటకు ప్రయత్నించారు. అందుకే వారు అపవాది ఆధీనంలో ఉండి దొంగ కాపరులైనారు. అయితే యేసయ్య అనే ఈ "ద్వారము" ద్వారా ప్రవేశించిన వారికి జీవము, రక్షణ వస్తాయి. ద్వారము గుండా లోపటికి, బయటకు స్వేచ్ఛగా తిరుగుట వలన సమృద్ధి జీవము కలుగుతుంది. ప్రభువు తీసికెళ్లే పచ్చిక బయళ్లలో, శాంతికరమైన జలములయొద్ద ప్రశాంతమైన, నిశ్చింత జీవితము దొరుకుతుంది. ఆయన మన కొరకు ప్రాణము పెట్టడమే గాకుండ, ఇప్పుడు కూడా సమృద్ధి జీవమిస్తున్నాడు. ఈ ప్రకటనలో కాపరికంటే ద్వారము గురించే ఎక్కువగా చెప్పాడు. ఈ "ద్వారము" గుండా ఆయన మందలోకి గొర్రెలతో కూడా ఆయన దొడ్డిలోనికి వెళ్లినప్పుడే మనకు రక్షణ, భద్రత, స్వాతంత్ర్యము, సమృద్ధి (ఇహమందున, పరమందున) దొరుకుతుందని తెలుసుకోవాలి.

## 4. "నేను గొర్రెలకు మంచి కాపరిని" :

యోహాను 10వ అధ్యాయములోనే "నిజమైన వెలుగు"ను గురించిన ఈ నాలుగవ ప్రత్యక్షత 10-21 వచనముల వరకు ఉన్న వాక్య భాగములో చూడగలము. ఈ మాటలలో తనకూ, అబద్ధ కాపరులకున్న తేడా చూపిస్తున్నాడు. ఆనాటి దొంగకాపరులు యూదా మతమునకు సంరక్షకులుగా ఏర్పరచబడ్డారు కాని వారు దొంగలు, హంతకులుగా తయారైనారు. ఇప్పుడు వారిని "జీతగాళ్లు"గా యేసయ్య చూపిస్తున్నాడు.

"మంచి" అనే మాటకు వాడబడిన గ్రీకు పదమునకు (క్యాలోస్) అర్థము ప్రశస్థమైన, శ్రేష్టమైన, యోగ్యమైన, యుక్తమైన, న్యాయమైన, మాదిరికరమైనది. ఇవన్నీ యేసయ్యకున్న లక్షణాలు. ఇతరులు అనుకరించుటకు తగిన ప్రవర్తన కలిగినవారిని "మంచి" అనేవారు. ప్రభువు యొక్క మంచితనము ఆయన సహజ గుణలక్షణము. "మంచి" అని ఎవరినైనా పిలిస్తే అతనిని "దేవుడు" అని పిలిచినట్లు. "దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు" (మార్కు 10:18) అని యేసయ్య స్వయంగా చెప్పాడు.

బైబిలులో పేర్లు నమోదు గావించబడిన గొప్ప వ్యక్తులలో కొందరు గొర్రెల కాపరులుగా ఉన్నారు; హేబేలు, పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, మోషే, దావీదు, ఆమోసు మొదలైనవారు. ఈనాడు కూడా ఇశ్రాయేలు దేశంలో మంచి కాపరులను చూడగలము. యూదా కాపరులు కోసుకొని తినడానికి గొర్రెలను పెంచేవారు కాదు గాని వాటినుండి వచ్చు ఉన్ని, పాలు, గొర్రెపిల్లల కొరకు పెంచేవారు. కేవలము దేవునికి బలి ఇచ్చుటకు మాత్రమే మందిరములో అర్పించేవారు.

యేసుప్రభువు ఈ వాక్యభాగములో "మంచికాపరి" గా తాను చేస్తున్న నాలుగు ప్రత్యేక పరిచర్యలు చూపిస్తున్నాడు.

**ఎ. తన గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును** (యోహాను 10:11-13). పాత నిబంధన కాలంలో, కాపరి కొరకు గొర్రెలు చనిపోయేవి (బలులు ఎక్కువగా జరుగుచుండుట చేత ఎక్కువ గొర్రెలను బలిగా అర్పించేవారు), కాని ఈ మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెడ్తున్నాడు. యేసుప్రభువు తన మరణము గురించి చెప్తున్నాడు. ఆయన హతసాక్షిగా మనుష్యుల చేత చంపబడలేదు గాని, మనకు ప్రత్యామ్నాయంగా తనంతట తానే ప్రాణము పెట్టాడు. ఆయన కేవలము ఇశ్రాయేలు ప్రజలు, విశ్వాసుల కొరకే గాక ప్రపంచమంతటి కొరకు ప్రాణము పెట్టాడు. ఆయన రక్తము లోకమంతటి రక్షణ కొరకు సరిపోతుంది గాని, విశ్వసించిన వారిపట్ల మాత్రమే ప్రయోజనకరముగా ఉంటుంది.

ఆయన తనను తాను జీతగాళ్లతో పోల్చుకొని వారిలాగా తాను లేనని రుజువు చేస్తున్నాడు. వారు జీతము కొరకే పని చేస్తారు, ప్రమాదము వచ్చినపుడు గొర్రెలను వదిలి పారిపోతారు. కాని మంచికాపరి అక్కడే ఉండి తన మందను కాపాడుకుంటాడు. "గొర్రెలు తనవి కానందున" అనే మాటలు వ్రాయబడి ఉన్నవి. యేసయ్య తన ప్రశస్తమైన రక్తముతో తన గొర్రెలను కొన్నాడు కాబట్టి అవి ఆయనకు చెందినవై ఉన్నాయి, ఆయన వాటిని కాపాడుకొంటాడు.

బైబిలు అంతటిలో దేవుని ప్రజలను గొర్రెలతో పోల్చారు. గొర్రెలు శుభ్రమైనవి, కాని అవి తెలివితక్కువవి కాబట్టి దారి తప్పిపోతాయి. అందుకు కాపరి అవసరము ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రభువు తనను విశ్వసించిన వారందరినీ తన కాపుదలలో ఉంచుకొంటాడు.

**బి. ఆయనకు తన గొర్రెలు తెలుసు** (యోహాను 10:14, 15). తెలుసుకోవడము అంటే చాలా సన్నిహితంగా, సమీపంగా లోతుగా తెలుసుకొనుట - దేవునికి, తన ప్రజలకు ఉన్న సన్నిహిత సంబంధము. ఆయనకు తన గొర్రెల పేర్లు తెలుసు. యేసయ్య పరిచర్య ప్రారంభములో తన శిష్యులను కలుసుకోక ముందే వారి పేర్లన్నీ తెలుసు; జక్కయ్యను పేరుతో పిలిచాడు (లూకా 19:5); పునరుత్థానుడైన తర్వాత మగ్దలేనే మరియను పేరుతో పిలువగానే గొర్రె తన కాపరి స్వరము గుర్తించినట్లు, ఆమె కూడా ఆయనను గుర్తించింది (యోహాను 20:16). ఆయనకు మన స్వభావము తెలుసు. తన గొర్రెలకు ఏదైనా ప్రత్యేకమైన అవసరత ఉంటే ఆయన గుర్తించి తీరుస్తాడు. చిన్న గొర్రెపిల్లలను భుజాలపై మోసుకెళ్తాడు. తన శిష్యుల స్వభావాలన్నీ ఆయనకు తెలుసు. మన స్వభావాలు తెలుసు కాబట్టి మన అవసరాలను గుర్తించి నెరవేరుస్తాడు. దావీదు వ్రాసిన 23వ కీర్తనలో ఒక మంచి కాపరి తన గొర్రెలను ఎంత జాగ్రత్తగా చూచుకుంటాడో చాలా అందంగా వివరించబడింది. ఆయన తన గొర్రెలను చాలా ప్రేమిస్తాడు, వారు కూడా ఆయనను ప్రేమించాలంటే ఆయన స్వరము వినడము, విధేయత చూపడము నేర్చుకోవాలి.

**సి. మంచి కాపరి తన దొడ్డివి కాని వేరే గొర్రెలను కూడా తన మందలోకి తెస్తాడు** (యోహాను 10:16). మంద యూదులకు సాదృశ్యముగాను, వేరే గొర్రెలు అన్యులకు సాదృశ్యముగాను ఉన్నాయి. అన్యులు, దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనకు వెలుపట ఉన్నారు. యేసుప్రభువు ఈ లోకంలో తన పరిచర్య మొదటి భాగంలో నశించిపోతున్న ఇశ్రాయేలీయులను గురించే పట్టించుకున్నాడు గాని ఆయన పునరుత్థానుడైన తర్వాత సంఘము స్థాపించబడి, అన్యులు యేసయ్య మందలోకి వచ్చారు. “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను” అనే వాక్యమునకు సంపూర్ణ అర్థమిక్కడ దొరుకుతుంది. నశించిపోతున్న లోకము కొరకు ఆయన చనిపోయాడు, నిత్యజీవము గురించిన సువార్తతో మనము నశించుచున్న వారిని దేవుని మందలోకి చేర్చాలన్నదే ఆయన ప్రణాళిక.

**డి. మంచి కాపరి తన ప్రాణమును తిరిగి తీసుకొనును** (యోహాను 10:17-21). తనంతట తాను ప్రాణము పెట్టిన మంచి కాపరి, తన గొర్రెల కొరకు తిరిగి మరణము నుండి లేచాడు. తండ్రి అయిన దేవుడు ఆయనకే అధికారమిచ్చాడు.

"నేను మంచి కాపరిని" అని యేసయ్య చెప్పిన మాటలు యూదులకు రుచించలేదు. వారిలో వారికి విభేధాలు వచ్చాయి, యేసుప్రభువే ద్వారము కాబట్టి మంచివారిని, తనను విశ్వసించిన వారిని లోనికి రానిచ్చి, చెడ్డవారిని బయటకు త్రోసివేసే అధికారము, శక్తి ఆయనకున్నాయని గుర్తించాలి.

## 5. "పునరుత్థానమును, జీవమును నేనే" :

ఈ అద్భుతమైన ప్రత్యక్షత యోహాను 11:25 లో గ్రంథస్తము చేయబడి ఉంది. "నిజమైన వెలుగు"ను గురించిన సత్యము యేసయ్య తన పాదాల యొద్ద కూర్చుని బోధలు వినిన మరియతో కాక, ఆమె సహోదరి అయిన మార్తతో చెప్తున్నాడు. తన ఇంటికి యేసయ్యను ఆహ్వానించినందుకు ఆమెకు ఆయనిచ్చిన గొప్ప ధన్యత అని నాకనిపిస్తుంది. ఏ యోగ్యత లేని ఆమెకు ఈ ప్రత్యక్షత ఇచ్చాడు.

బేతనియలోని మార్త, మరియ, లాజరుల ఇంటికి యేసుప్రభువు అప్పుడప్పుడు వెళుతూ ఉన్నట్లుగా లేఖనాలు చెప్తున్నాయి. లాజరు జబ్బుచేసి చనిపోయే స్థితిలో ఉన్నాడని కబురు పెట్టారు గాని యేసయ్య వెంటనే వెళ్లలేదు. తర్వాత లాజరు చనిపోయాడని తెలిసింది కాని వెళ్లలేదు. నాలుగు దినములైన తర్వాత బేతనియకు వెళ్లాడు. యేసయ్య వస్తున్నాడని విని మార్త ఆయనను కలుసుకొనుటకు వెళ్లింది మీరు ఇక్కడ ఉండి ఉంటే లాజరు చనిపోయి ఉండేవాడు కాదని ఆమె యేసయ్యతో అనినప్పుడు, ఆయన విశ్వాసముంచితే ఇప్పటికైనా మరణము నుండి లేస్తాడని చెప్పాడు. అయితే మార్త తనకున్న లేఖన జ్ఞానమును బట్టి అంత్యదినమందు లేస్తాడని నమ్ముతున్నానని చెప్తుంది. అయితే ప్రభువు ఆమెతో "పునరుత్థానమును, జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును" అని చెప్పాడు. ఇది వెలుగును గురించిన అయిదవ ప్రత్యక్షత. సృష్టికర్త, జీవితం కొనసాగించే వాడునైన దేవుడికే మరణాన్ని జయించే శక్తి ఉంది.

భవిష్యత్తులోని పునరుత్థానమును గురించి మార్త చెప్పినప్పుడు యేసయ్య కాదనలేదు. సనాతన యూదుల విశ్వాసము ప్రకారము మృతుల పునరుత్థానము

అంత్య కాలమున జరుగుతుంది. అయితే ఈ ప్రకటన ద్వారా యేసయ్య ఆ సిద్ధాంతము యొక్క రూపురేఖలు మార్చేశాడు. దానివలన మార్తకు గొప్ప ఆదరణ కలిగించాడు.

పాత నిబంధనలో పునరుత్థానమును గురించిన సిద్ధాంతము స్పష్టంగా లేదు, నీడలో ఉన్నట్లుగా ఉంది. దానిని యేసయ్య వెలుగులోకి తెచ్చాడు. ఆయన బోధలు, అద్భుతాలు, తన స్వంత పునరుత్థానము ద్వారా శారీరక పునరుత్థానము గురించి నేర్పించాడు. మరణము అందరికి తప్పనిసరి కాని మరణము తర్వాత జీవిత ముందనియు, శరీరము తిరిగి దేవుని శక్తితో లేపబడుతుందనియు బోధించాడు.

ఈ పునరుత్థాన సిద్ధాంతాన్ని ప్రభువు ఇంకొకరకంగా కూడా మార్చాడు. దానిని వెలుగులోకి తెచ్చుటయే గాక, వ్రాతపూర్వకంగా ఉన్న దానిని తనలోకి తెచ్చాడు. తానే పునరుత్థానము, జీవము అని చెప్పాడు. ఒక పుస్తకములోని ఒక సిద్ధాంతము ద్వారా మనము రక్షింపబడలేదు గాని రక్షకుని ద్వారా విమోచింపబడి యున్నామని తెలిపాడు. విశ్వాసము ద్వారా ఆయనను తెలుసుకుంటే, మరణమనే నీడను చూసి మనము భయపడనవసరము లేదు. నీవు రోగిగా ఉన్నప్పుడు, నీకు వైద్యుడు కావాలి కాని, వైద్యము గురించి వ్రాయబడిన పుస్తకము కాదు; ఏదైనా సమస్య వచ్చి న్యాయస్థానముకు వెళ్లవలసివస్తే, నీకు కావలసినది నీ తరపున వాదించుటకు న్యాయవాది గాని న్యాయవ్యవస్థను గురించి తెలిపే పుస్తకము కాదు. అదే విధముగా నీ చివరి శత్రువైన మరణమును ఎదుర్కొనుటకు ఒక పుస్తకములో వ్రాయబడిన సిద్ధాంతము కాదు గాని రక్షకుడు కావాలి. ప్రతి సిద్ధాంతము యేసుప్రభువులోనికి వచ్చినట్లుగా చూడగలము. 1కొరింథీ 1:31లో "దేవుని మూలముగా ఆయన (క్రీస్తు) మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనమునాయెను" అని వ్రాయబడి ఉంది.

మార్త భవిష్యత్తులో తన సహోదరుడు పునరుత్థానుడవుతాడును కుంటున్నది కాని యేసయ్య దానిని ప్రస్తుతములోకి తెచ్చాడు. తానే పునరుత్థానమును, జీవమును అని చెప్పి "నమ్ముచున్నావా" అని మార్తను అడిగినప్పుడు, ఆమె నమ్ముచున్నానని చెప్తూ ఆయనను మూడు విధములుగా సంబోధిస్తున్నది. "ప్రభువు", "దేవుని కుమారుడు", "క్రీస్తు" అంటున్నది. మృతుడైన లాజరును లేపుటకు శక్తిగల వాడని

నమ్మింది. యేసుప్రభువు చనిపోయి తిరిగి లేస్తానని చెప్తూ, సకల లోకానికి జీవము నివ్వగల శక్తి తనకే ఉందని చెప్తున్నాడు. మరణముపై తనకు అధికారముందని కూడా రుజువు చేస్తున్నాడు. యూదులుకు గాని, రోమనులకు గాని ఆయనను చంపే శక్తి లేదు, తనంతట తానే ప్రాణము పెడతాడని ప్రజలు తెలుసుకొనుటకు ఒక సాక్ష్యముగా ఈ ప్రత్యక్షత ఉపయోగపడుతుంది. ఆయన పరిచర్య సమయంలో ముగ్గురిని మరణము నుండి లేపాడు కాబట్టి మరణము ఆయనను ఏమి చేయలేదు అనే సత్యము కూడా అందరికీ తెలుస్తుంది. సమృద్ధి జీవము నిచ్చుటకు ఆయన ఈ లోకానికి వచ్చాడని రుజవవుతున్నది. మరణమనే చీకటి నుండి నిజమైన వెలుగు లోనికి నడిపించు శక్తి యేసయ్యకు మాత్రమే ఉంది. పునరుత్థాన శక్తికి సూచనగా లాజరు లేపబడ్డాడు.

బైబిలు తెలియని పాఠకులకు "పునరుత్థానము" అను పదము క్రొత్తగా ఉంటుందేమో, పునరుత్థానము గురించి కొన్ని సంగతులు మనము ధ్యానించు కుందాము. ఇది రెండు మాటల కలయిక – పున:+ఉత్థానము. పున:=మరల, ఉత్థానము=లేచుట. తనంతట తానే మరణము నుండి లేచిన సందర్భాలలో మాత్రమే ఈ మాటలు వాడాలని పండితులు చెప్తున్నారు. క్రైస్తవులకు ఇది ఒక ప్రత్యేకమైన చారిత్రాత్మిక సంఘటన. మరణ, పునరుత్థానములు లేకుంటే క్రైస్తవ్యమే లేదు. పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 15వ అధ్యాయమంతా పునరుత్థానము గురించి వ్రాశాడు. 1కొరింథీ 15:3లో "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను. సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" అని వ్రాశాడు. 1కొరింథీ. 15:17లో "క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములోనే యున్నారు" అంటున్నాడు. మన పాపములకు, యేసయ్య పునరుత్థానమునకు సంబంధమేమిటి అని మనము తెలుసుకోవాలి. హెబ్రీ పత్రికలో దీనిని గురించి పరిశుద్ధాత్ముడు చక్కగా వివరించాడు. 9:22లో ఈ విధంగా వ్రాయబడి ఉంది – "ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులును రక్తము చేత శుద్ధిచేయబడుననియు, రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును".

పాత నిబంధనలో దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలు ప్రజలకిచ్చిన ధర్మశాస్త్ర ప్రకారము వారు తమ పాపముల నిమిత్తము బలులర్పించేవారు. అయితే క్రీస్తు

తన స్వరక్తముతో ఒక్కసారే మనందరి పాపముల నిమిత్తము బలిగావించబడ్డాడు. ఆయన అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పునరుత్థానుడయ్యాడు. పాత నిబంధనలోని బలిపశువులు చనిపోయి తిరిగి లేవలేదు గాని సజీవుడైన క్రీస్తు లేచుట ద్వారా మనకు రక్షణ వచ్చింది. దేవుడు ఈ బలిని అంగీకరించినట్లు గుర్తుగా ఆయనను తిరిగి సజీవునిగా చేశాడు. పౌలు రోమా పత్రిక 4:25లో "ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి, మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" అన్నాడు.

ఆయన యందు విశ్వాసముంచినవారు చనిపోయినను తిరిగి లేతురు అను మాటను గురించి పౌలు 1థెస్సలోనికయులకు 4:14-17 వరకు ఉన్న వాక్య భాగములో వివరించాడు. రెండవ రాకడలో యేసుప్రభువు వచ్చినపుడు "క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు" అంటే పునరుత్థానులవుతారని అర్థము. పునరుత్థానమును, జీవమును నేనే అనిన క్రీస్తునందు విశ్వాసముంటే మనము కూడా చనిపోయినా తిరిగి లేచి నిత్యత్వములో ఆయనతో కూడా ఉండగలము.

## 6. "నేనే మార్గమును, సత్యమును, జీవమును" :

ఈ ప్రత్యక్షతను యోహాను 14:6లో చూడగలము. యోహాను సువార్త రెండవ భాగమంతా యేసయ్య తన శిష్యులతో మాట్లాడుట, బోధించుట, నేర్పించుట, సిద్ధపరచుట కనపడుచున్నది. ఆయన తదనంతరము తన పరిచర్య కొనసాగించాల్సింది వారే గనుక, తాను సిలువలో అప్పగింపబడక ముందు చివరి వారమంతా వారితో ప్రత్యేకంగా గడిపి, అనేక విషయములు విస్తారంగా బోధించాడు. 14వ అధ్యాయంలో వారిని కలవరపడ వద్దని సలహా ఇస్తున్నాడు. మూడున్నర సంవత్సరములు వారు సమస్తము వదలి ఆయనతో రాత్రింబగళ్లు గడిపిన శిష్యులు, ఆయన తమను వీడి వెళ్లిపోతున్నాడను సంగతి జీర్ణించుకోలేక పోతున్నారు. అందుకే వారిని ఉత్తేజ పరచుటకై వారితో తాను వెళ్లబోయే పరలోకము గురించి చెప్పి వారి కొరకు తాను నివాసములు సిద్ధపరచి, తిరిగివచ్చి తీసికొనిపోతానని చెప్తున్నాడు. పరలోకము ప్రేమ, ఆనందముతో కూడిన స్థలము. యోహాను ప్రకటన 21,22లో పరలోకమును

గురించి వర్ణిస్తూ మాటలు చాలక మరణముండదు, దు:ఖముండదు, ఏడుపు, వేదన ఉండదు అని చెప్పాడు. అటువంటి చోటికి వెళ్లుటకు మార్గము తానే అంటున్నాడు. తాను వెళుచున్న స్థలానికి మార్గము వారికి తెలియునని చెప్పినప్పుడు తోమా తమకు తెలియదని చెప్పాడు. ఆ మార్గమేదని అడిగినప్పుడు యేసయ్య చెప్పిన సమాధానమిది : “నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు”. తానే పరలోకమునకు మార్గముగా ఉన్నానని చెప్పాడు. ఆయన మార్గము చూపించలేదు గాని తానే మార్గమని చెప్తున్నాడు. ఆయనలో రక్షణ ఉంది, ఆయనను అంగీకరించి నపుడు రక్షణ వస్తుంది, ఆ రక్షణ ద్వారా పరలోకానికి వెళ్లగలము. క్రైస్తవ్యమంటేనే క్రీస్తు మార్గము. ఆదిమ సంఘములో క్రైస్తవ్యానికి అదే పేరు కూడా పెట్టబడి ఉంది. అపొ.కార్యములు 9:2లో “ఈ మార్గము”; 19:9లో “ఈ మార్గము”; 19:23లో “క్రీస్తు మార్గము”; 22:4, 24:14,22లో “ఈ మార్గము” అని చూడగలము.

‘నా ద్వారా తప్ప తండ్రియొద్దకు ఎవరూ రాలేరు’ అను మాటతో మంచి పనులు మతపరమైన ఆచారాలు, ఖరీదైన బహుమతులు, ఇలాంటి మార్గాలన్నీ మూయబడుతున్నాయి. ఒకే ఒక మార్గముంది. అది యేసుక్రీస్తే. హెబ్రీ పత్రికా కారుడు “నేనే మార్గమును” అని చెప్పిన యేసయ్య మన కొరకు ప్రతిష్టించిన మార్గము గురించి కొన్ని అద్భుత విషయములు 10:19-25 వరకు ఉన్న వాక్యభాగములో చెప్తున్నారు. యేసుక్రీస్తు ద్వారా దేవుని సమీపించుటకు మార్గము సిద్ధపరచబడినందున దేవుని దగ్గరకు చేరుదము రండి అని గ్రంథకర్త పిలుపు నిస్తున్నాడు. విశ్వాసముతో సమీపించి, నిరీక్షణతో గట్టిగా పట్టుకొని, ప్రేమతో ఒకరిని ఒకరు ప్రోత్సహించుకుందాము అని చెప్తున్నాడు. ఈ మార్గము ఎటువంటిదో వివరిస్తూ, పవిత్రపరచబడినది, నూతనమైనది, జీవముగలది, శరీరము అను తెరద్వారా ఏర్పరచబడిన మార్గము, ఆయన రక్తము ద్వారా, యేసయ్య యాజకత్వము ద్వారా ఏర్పరచబడిన మార్గమని చెపుతున్నాడు.

ఆయన మార్గము మాత్రమే కాకుండా సత్యమై ఉన్నాడు. ఆయన కేవలము సత్యము బోధించువాడే కాదుగాని, సత్యానికి నివాసస్థానము, ఆయనను కలిగి యున్నవారు సత్యమును కలిగియుందురు. ఆయనే సత్యము, కృపాసత్యసంపూర్ణుడు.

సత్యము ద్వారా స్వాతంత్ర్యము వస్తుంది కాబట్టి సత్యాన్వేషణ చేయాలి. సత్యాన్వేషణ, స్థిరత్వము, భద్రత కొరకు ప్రతి మనిషి అన్వేషిస్తూనే ఉంటాడు. కాని క్రీస్తు మనకొరకు ఆ అన్వేషణ సులభతరముగా చేశాడు. యేసయ్యను తెలిసికున్న తర్వాత విశ్వాసము, ప్రేమ ద్వారా సత్యము మన జీవితంలోకి వస్తుంది. యేసుప్రభువు దేవునిని పరిపూర్ణముగాను, యిక మరెట్టి అవసరము లేనంతగాను బయలుపరచిన యథార్థి. దేవుని గూర్చి ఎన్నో సత్యాలను బోధించిన వారున్నారు గాని "నేనే సత్యము"ను అని చెప్పిన వారెవరూ లేరు. యేసే సత్యము, పరిపూర్ణ సత్యవర్తనుడు. అబద్ధ వర్తనులు బోధిస్తే అది సత్యము కాదు. ఆయనే జీవము కూడా. ప్రతి మనిషిలోని జీవము అతడికి శక్తిని, సంతోషాన్ని, ముందుకు సాగే ఆశను ఇస్తుంది. యేసయ్యలో ఇవన్నీ ఉన్నాయి. మీకు జీవమును, సమృద్ధియైన జీవమును ఇచ్చుటకు వచ్చానంటాడు. లెమ్ము, తేజరిల్లుము క్రీస్తు నీకు జీవమిచ్చుటకు వచ్చియున్నాడు అని ప్రతి విశ్వాసి తోటి విశ్వాసులను ప్రోత్సహించాలి. క్రీస్తు లేకుండా ఒకడు జీవించడము వ్యర్థము, అతడు తప్పిపోయిన కుమారునిలాంటివాడు. లూకా 15:11-32 వరకు వాక్యమును గురించి ఉపమానము చెప్పాడు. ఒక మనిషికి ఇద్దరు కుమారులుంటే, చిన్నవాడు తన ఆస్థిలో తనకు వచ్చు భాగమిమ్మని తండ్రినడిగి, తీసికెళ్లి తన ఆస్థిని దుర్వ్యాపారము వలన పాడు చేశాడు. బుద్ధి వచ్చినపుడు తిరిగి తండ్రి యొద్దకు వచ్చినపుడు, తండ్రి అతనిని సంతోషముగా ఇంటిలోనికి తీసికెళ్లి ఆదరించాడు. ఆ తండ్రి పెద్ద కుమారునితో చెప్పిన మాటలు 15:32లో చూడగలము: "ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రతికెను, తప్పిపోయి దొరికెను" అన్నాడు. క్రీస్తు లేకుండా జీవించడము వ్యర్థము, అది నిర్జీవమైనది.

జీవము గురించి యేసయ్య స్వయంగా చెప్పిన కొన్ని మాటలు చూద్దాము:

యోహాను 3:36లో "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" అంటున్నాడు. యోహాను 5:24 : "నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను". నేనే మార్గమును, సత్యము, జీవము అని చెప్పిన

యేసయ్య మానవుని అవసరాలన్నీ తీర్చేవాడిగా ఉన్నాడని గుర్తించాలి. ఈ ప్రత్యక్షతను అర్థము చేసుకున్న ప్రతి విశ్వాసి నిజమైన వెలుగులో ఉండాలని కోరుకొని దానిని వెంబడిస్తాడు.

**7. "నేను నిజమైన ద్రాక్షావల్లిని" :**

ఈ ప్రత్యక్షత యోహాను 15:1లో కనపడుతుంది. ఇది చివరి ప్రత్యక్షత. ఇందులో ఆయన ద్రాక్షావల్లిగా ఉండి, మనము తీగెలుగా ఉంటే దానివలన మనకు ఆయన జీవము పంచుకొనే ఆధిక్యత, ఆయనకు అంటుకట్టబడి ఉండాలను బాధ్యత కనపడుతుంది.

ద్రాక్షతోటలు కలిగి యుండుట ఇశ్రాయేలు జనాంగానికి, వారి జీవన విధానము. 'ద్రాక్షవల్లి', 'తీగెలు', 'వ్యవసాయకుడు' వంటి దృశ్యాలు యూదులకు సుపరిచితము. ఈ ప్రత్యక్షతలోని కొన్ని అంశములు ధ్యానించుకుందాము

లేఖనాలలో మూడు వేరు వేరు రకాల ద్రాక్షావల్లులు ఉన్నాయి. భూతకాల ద్రాక్షవల్లి ఇశ్రాయేలు జనాంగము. ఇశ్రాయేలు ప్రజలు తన ద్రాక్షతోట అని దేవుడు అంటున్నాడు. తన మహాకృపచేత వారిని ఐగుప్తు బానిసత్వములో నుండి తెచ్చి వాగ్దాన దేశములో నాటాడు. ఆ ద్రాక్షావల్లి ఫలించాలని ఆశతో అవసరమున్నవన్నీ సమకూర్చాడు. యెషయా 5:4లో "నేను నా ద్రాక్షతోటకు చేసిన దానికంటే మరేమి దానికి చేయగలను"? అని దేవుడు ప్రశ్నిస్తున్నాడు. అయితే దానికి కారుద్రాక్షలు వచ్చాయి. న్యాయాన్ని, నీతిని అనుసరించకుండా, అవినీతి, అన్యాయములో కూరుకుపోయింది. దానిని బాగుచేయుటకు తన స్వంత కుమారుని పంపితే, ఆయనను తృణీకరించి, చంపేశారు.

భవిష్యత్తు కాలంలోని ద్రాక్షావల్లి కూడా ఉంది. అది "భూమి మీద నున్న ద్రాక్షావల్లి"గా ప్రకటన 14:14-20లో వ్రాయబడి ఉంది. దేవుని తీర్పు కొరకు సిద్ధపడుతున్న అన్యులకు సూచనగా ఉంది. విశ్వాసులు "పరలోక తీగెలు", అవిశ్వాసులు "భూమిపైని తీగెలు", యేసుప్రభువును విశ్వసించినవారు ప్రభువు పైనను, అవిశ్వాసులు ఇహలోక పరమైన వాటిపైనను ఆధారపడుతారు. విశ్వసించని వారు కత్తిరించబడి అగ్నిలో వేయబడుదురు.

వర్తమాన కాలములోని ద్రాక్షావల్లి యేసుక్రీస్తు. ఈ ద్రాక్షావల్లికి తీగెలము మనము. తీగెలు తామంతట తాము నిలిచి యుండలేవు. దానిలో జీవము లేదు, దాని జీవము ద్రాక్షవల్లి నుండి రావాలి. ఆత్మలో క్రీస్తుతో సంబంధము కలిగి ఉంటే ఫలిస్తాము. మనంతట మనము ఫలించలేము అని త్వరగా గుర్తించి ఆయనలో నిలిచి యుండాలి. "నిలిచి యుండుట" అను పదము 1-11 వరకు ఉన్న వాక్య భాగములో 11 సార్లు ఉన్నది. అంటే క్రీస్తుతో నిత్య సంబంధము కలిగి యుండుట చాలా ప్రాముఖ్యమైన విషయము. మన జీవము ఆయనే. ఆయనలో నిలిచి యుండకపోతే మనము బ్రతికి యున్నను, మరణించి ఉన్నట్లే.

మనలోని ఫలము వలన ఆయనలో నిలిచియున్నామని మనకు, మన చుట్టు ఉన్నవారికి తెలుస్తుంది. ఫలించని తీగెను తండ్రి అయిన దేవుడు కత్తిరించి వేస్తాడు. ఆయనయందు నిలిచియున్న విశ్వాసి ప్రార్థనలు ఆలకించి నెరవేరుస్తాడు. మన జీవితాల ద్వారా దేవుడు మహిమపరచబడుతాడు, తోటి విశ్వాసుల పట్ల మన ప్రేమ ఎక్కువవుతుంది, మన పితరుల సంతోషము పరిపూర్ణమవుతుంది.

ఈ ఆశీర్వాదములన్నీ మనము ఆయనయందు నిలిచి యుంటేనే అనుగ్రహించబడుతాయి కాబట్టి "నిజమైన వెలుగైన" యేసయ్య వెలుగులోనే నడుస్తూ, దేవుని మహిమార్థము జీవించాలి.

వెలుగును గురించిన 7 ప్రత్యక్షతలు ధ్యానించిన తర్వాత యేసయ్య గొప్పతనము గురించిన జ్ఞానము ఎక్కువ అయి ఉంటుందని నమ్ముచున్నాను. ఈ ప్రత్యక్షతలన్నియు సత్యములే కాబట్టి ఆ సత్యములు మనలను స్వతంత్రులనుగా చేస్తాయి. ఈ సత్యము తెలుసుకొని, దానిని గట్టిగా పట్టుకొని, మనసులలో స్థిరపరచు కోవాలనియు దేవుడు కోరుకుంటున్నాడు కాబట్టి ఈ ప్రత్యక్షతలన్నీ తనంతట తానే చెప్పి, వాటిని గురించి ధ్యానించుకొనుటకు మనకు అవకాశము కలిగించాడు.

# 5. దైవత్వము తెలుపుటకు ఏడు సూచనలు

**యో**హాను సువార్తికుడు తన సువార్త వ్రాయుటలో ముఖ్య ఉద్దేశ్యము యేసుప్రభువు దైవ కుమారుడని రుజువు చేయుట. ప్రభువు తనంతట తానే చెప్పిన 7 ప్రత్యక్షతలు ధ్యానించుకున్నాము. ఈ భాగంలో "నిజమైన వెలుగు" యొక్క దైవత్వము చూపుటకు యేసుప్రభువు చేసిన అద్భుతాలలో ఏడింటిని ధ్యానించు కుందాము. మిగిలిన సువార్తీకులు గ్రంథస్తము చేసిన మొత్తం అద్భుతాలు 35 ఉన్నాయి కాని యోహాను తనకు అవసరమైనవి మాత్రమే ఎంచుకున్నాడు. వీటిని అద్భుతాలుగా చెప్పలేదు గాని "సూచనలు" అని చెప్పాడు. 'సూచన' అంటే ఏదో విషయము సూచిస్తుందని అర్థము. కాబట్టి ప్రతి సందర్భములో ఒక అద్భుతమైన సత్యము చెప్పి దానిని స్థిరపరచుటకు సూచనలు వాడుకున్నాడు. సిలువకు పోకముందు వారము వరకు మాత్రమే 7 సూచనలు గ్రంథస్థము చేశాడు. ఒక్కొక్క సూచక క్రియ తర్వాత శిష్యులు ఆయనను గురించి మరి కొంచెము ఎక్కువగా తెలుసుకొనుట ద్వారా వారి విశ్వాస పునాది బలపడసాగింది. పాఠకులకు కూడా అటువంటి అనుభవ జ్ఞానము రావాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను.

ప్రతి అద్భుతము వెనుక ఒక ఆత్మీయ ప్రాధాన్యతను సువార్తీకుడు చూపిస్తున్నాడు. అందును బట్టి ప్రతి సూచక క్రియ "క్రియా రూపక బోధ" అనుకోవచ్చును. "నిజమైన వెలుగు" అయిన యేసయ్య దైవత్వమును రుజువు చేయుటకు యోహాను చూపించిన 7 సూచనలు ఒక దాని వెంబడి ఒకటి ధ్యానించుకుందాము :

**1. నీటిని ద్రాక్షారసముగా మార్చిన అద్భుతము** (యోహాను 2:1-12 ) :

కానా అను ఊరిలో ఒక వివాహమునకు యేసయ్య తన శిష్యులతోను, తల్లితోను వెళ్లాడు. విందులో సంతోష సూచనగా ఇచ్చు ద్రాక్షారసము అయిపోయి నపుడు తల్లియైన మరియ యేసయ్యకు ఆ విషయము చెప్పినపుడు, ఆయన ఈ అద్భుతము చేశాడు. అక్కడ శుద్ధీకరణ కొరకు నీటిని ఉంచు ఆరు పెద్ద రాతి బానలలో నీరు నింపుమని అక్కడ పరిచారకులకు చెప్పి, అవి నిండిన తర్వాత ఆ నీటిని ముంచి విందు ప్రధాని యొద్దకు తీసుకెళ్లమని చెప్పాడు. ఆ నీటిని రుచి చూసిన విందు ప్రధాని అది చాలా శ్రేష్టంగా ఉన్నట్లు చెప్పాడు. యేసుప్రభువు ఆ పెళ్లికి అతిథిగా వెళ్లి, అతిథీయుడు (Host) అయ్యాడు. నీటికి రంగు, రుచి, వాసన ఉండవు కాని, ఆ పరిస్థితిని మార్చాడు. కాళ్లు కడుగుకొనుటకు వాడబడు నీటిని రంగు, రుచి, వాసనతో శ్రేష్ఠమైన ద్రాక్షారసముగా మార్చాడు. ముంచి, తీసికొని పోయిన వారికి మాత్రమే ఆ సంగతి తెలుసు. వారి విధేయత, విశ్వాసము అక్కడ అవసరమైనాయి. ఇశ్రాయేలు దేశములో ఈనాటికీ వివాహ సమయంలో ద్రాక్షారసము ఇస్తున్నారు. పరమతండ్రి, కుమారులిరువురూ వివాహముతోనే తమ పరిచర్య ప్రారంభించారు (ఆది2, యోహాను2) పరిశుద్ధాత్మ దేవుడు గొర్రెపిల్ల వివాహముతో తన పరిచర్య ముగిస్తున్నాడు. (ప్రకటన 22). త్రిత్వకార్యములో పరిపూర్ణత ఉంటుంది. అందుకే కానా వివాహములోని ద్రాక్షారసము శ్రేష్టమైనదిగా ఉన్నది. ఆయన సన్నిధిలో శ్రేష్టత ఉంటుంది.

చివరి వచనములో "యేసు ఈ మొదటి సూచక క్రియను చేసి తన మహిమను బయలుపరచెను; అందువలన ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాసముంచిరి" అని వ్రాయబడి ఉంది. ఈ సూచక క్రియలో కేవలము పెళ్లి వారి అవసరత తీర్చబడుటే గాక ఆయన మహిమ పరచబడినాడు, తద్వారా శిష్యుల విశ్వాసము స్థిరపరచబడింది. యేసయ్య జీవమునకు మూలమని ఈ సూచన సూచిస్తుంది. జీవములేని నీటిని మధురంగా మార్చాడు. ఈ సూచక క్రియ ద్వారా ఆయన చేయబోయే రూపాంతర పరిచర్య పరిచయం చేయబడింది. ఖాళీ అయిపోయిన దానిని నింపాడు; నిరాశ, నిస్పృహ, అవమానము ఉన్న చోట ఆనందము నింపాడు.

ఇక్కడ పనివారి సహకారము, విధేయత కూడా గమనించాలి. ఈ లోకంలో దేవుని మహిమార్థము ఒక కార్యము జరగాలంటే, దేవునికి మనిషి సహకారం కావాలి.

ద్రాక్షారసము తయారు చేయుటకు దాదాపు ఒక సంవత్సరము పడుతుంది కాని యేసయ్య క్షణాల్లో చేశాడు. దీనివలన ఆయన కాలము, సమయములపై అధికారము కలవాడని తెలుస్తున్నది. ఈ సూచక క్రియల ద్వారా యేసుప్రభువు రూపాంతరము చేయగలవాడని, జీవమిచ్చే వాడని రుజువవుతుంది. పౌలు 2కొరింథీ. 5:17లో "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" అని చెప్పిన సత్యము ఇక్కడ రుజువైంది.

మన కుటుంబాలలో వివాహ సందర్భాలలో, మొదటిగా యేసయ్యను ఆహ్వానిస్తే, ఆయన చిత్త ప్రకారము ఆ వివాహము జరుగుతుంటే, ఆయనే మొదటిగా హాజరై, ఆదినుండి అంతము వరకు ఉండి నడిపిస్తాడు. యేసయ్య సన్నిధి ఉంటే ఇంకే కొరత ఉండదు. అతిథిగా వచ్చి, అతిథులను ఆదరించేవాడిగా మారిపోతాడు. పనికిరాని ఖాళీ రాతి బానలలో నీటిని నింపి, దానిని పనికి వచ్చే విధంగా మారుస్తాడు. ప్రతిదినము, ప్రతిక్షణము మనలో, మన ఇంటిలో దేవుని సన్నిధి ఉండేలా ప్రయత్నించాలి. రక్షింపబడిన ప్రతి ఒక్కరిలో పరిశుద్ధాత్మ దేవుడు ఉంటాడు కాని ఆయన మాట వింటేనే అద్భుతాలు జరుగుతాయి.

**2. ప్రధాని కుమారుని స్వస్థపరిచే సూచక క్రియ** (యోహాను 4:46-54) :

మొదటి సూచక క్రియ చేసిన కానా అను ఊరికి ఆయన తిరిగి వచ్చినపుడు, అక్కడికి 20 మైళ్ల దూరములో ఉన్న కపెర్నహూములో ఒక ప్రధాని కుమారుడు రోగియై యున్నాడు. యేసయ్య కానాలో చేసిన అద్భుతము గురించి వినిన ఆ అధికారి తన కుమారుని స్వస్థపరిచే శక్తి ఆయనకుందని గుర్తించి, "తన కుమారుడు చావ సిద్ధమై యుండెను గనుక ఆయన వచ్చి తన కుమారునిని స్వస్థపరచవలెనని వేడుకొనెను". అప్పుడు "స్వస్థపరచు యెహోవాను నేనే" అని ఇశ్రాయేలీయులకు వాగ్దానమిచ్చిన దేవుడు పాత నిబంధనలో నీడగా ఉండి, క్రొత్త నిబంధనలో ప్రత్యక్షమైన

యేసయ్య వెంటనే ఆ తండ్రితో “నీవు వెళ్లుము, నీ కుమారుడు బ్రదికి యున్నాడని” చెప్పగానే ఆ తండ్రి ఆయన మాటలు నమ్మి వెళ్లిపోయెను, ఆయన తమ ఇంటికి వచ్చి స్వస్థపరచాలని వేడుకొన్నను, ఆయన ‘వెళ్లు’ అనగానే విధేయతతో, విశ్వాసముతో వెళ్ళి అద్భుతము చూశాడు. అతడు వెళ్తుండగానే, దారి మధ్యలోనే అతని సేవకులు సంతోషముతో ఎదురొచ్చి, అతని కుమారుడు బ్రదికియున్నాడు, స్వస్థత పొందాడు అని చెప్పారు. యేసు ప్రభువు “నీ కుమారుడు బ్రదికి యున్నాడని” చెప్పిన సమయములోనే ఆ కుమారుడు స్వస్థపడ్డాడని ఆ తండ్రి తెలుసుకొని సాక్ష్యమిచ్చాడు. తద్వారా అతని యింటి వారందరు నమ్మారు. ఈ సూచక క్రియలో యేసయ్యకు దూరముపై అధికారముందని తెలుస్తున్నది. ఆయనకు తన మాట పంపి స్వస్థపరిచే శక్తి ఉన్నది, ఆయనే స్వయంగా వెళ్లాల్సిన అవసరము లేదు. ఏ సమయంలో ఆయన చెప్తే ఆ సమయములోనే జరుగుతుంది.

యేసయ్య చేసిన ఈ సూచక క్రియలో ఆయన, ఆ ప్రధానికి, అతని కుటుంబస్థులకు శారీరిక స్వస్థతతో పాటు ఆత్మీయ స్వస్థత కూడా ఇచ్చినందున “అతడును, అతని యింటివారందరును నమ్మిరి” అని వ్రాయబడి ఉంది. యోహాను సువార్త 4వ అధ్యాయములోని సమరయస్త్రీ, మరియు ఈ అధికారి, ఇద్దరూ యేసుప్రభువు హృదయాన్ని సంతోషపరచారు. ఇరువురూ ఆయన మాటలు నమ్మి, వెంటనే స్పందించారు. వాళ్ళిద్దరూ యూదులు కారు, గాని ప్రభువు మాటలు నమ్మారు. మనమందరము కూడా అన్యులమే కాని ప్రభువును విశ్వసించి, ఆయన వెలుగులోనికి వచ్చుటకు ఆయనిచ్చిన ఆధిక్యతను బట్టి ధన్యులము. మనలో చాలామంది ఆ ప్రధానివలె కష్టాలలో ఆయన శరణు కోరుతాము. “నా యొద్దకు వచ్చు వానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను” (యోహాను 6:37) అని చెప్పిన యేసయ్య ఎలాటి పరిస్థితులలో నైనా మనలను హత్తుకొని సహాయము చేస్తాడు.

**3. "నిజమైన వెలుగు" చేసిన మూడవ సూచక క్రియ** (యోహాను 5:1-17):

యెరూషలేములో గొర్రెల ద్వారము దగ్గరున్న బేతెస్థ కోనేటి యొద్ద జరిగిన అద్భుతమిది. ఈ కోనేటికి అయిదు మంటపములుండేవి. అవి అన్నీ రోగులతో, కుంటి, గ్రుడ్డివారు, ఊచచేతులు, కాళ్ళు గలవారితో నిండి ఉంటుంది. కొన్ని సమయములలో ఒక దేవదూత వచ్చి ఆ కోనేటి నీరు కదిపినపుడు, ఆ కదిపిన నీటిలో మొదట మునిగిన వానికి స్వస్థత వస్తుందని అక్కడి వారి నమ్మకము. అక్కడ అంతమందిలో యేసయ్య ముప్పది యెనిమిది ఏండ్ల నుండి రోగిగా ఉన్నవాడిని సమీపించి "స్వస్థపడగోరుచున్నావా" అని అడిగినపుడు అతను తన అశక్తతను వ్యక్తము చేశాడు. యేసయ్య కనికరపడి అతనితో నీ పరుపెత్తుకొని నడువుమని చెప్పగానే అతడు స్వస్థతనొంది పరుపెత్తుకొని నడిచాడు. ముప్పది యెనిమిది సంవత్సరాలు ఇశ్రాయేలీయులు అరణ్యమార్గములో నడిచిన కాలము (ద్వితీ. 2:14)ను సూచిస్తుందని కొందరు వ్యాఖ్యానకర్తలు అంటారు. ఆత్మీయంగా ఆలోచిస్తే, స్వస్థత కొరకు అక్కడ వేచి యున్న రోగులు, శక్తిహీనులు ఏదో జరుగుతుందని, మెస్సయ్య వస్తాడని వేచియున్న యూదులను పోలి ఉన్నారు. యేసుప్రభువు కాలంలో పాలస్తీనా దేశములోని ప్రజలు పేదరికము, రోగాలు, అశక్తతతో వాగ్దానము చేయబడిన రక్షకుని కొరకు వేచి ఉన్నారు, అయితే ఆయన వారిని దర్శించిన కాలములో ఆయనను గుర్తించలేదు. "స్వస్థపడగోరుచున్నావా" అని యేసయ్య అడిగినపుడు ఉత్సాహంగా సమాధానము చెప్పుటకు బదులు, తన అశక్తతను ఏకరువు పెడుతున్నాడు. ఆనాటి ప్రజల మనఃస్థితి కూడా అదే విధంగా ఉందనుకోవచ్చు.

ముప్పది యెనిమిది ఏండ్ల నుండి రోగిగా ఉన్నవాడు క్షణాలలో బాగుపడి నందుకు సంతోషించుటకు బదులు విశ్రాంతి దినమున ఆయన బాగుచేసినందుకు తప్పుపడుతూ ఆయన కొరకు వెదికారు గాని ఆయన సమయమింకా రానందున తప్పించుకొని పోయెను. ఆయనెవరో ఆ రోగికి తెలియనందున వారడిగినపుడు తనకు తెలియదని చెప్పాడు. ఆ తర్వాత దేవాలయములో ఆ రోగిని చూసి ఇకపై

పాపము చేయకుమని చెప్పాడు. తనను స్వస్థపరచింది యేసయ్య అని తెలుసుకున్న ఆ రోగి ఆ సంగతి యూదా పెద్దలకు చెప్పినపుడు, వారు ప్రభువును మాటలతో హింసించుట ప్రారంభించారు. విశ్రాంతి దినమున యూదులు చేయకూడదని నియమించిన పనులు అనేకములు, అందులో ఒకటి బరువులు మోయుట. ఆ రోగి పరుపెత్తుకొని నడచుట పెద్ద తప్పుగా భావించి, తప్పుచేసిన వానికంటే చేయమని చెప్పిన వాడే ఆ తప్పుకు బాధ్యుడుగా భావిస్తున్నారు. యేసయ్యను తప్పు పట్టినప్పుడు విశ్రాంతి దినమున తన తండ్రి పనిచేస్తున్నాడు కాబట్టి తాను కూడా చేస్తున్నానని చెప్పాడు. విశ్రాంతి దినాచారము మీరుటయే గాక దేవుడు తన తండ్రి అని చెప్పుట వలన తాను దేవునితో సమానమని చెప్పుట క్షమించరాని తప్పని తలంచి ఆయనను చంపుటకు ప్రయత్నించారు. సృష్టి మొదట్లో సృష్టి కార్యము ఆరు దినములలో పూర్తిగావించిన దేవుడు "ఏడవ దినమున విశ్రమించెను" (ఆదికాండము 2:2) అని వ్రాయబడి ఉన్నది. ఏడవ దినమును పరిశుద్ధపరచి, ఆ దినమును విశ్రాంతి దినము లేక సబ్బాతు దినముగా ప్రకటించాడు. మానవుడు పాపము చేసి దేవునికి దూరమై పోయాక, మానవుడు విశ్రాంతి దినమును ఆచరిస్తున్నాడు గాని తప్పిపోయిన మానవులను వెదకి రక్షించుటలో నిరంతరము శ్రమిస్తున్న దేవునికి విశ్రాంతి ఉండదు. అందుకే త్రిత్వములో ఒకడైన యేసయ్య కూడా విశ్రమించలేదు. తాను ఎందు నిమిత్తము ఈ లోకానికి వచ్చాడో, ఆ విమోచన కార్యము పూర్తి చేసేంతవరకు ఆయన విశ్రమించలేదు. ధర్మశాస్త్రము క్షుణ్ణంగా తెలిసిన యూదా మత పెద్దలు ప్రవచనాను సారముగా ఈ లోకానికి వచ్చిన యేసయ్యను గుర్తించలేక పోయారు కాబట్టి ఆయన తండ్రితో సమానుడని తెలుసుకోలేక ఆయనను హింసించుటకు ప్రారంభించారు.

ఈ సూచక క్రియ ద్వారా విశ్రాంతి దినమునకు ప్రభువు తానే అని యూదులకు చెప్పాలని ప్రయత్నించాడు గాని వారు గ్రహించలేకపోయారు. యేసు పరిచర్య కాలంలో విశ్రాంతి దినమున అనేక స్వస్థతలు చేశాడు, వారి ఆచారాలను పాటించలేదు, మతపెద్దలు సరైన విధానములో అర్థము చేసుకోలేక ఆయనను వ్యతిరేకించి, ఆయన పై కోపము పెంచుకుంటూ వెళ్లారు.

ఈ సూచక క్రియలోని రోగిని గురించి ఆలోచిస్తే, యేసుప్రభువు ఒక్కసారి అతనిని దర్శించేసరికి అతని జీవిత గమ్యమే మారిపోయింది. ముప్పది యెనిమిది సంవత్సరములుగా ఉన్న రోగము మాయమైంది; నిరాశ, నిస్పృహలతో నిరీక్షణ లేని జీవితము జీవిస్తున్న వాడికి విడుదల వచ్చింది. యేసయ్య అతనిని బలహీనత నుండి శక్తివైపుకు మరల్చాడు. రోమా ప్రభుత్వము, యూదా మతము, రెండూ కలసి అతనిని అశక్తునిగా మారిస్తే, యేసు బలముగల వానిగా చేశాడు. ఈ సూచక క్రియ ద్వారా మనము గమనించినవన్నీ, విశ్వసించిన ప్రతి ఒక్కరి జీవితాలలో జరుగుతాయి. "నిజమైన వెలుగు"గా వచ్చిన యేసయ్యకు మన జీవితాలు వెలిగించగల శక్తి ఉన్నది.

"బేతెస్థ" అను మాటకు "కృపా గృహము" అను అర్థమున్నది. యేసుప్రభువు ముప్పది యెనిమిది ఏళ్లనుండి రోగిగా ఉండి, కదలలేని స్థితిలో ఉన్న ఆ రోగిపై కృప కుమ్మరించాడు. ఎవరో వచ్చి తనకు సహాయపడుతారని ఎదురు చూసిన ఆ కదలలేని రోగి నిరాశ చెందాడు. మనము కూడా అతని లాగానే ఎవరో వచ్చి మనలను మన పాపస్థితి నుండి విడుదల చేస్తారని ఆశించి నిరాశ చెందే బదులు కృపామయుడైన యేసయ్య, మన విమోచనార్థము తన ప్రాణము పెట్టిన రక్షకుడని అడిగితే ఆయన తప్పక మన పాపములను క్షమించి రక్షిస్తాడు. "అడుగుడి, ఇవ్వబడును"అని చెప్పిన యేసయ్య ఆ రోగిని "నీవు స్వస్థపడగోరుచున్నావా?" అని అడిగినపుడు అతడు వెంటనే అవునని స్పందించకుండా, తన అశక్తతను, తన ఒంటరి తనాన్ని గురించి చెప్తున్నాడు. అతని దీన స్థితిని గమనించి ప్రభువు అతనిపై కనికరించి తన పరుపెత్తుకొని నడవమన్నాడు. లేవమని చెప్పడమే గాక, నడవమని చెప్పి నడవడానికి కావలసిన శక్తిని కూడా ఇచ్చాడు. ముప్పది యెనిమిది సంవత్సరాల నుండి పనిచేయని కండరాలు తిరిగి పనిచేయాలంటే కొన్ని నెలలు పడుతుంది. కాని యేసయ్య చెప్పగానే బలహీనముగా పడిఉన్న కండరాలు క్షణాలలో శక్తిని పొందాయి.

యేసయ్య పాప రోగము నుండి మనలను స్వస్థపరచిన తర్వాత తానేర్పరచిన మార్గములో తనతో పాటు నడవాలని ఆశిస్తాడు. తన ప్రేమతో కృప కుమ్మరించి స్వస్థపరచిన రోగితో ఇక నుండి పాపము చేయవద్దని చెప్పాడు. అతను చేసిన పాపము వలన రోగి అయి ఉండవచ్చు. అన్ని రోగాలు పాపఫలితము కాదు గాని, అతనికి ఇకపై మరి యెక్కువ కీడు కలుగకుండునట్లు పాపము చేయవద్దని ప్రభువు చెప్పినందు వలన అతని రోగము పాపఫలితమని తెలుస్తున్నది, కృప ద్వారా రక్షణ పొందిన మనము కూడా పాపము చేయుట పూర్తిగా మానాలి.

## 4. అయిదువేల మందికి ఆహారము పెట్టుట అనే నాలుగవ సూచకక్రియ

(యోహాను 6:1-14) :

ఈ సూచక క్రియలో వేలమందికి ఆహారము పంచిపెట్టుట ద్వారా తాను జీవాహారముననని సూచిస్తున్నాడు. ఇది చాలా ప్రాముఖ్యమైనది కాబట్టి ఇది ఒక్కటే అన్ని సువార్తలలోను గ్రంథస్తము చేయబడింది. ఈ సూచకక్రియ తర్వాత చేసిన బోధ ఈ అధ్యాయము చివరన 22-71 వరకు ఉన్న వాక్య భాగములో ఉంది. ఈ అద్భుతము అందరినీ చాలా ఆశ్చర్యపరచడమే గాకుండా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త ఈయనే అని చెప్పుకున్నారు. పరలోకము నుండి పంపబడిన జీవాహారము తానే అని ఈ సూచక క్రియ సూచిస్తున్నదనియు, జీవాహారమైన తనను తినువాడు ఎల్లప్పుడు జీవించును అని చెప్పిన బోధవారికి అర్థము కాక ఆయనను వెంబడించు అనేకులు వెనుక తీసి, మరి ఎప్పుడూ ఆయనను వెంబడించ లేదు. ఆయనిచ్చే క్షయమైన ఆహారము కొరకు వెంబడించారు కాని అక్షయమైన ఆహారము అవసరము లేదను సంగతి తెలుస్తున్నది.

ఈ సూచక క్రియ గురించి యోహాను సువార్తీకుడు ఏమి చెప్తున్నాడో చూద్దాము. యేసుప్రభువు చేస్తున్న స్వస్థతలు, అద్భుతాలు చూస్తున్న జనులనేకులు ఆయనను వెంబడించారు. వారిని చూచి కనికరపడిన ప్రభువు వారికి భోజన ఏర్పాటు చేయ తలంచాడు. అన్ని వేల మందికి భోజనము పెట్టాలంటే ఎలా అని ఆలోచిస్తున్నప్పుడు కొన్ని ఆలోచనలు ఆయన ముందు శిష్యులు పెట్టారు.

మొదటిగా, శిష్యులాయన యొద్దకు వచ్చి, ఆ జనులను భోజన నిమిత్తము ఏమైన కొనుక్కోవడానికి చుట్టు ప్రక్కల గ్రామాలకు పంపమని సలహా ఇచ్చారు (మార్కు 6:35,36), సమస్యను పరిష్కరించుటకు బదులుగా వదిలించుకొమ్మని చెప్తున్నారు. వారికి ఆహారము పెట్టకుండా పంపితే, దారి మధ్యలో ఆకలితో పడిపోతారనియు, చీకటి పడుతున్నందు వలన ప్రయాణము చేయుట సాధ్యము కాదనియు ఆయనకు తెలుసు కాబట్టి ఆ సలహా పాటించలేదు.

రెండవ పరిష్కారము ఫిలిప్పు దగ్గర నుండి వచ్చింది. యేసయ్య అతనిని పరీక్షించుటకై ఏమి చేద్దామని అతనిని అడిగాడు. అతను ఆ గొప్ప జనాంగమును చూచి రెండు వందల దేనారములు వెచ్చించినా వారందరికీ భోజనము పెట్టలేమని అంచనా వేశాడు. మనము కూడా చాలా సమయాలలో డబ్బుతో అన్ని సమస్యలకు పరిష్కారము దొరుకుతుందనుకుంటాము. ఎటువంటి సమస్యలైనా పరిష్కారము క్రీస్తే అను సత్యము తెలియాలి.

మూడవ పరిష్కారము ఆంద్రెయ నుండి వచ్చింది. అతను సలహా అయితే చెప్పాడు గాని దానితో సమస్య పరిష్కరించబడదని తెలుసు. అయిదు రొట్టెలు, రెండు చేపలు కలిగియున్న ఒక బాలుని ఆంద్రెయ కనుగొని యేసుప్రభువు యొద్దకు తెచ్చాడు. అప్పుడు నాలుగవ పరిష్కారము యేసయ్య యొద్ద నుండి వచ్చింది, అదే నిజమైన పరిష్కారము. ఆ చిన్నవాని భోజనము తన చేతిలోకి తీసుకొని, కృతజ్ఞతా స్తుతులు చెల్లించి, అంతకు మునుపే జనులను పచ్చికపైన కూర్చుండ బెట్టినందున, వారికందరికీ పంచమని శిష్యులకిచ్చాడు. అక్కడ కూర్చున్నవారు ఇంచుమించు అయిదు వేల మంది పురుషులు అని చెప్పబడి ఉంది. వారితో పాటు వారి భార్యలు, పిల్లలతో కలిపి ఇరవై వేలమంది వరకు ఉండి ఉండవచ్చు. ఈ సూచక క్రియ ప్రభువు చేతులలో జరిగింది, శిష్యులు కేవలము పంచారు. వారందరూ తృప్తిగా తినిన తర్వాత మిగిలినవి పన్నెండు గంపలతో ఎత్తారు. దేవుని సమృద్ధిలో ఏవీ వ్యర్థము కాకూడదు, దేవుని దాతృత్వములో వృథా అనేది ఉండదు. లేమిలో నుండి

సమృద్ధిలోనికి నడిపించువాడు ఆయనే అను సత్యాన్ని ఈ సూచక క్రియ సూచిస్తున్నది, క్రియా రూపకంగా బోధిస్తున్నది. ప్రతి అవసరము ఆయనే తీరుస్తాడని కూడా మనము గుర్తించాలి.

ఇక్కడ మనము నేర్చుకోవలసిన ముఖ్యపాఠమేమంటే – మనకే అవసరత ఉన్నను, మనకున్నదంతా యేసయ్య ఎదుట ఉంచి, మిగిలిన పని ఆయనను చేయనివ్వాలి. నీ దగ్గరున్న సమస్తము మొదట ఇచ్చి మొదటి అడుగు నీవు వేస్తే, మిగిలిన కార్యమంతా ఆయనే చేస్తాడు. ఆ చిన్నవాడు యేసయ్యతో తన భోజనము పంచుకొనుటకు ఇష్టపడ్డాడు. అందుకే ఆ చిన్న బాలుని, ఇతరులకు ఇవ్వడానికి అతనిని సిద్ధపరచి పంపిన అతని తల్లిని ప్రశంసించకుండా ఉండలేము. ఆ బాలుని గురించి లోకమంతా తెలిసేటట్లుగా దేవుడు ఏర్పాటు చేశాడు. మనము చేయగలిగి నంత మనము చేస్తే, మిగిలినది ప్రభువే చేస్తాడనే పాఠము ఇక్కడ నేర్చుకుంటున్నాము.

యేసు ప్రభువు ఆ బాలుడిచ్చిన బహుమతిని అందుకొని, దేవునికి కృతజ్ఞతలు చెప్పాడు. మిగిలిన సువార్తీకులు ఆయన ఆకాశము వైపు కన్నులెత్తి కృతజ్ఞతా స్తుతులు చెప్పిన సంగతి వ్రాశారు. ఆ చర్యవలన, అక్కడ ఆకలిగొన్న ప్రజలందరికీ సమస్తమైన మంచి ఈవులు దేవుని దగ్గర నుండే వస్తాయనే సందేశము అంది ఉంటుంది. మనకు కూడా ఇది ఒక మంచి పాఠము. లేని వాటి గురించి సణగకుండా, ఉన్నవాటితో సంతృప్తి చెంది, దేవునికి కృతజ్ఞతలు చెప్పడము అలవాటుగా చేసుకుంటే, దేవుడు మనకివ్వడములో ఆతురత చూపుతాడు. ఆయన చేసిన ఈ అద్భుతములో లేమి నుండి విస్తారము కలిగినట్లుగా కనపడుతున్నది. శూన్యము నుండి సృష్టి యావత్తు చేసిన దేవునికి ఈ కార్యము చాలా సామాన్యమైనది.

"నిజమైన వెలుగు" గా మన మధ్య నివసించుటకు వచ్చిన యేసయ్యకు సమస్తము సాధ్యమని ఈ సూచక క్రియ ద్వారా యోహాను చూపిస్తున్నాడు.

**5. యేసయ్య నీళ్లపై నడచుట అనే సూచక క్రియ** (యోహాను 6:15-21):

యేసయ్య నీళ్ళపై నడిచి తన శిష్యులను కాపాడుట చూస్తున్నాము. సాయంకాలమైనప్పుడు ప్రభువు తన శిష్యులను దోనె ఎక్కించి కపెర్నహూమునకు

పంపి, ఆయన ఒంటరిగా ప్రార్థించుటకు కొండపైకి వెళ్లాడు. గలిలయ సముద్రములో సాయంకాల సమయములో తుఫాను లెక్కువగా ఉంటాయి. సార్వభౌముడైన ప్రభువుకు తుఫాను రాబోతుందని తెలిసి కూడా తన శిష్యుల విశ్వాసము పెంపొందించుట కొరకై ఈ సూచక క్రియ చేశాడు.

చీకటి పడినను యేసయ్య వారి దగ్గరికి పోలేదు. వారు సముద్రములో రెండు, మూడు మైళ్ల దూరము వెళ్లాక తుఫాను దాటికి మునిగిపోతామేమోనన్న భయంతో ఉన్నప్పుడు ప్రభువు వారి యొద్దకు నడిచి వెళ్లాడు. నీటిపై నడుస్తున్న ఆకారాన్ని చూసి శిష్యులు ఆయనను గుర్తించక దయ్యమని భయపడ్డారు. వారిని భయపడవద్దని ధైర్యపరచి, దోనెలో ఎక్కగానే వారి దోనె సురక్షితంగా గమ్యం చేరిందని సువార్తికుడు చెప్తున్నాడు. యోహాను ఈ సూచక క్రియ గురించి చాలా తక్కువ సమాచారం ఇచ్చాడు గాని ఇందులో అద్భుత సత్యాలు ప్రత్యక్షమగుచున్నవి.

"నిజమైన వెలుగు" దేవుడే అని రుజువు చేయుటకు ఇందులో చాలా విషయాలున్నాయి. వాటిని చూద్దాము.

**A.** యేసయ్య నీటిపై నడిచి తుఫానును శాంతపరచుట ద్వారా ఆయనకు సృష్టిపై అధికారముందని తెలుస్తున్నది. ఆయన సర్వసృష్టి కర్త కాబట్టి సృష్టి ఆయన ఆధీనంలో ఉన్నదని తెలుస్తున్నది;

**B.** యేసయ్య శిష్యులను శ్రమలలోనికి పంపాడు గాని, ఆయన అక్కడే ఉండి చూస్తున్నాడు, తండ్రి ఎదుట విజ్ఞాపనలు చేస్తున్నాడు;

**C.** తన బిడ్డలకు సహించలేనంత ఎక్కువగా శోధనలు ఇవ్వడు. శోధనలలో మనకు తోడుగా ఉంటాడు. ఆయన దుడ్డుకర్ర, దండము మనకు తోడుగా ఉంటాయి (కీర్తన 23:4);

**D.** "నేనే" అని చెప్పుటలో మోషేతో యెహోవా దేవుడు చెప్పిన మాటలు (నిర్గమ 3:14), యోహాను 8:58 లో "అబ్రాహాము పుట్టకు మునుపే నేను ఉన్నానని" యేసయ్య చెప్పిన మాటలు జ్ఞాపకము వచ్చి ఆయనే దేవుడని రుజువు చేస్తున్నాయి.

**E.** ఆయనను వారి “దోనెమీద ఎక్కించుకొనుటకు వారిష్టపడిరి, వెంటనే ఆ దోనే వారు వెళ్ళుచున్న ప్రదేశమునకు చేరెను” అనే వాక్య భాగములో ఆయన నిజమైన దేవుడు అను సంగతి ఇంకొకసారి రుజువు చేయబడుచున్నది. మనమెన్ని శ్రమలలో ఉన్నను ఆయనను మన హృదయములోనికి ఆహ్వానిస్తే, ఏ శ్రమా లేకుండా క్షణాల్లో గమ్యం చేరుకుంటాము;

**F.** తన శిష్యులను తానే స్వయంగా శ్రమలలోనికి పంపించాడేమిటా అని ఆలోచిస్తున్న వారికి ఒక సత్యము బోధించబడుచున్నది. యోహాను 6:15లో అయిదు వేలమందికి భోజనము పెట్టిన సందర్భములో తాము ఎదురుచూస్తున్న మెస్సయ్య, మోషే ప్రవచించిన “తన వంటి ప్రవక్త” (ద్వితీ 18:16) ఆయనే అని గుర్తించి ఆయనను రాజుగా చేయుటకు బలవంతముగా పట్టుకోబోతుంటే, ఆయన గుర్తించి తప్పించుకున్నాడు. గలిలయ సముద్రములో రాబోవు తుఫాను కంటే యూదులు పెట్టే ప్రలోభాలకు లొంగిపోవుట తన శిష్యులకు చాలా ప్రమాదకరమని తలంచిన ప్రభువు వారిని బలవంతముగా దోనె ఎక్కించినట్లు మార్కు సువార్తీకుడు గ్రంథస్తము చేశాడు (మార్కు 6:45). తనను “ప్రేమించు వారికి, ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరిగించును” (రోమా 8:28). అను సత్యము విశ్వసించాలి;

**G.** “భయపడకుడి” అని చెపుతున్న యేసయ్య తండ్రియైన దేవుని జ్ఞాపకము చేస్తున్నాడు. ఆదరణ, ధైర్యము ఇచ్చు “నిజమైన వెలుగు” మన పక్షాన ఉంటే మనకు భయము ఎందుకు? అనే సత్యాలు ఈ సూచన ద్వారా బోధింపబడ్డాయి.

**6. పుట్టుగ్రుడ్డివానిని బాగుచేయుట ఆరవ సూచకక్రియ** (యోహాను 9:1–41):

ఈ సూచక క్రియ “నిజమైన వెలుగు” యొక్క దైవత్వము తెలుస్తున్నది. ఈ ఉదంతము గురించి ఈ పుస్తకములోని మూడవ అధ్యాయములో విపులంగా

వివరించబడి ఉన్నది కాబట్టి వివరణలోనికి వెళ్లకుండా క్లుప్తంగా మనకు అవసరమైన విషయాలు చూద్దాము.

8వ అధ్యాయములో “నేను లోకమునకు వెలుగును” అని తన గురించి తాను ప్రత్యక్షపరచుకున్న తర్వాత జరిగిన అద్భుతము కాబట్టి ఈ సూచక క్రియ ద్వారా తాను లోకమునకు వెలుగుగా, లోకమును వెలిగించుటకు వచ్చాడు కాబట్టి శారీరక గుడ్డితనము, ఆత్మీయ గుడ్డితనము, రెండింటి నుండి ప్రజలను విడిపించి రక్షించుటకు శక్తిగలవాడనని రుజువు చేసుకుంటున్నాడు. యెషయా ప్రవక్త ప్రవచించిన ప్రకారము “గ్రుడ్డివాని కన్నులు తెరచుటకు” (యెషయా 42:6) ఆయనను తండ్రియైన దేవుడు అభిషేకించి పంపాడను సంగతి తెలిసినా, యూదా మత పెద్దలు గుర్తించలేకపోయారు. లేఖనములు బాగా తెలిసియుండి కూడా అపవాది ఆత్మీయ గుడ్డితనము కలుగజేసినందున వారాయనను తెలుసుకోలేక పోయారు. “దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్షపరచబడుటకే వీడు గ్రుడ్డివాడుగా పుట్టెను” (యోహాను 9:3) అని యేసుప్రభువు చెప్పిన మాటలోనే మనకు ఈ సూచక క్రియ ఏమి సూచిస్తుందో అర్ధమగుచున్నది.

“నిజమైన వెలుగు” యొక్క దైవత్వము తెలుపుటకును, ఆయనే దైవకుమారుడు, దేవునితో సమానుడు, త్రిత్వములో ఒకడు అని రుజువు చేయుటకు యోహాను సువార్తికుడు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాడు. లోకమంతా ఆయనను అంగీకరించాలని అతని ఉద్దేశము. “పగలున్నంత వరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను” అనుటలో తాను (నిజమైన వెలుగు) భూమి మీద ఉండే కాలము అంతమగుచున్నది గనుక వెలుగు వెళ్లిపోకముందే లోకాన్ని వెలిగించాలి, తండ్రి చిత్తము నెరవేర్చాలి అంటున్నాడు. “మనము” అనుటలో తన శిష్యులే గాక తనను వెంబడించే వారందరు (మనము కూడా) అని అర్ధము. పుట్టు గ్రుడ్డివానిగా పుట్టి, కళ్లు తెరవబడిన వాడు దశలు దశలుగా ఆయనను కనుగొన్నాడు కాని ఆత్మీయ గుడ్డితనములో ఉన్న మత పెద్దలు ఆయనను గుర్తించకపోగా,

ఆయనను చంప ప్రయత్నిస్తున్నారు, తనను బాగుచేసిన వాడెవరో చెప్పమని గుడ్డివానిపై ఒత్తిడి తెస్తున్నారు. వారు అడిగే కొద్దీ, వాడిలో ధైర్యము పెరుగుతూ ఉన్నది, వారిని ఎదిరిస్తున్నాడు, తద్వారా మందిరము నుండి వెలివేయ బడుతున్నాడు.

తనను బాగుచేసినవాడు కేవలము యేసు అను "ఒక మనుష్యుడు" అని తలంచిన గ్రుడ్డివాడు క్రమేపీ ఆయన "ఒక ప్రవక్త" అనియు, ఆ తర్వాత "దేవుని యొద్ద నుండి వచ్చిన వాడనియు" చెప్పాడు. లోకానికి "వెలుగు"గా వచ్చిన "నిజమైన వెలుగును" గుర్తించిన ప్రతివాని జీవితంలో ఇలాంటి మార్పులు, ప్రత్యక్షతలు వస్తాయి. ఆత్మీయంగా ఎదిగే కొద్దీ సత్యాలు బహిర్గతమవుతూ ఉంటే, మన చుట్టూ ఉన్నవారు హింసించుట మొదలుపెడతారు. అయినా మనలో ధైర్యము పెరుగుతుంది. ఎందుకంటే "యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట బహు ధైర్యము పుట్టించును" (సామెతలు 14:26).

లోకానికి వెలుగుగా వచ్చిన యేసుప్రభువు మన ఆత్మీయ అంధత్వము నుండి మనలను విడుదల చేయగల సామర్థ్యము గలవాడు. పుట్టుగ్రుడ్డివాడు వెలివేయబడక ముందు యూదా మత పెద్దలతో అనిన మాటలు యేసయ్య దైవత్వమునకు రుజువుగా ఉన్నాయి. "పుట్టు గ్రుడ్డివాని కన్నులెవరైనా తెరచినట్లు లోకము పుట్టినప్పటి నుండి వినబడలేదు. ఈయన దేవుని యొద్ద నుండి వచ్చినవాడు కాని యెడల ఏమియు చేయనేరడని వారితో చెప్పెను" (యోహాను 9:32,33). వెలివేయబడిన వానిని వెదకుచూ వచ్చిన యేసయ్య తనను తాను దేవుని కుమారునిగా ప్రత్యక్షపరచుకున్నాడు.

### 7. మరణము నుండి జీవములోనికి తీసుకురాగల శక్తి ఈ ఏడవ సూచక క్రియ (యోహాను 11:17-45) :

మరణము నుండి జీవములోనికి తీసికొని రాగల శక్తి కేవలము "నిజమైన వెలుగు" గా ఈ లోకానికి వచ్చిన దేవుని కుమారునికి మాత్రమే ఇవ్వబడి యున్నదని యోహాను సువార్తీకుడు ఈ సందర్భముగా రుజువు చేస్తున్నాడు. ఈ సూచకక్రియ

జరుగక ముందు జరిగిన విషయాలు కొన్నింటిని మనము జ్ఞాపకము చేసుకుందాము. బేతనియ అను గ్రామములో మార్త, మరియ అను సహోదరీలకు లాజరు అను ఒక సహోదరుడు ఉండేవాడు. వారి కుటుంబము ప్రభువును ఆదరించి, ఆతిధ్యము ఇస్తుండేది. లాజరు రోగియైనపుడు యేసయ్యను రమ్మని సందేశము పంపారు గాని "యేసయ్య అది విని – ఈ వ్యాధి మరణము కొరకు వచ్చినది కాదు గాని దేవుని కుమారుడు దానివలన మహిమ పరచబడునట్లు దేవుని మహిమ కొరకు వచ్చినదనెను" (యోహాను 11:4). రెండు రోజులైన తరువాత లాజరును నిద్రలేపుటకు వెళ్లుదమని తన శిష్యులతో చెప్పాడు. బైబిలులో చాలా పర్యాయములు మరణించిన వారిని గురించి నిద్రించారు అని చెప్పబడి ఉన్నది. శిష్యులు విశ్రాంతి తీసుకునే నిద్ర అని తలంచారు కాని యేసయ్య లాజరు మరణించాడని చెప్పాడు. "మీరు నమ్మునట్లు నేనక్కడ ఉండలేదని మీ నిమిత్తము సంతోషించుచున్నాను" (11:15) అంటున్నాడు. "దేవుని కుమారుడు మహిమపరచబడునట్లు", శిష్యులు "నమ్మునట్లు" అను మాటలు చూస్తున్నపుడు యోహాను ఈ సూచక క్రియ గ్రంథస్తము చేయుటకు ఎందుకు ఎంచుకున్నాడో మనకు బోధపడుచున్నది. యేసుప్రభువు దేవుని కుమారుడని ప్రపంచమంతా నమ్మాలి అనే ఉద్దేశము ఇక్కడ నెరవేరుచున్నది.

లాజరు చనిపోయిన తరువాత నాలుగు రోజులు ఎందుకు ఆలస్యంగా వెళ్లాడో మనము తెలుసుకోవాలి. ఆనాటి నమ్మకాలను బట్టి ఒక మనుష్యుడు చనిపోయాక అతని ఆత్మ మూడు రోజుల వరకు ఆ శరీరము చుట్టూ తిరుగుతూ, అవకాశము దొరికితే తిరిగి ఆ శరీరములోకి ప్రవేశిస్తుంది కాబట్టి వారు మూడు రోజులు ఎదురు చూసేవారు, నాలుగవ దినము నుండి ఆ మనిషి పూర్తిగా చనిపోయినట్లే. యేసయ్య నాలుగు రోజులకు ముందే వచ్చి లాజరును లేపినను, దేవుడు మహిమ పరచబడడు కాబట్టి ఆయన తరువాత వచ్చాడు. ఆయనను చూసిన అతని అక్క చెల్లెండ్రు యేసుతో "ప్రభువా, నీవిక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండును" (11:21) అనగానే యేసయ్య "నీవు నమ్మిన యెడల దేవుని మహిమ చూస్తావు" అన్నాడు. తానే పునరుత్థానమును, జీవమునై యున్నానని మార్తకు ప్రత్యక్షపరచుకున్నాడు. మరణముపై తనకు అధికారముందనియు, జీవమిచ్చేది తానే అనియు చెప్పాడు.

యేసుప్రభువు వారి బాధను చూచి "ఏడ్చెను" అని వ్రాయబడి ఉంది. ఆయన దైవకుమారుడైనను మానవరూపంలో ఈ లోకానికి వచ్చాడు కాబట్టి సంపూర్ణ మానవునిగా కూడా ఉన్నాడని రుజువు చేయబడుచున్నది. ప్రభువు లాజరు సమాధి యొద్దకు వచ్చి అక్కడ ఉన్న రాయి తొలగించమని చెప్పినప్పుడు మార్త ఆయనతో "ప్రభువా, అతడు చనిపోయి నాలుగు దినములైనది గనుక ఇప్పటికి వాసన కొట్టునని ఆయనతో చెప్పెను (11:39). ఆ రాయిని ఆయనే ఒక్క మాటతో తొలగించగలడు కాని ప్రతికార్యములో మానవుని సహకారము కూడా ఉండాలని దేవుడు కోరుకుంటాడు. వారి విశ్వాసమునకు, విధేయతకు ఇది ఒక పరీక్ష. 'విశ్వసించుము', 'చూడుము' అను మాటలు గమనించగలము. విశ్వసిస్తే దేవుడు చేయు మహిమగల కార్యములను చూడగలము. తన ద్వారా దేవుని మహిమ చూస్తారని చెప్పాడు.

వారు రాయి తీసాక యేసయ్య కన్నులు పైకెత్తి – "తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును గాని నీవు నన్ను పంపితివని చుట్టు నిలిచియున్న యీ జన సమూహము నమ్మునట్లు వారి నిమిత్తమై యీ మాట చెప్పితిననెను" (యోహాను 11:41,42). వారందరి ముందు ఈ ప్రార్థన చేయుటలో తాను, తన తండ్రి ఏకమై ఉన్నారనియు, వారిరువురి మధ్య అవినాభావ సంబంధముందనియు చూసేవారు, వినేవారు తెలుసుకోవాలనే ఉద్దేశముంది. తర్వాత ఆయన బిగ్గరగా లాజరును బయటికి రమ్మని పిలవగానే, అతను ప్రేత వస్త్రములతో కట్టబడి ఉండగానే అతను ఉంచబడిన గుహనుండి వెలుపలికి వచ్చాడు. ఆయన "లాజరూ" అని పేరుపెట్టి పిలువకపోయి ఉంటే ఆ ప్రాంతంలో ఉన్న చనిపోయిన వారందరూ వచ్చిఉండేవారు అని ఒక దైవజనుడు అంటున్నాడు. "కట్లు విప్పి పోనియ్యుడని" ప్రభువు చెప్పాడు. ప్రభువు మనలను పిలిస్తే ఏ కట్లూ మనలను ఆపలేవు. ఈ సూచకక్రియ ఆయనలో దైవత్వము ఉందని ఖచ్చితంగా సూచిస్తున్నది. చూసినవారు అనేకులు ఆయనపై విశ్వాసముంచారు, కాని కొందరు పరిసయ్యుల యొద్దకు వెళ్లి యేసు చేసిన కార్యములను గురించి వారితో చెప్పారు.

యోహాను సువార్తికుడు ఏడు సూచనల ద్వారా యేసయ్య దేవుని కుమారుడు, ఆయన దేవుడే అని ఏ విధంగా రుజువు చేశాడో చూశాము, ఇంకొక ఆసక్తికరమైన తలంపు మీ ముందు ఉంచుటకు నేను ప్రేరేపించబడుతున్నాను. దేవుని ఏడు విమోచన నామములు ఈ ఏడు సూచనలలో యేసయ్యకు అన్వయించవచ్చునను సత్యము మనము ధ్యానిస్తే "నిజమైన వెలుగే" దేవుడను సత్యమును నిస్సందేహముగా నమ్మవచ్చును. ఒక్కొక్కటిగా పరిశీలిద్దాము :

**1.** యోహాను 2:1-12లో కానాలో నీటిని ద్రాక్షారసముగా మార్చిన మొదటి సూచనలో ఆయన సన్నిధి మనతో ఉంటే జరుగు అద్భుతము చూశాము. యెహెజ్కేలు 48:35లో "యెహోవా యుండు స్థలమని నాటనుండి ఆ పట్టణమునకు పేరు" అని వ్రాయబడింది. హెబ్రీ భాషలో యెహోవా దేవుని కివ్వబడిన పేరు "యెహోవా షమ్మా" (సన్నిధి). అదే పేరు ఇక్కడ యేసయ్యకు అన్వయించుకోవచ్చును.

**2.** యోహాను 4:46-54 లో ప్రధాని కుమారుని స్వస్థపరచుట చూశాము. నిర్గమ 15:26లో "నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" అని దేవుడన్నాడు. "యెహోవా రాఫా" (యెహోవా స్వస్థత నిచ్చువాడు) అను నామము ఇరువురికీ అన్వయించ వచ్చును.

**3.** యోహాను 5:1-17లో బేతెస్థ కోనేటి యొద్ద ముప్పది యెనిమిది సంవత్సరముల నుండి రోగిగా ఉన్న వానిని స్వస్థపరచి "ఇకను పాపము చేయకుమని" యేసయ్య చెప్పాడు, నీతిని ప్రబోధించాడు. యిర్మీయా 23:6లో "యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు" అని యేసయ్యను గురించి ప్రవచింపబడిన మాట. "యెహోవా సిదికేను"అను నామము ఇరువురికీ వర్తిస్తుంది.

**4.** యోహాను 6:1-4లో అయిదువేల మందికి ఆహారము పంచి పెట్టుట ద్వారా "యెహోవా యీరే" (యెహోవా సమకూర్చువాడు) అను పేరు సంపాదించు కున్నాడు. ఆదికాండము 22:13,14లో ఇస్సాకును బలి అర్పించుటకు

తీసికెళ్లిన అబ్రాహాము విశ్వాసమునకు ముగ్ధుడై దేవుడు బలికొరకు పొట్టేలును సమకూర్చాడు. అందుకే అబ్రాహాము ఆ చోటికి "యెహోవా యీరే" అనుపేరు పెట్టాడని వ్రాయబడింది.

**5.** యోహాను 6:15-21లో సముద్రాన్ని నిమ్మళింపచేసిన యేసయ్యను "యెహోవా షాలోమ్" అని పిలువ వచ్చును. న్యాయా 6:24లో గిద్యోను "యెహోవా నామమున బలిపీఠము కట్టి, దానికి 'యెహోవా సమాధానకర్త' యను పేరు పెట్టెను". "యెహోవా షాలోమ్" అంటే సమాధానకర్తయని అర్థము.

**6.** యోహాను 9:1-41లో పుట్టు గ్రుడ్డివానిని బాగుచేయుటకు ప్రభువు అతనిని సిలోయమను కోనేటి యొద్దకు నడిపించాడు. అక్కడ తన కళ్లకు పూయబడిన బురదను కడుగుకొని చూపు పొందాడు. ఆయనను యెహోవా రోహి (కాపరి) అని పిలువవచ్చు. ఎందుకంటే ఆయన ఒక కాపరిగా ఆ గుడ్డివానిని పచ్చికగల చోట్లకు, శాంతికరమైన జలముల యొద్దకు నడిపించాడు. దావీదు 23వ కీర్తనలో యెహోవా దేవుని "యెహోవా నా కాపరి" అని సంబోధిస్తున్నాడు.

**7.** యోహాను 11:38-44లో లాజరును మరణము నుండి జీవానికి నడిపించుట చూశాము. మరణమును గెలిచి లేచిన యేసయ్య ధ్వజము క్రింద ఉంటే విజయము వస్తుంది. యెహోవా నిస్సీ (ధ్వజము) నిర్గమ 17:15లో "మోషే ఒక బలిపీఠము కట్టి దానికి యెహోవా నిస్సీ అని పేరు పెట్టాడు". యెహోవా దేవునికి ఉన్న నామాలన్నీ యేసయ్యకు కూడా వర్తిస్తాయి. కాబట్టి ఆయన దేవుడే అని రుజువు చేయవచ్చును.

యోహాను సువార్తికుడు తాను గ్రంథస్తము చేసిన ఏడు సూచక క్రియల ద్వారా "నిజమైన వెలుగు" గా ఈ లోకములోనికి వచ్చిన దేవుడు "లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని" (యోహాను 1:9) వెలిగించాడు. ప్రతి సూచనలో రోగము, పాపము, లేమి, భయము, చీకటి, మరణము అను సమస్యలతో చచ్చిన స్థితిలో ఉన్నవారిని తన జీవపు వెలుగులోనికి నడిపించాడు.

ఈ ఏడు సూచక క్రియల ద్వారా దేవుడు మన వెలుగుగా మన జీవితాలలోకి వస్తే ఏమి జరుగుతుందో చూద్దాము :

1. మొదటి సూచన ద్వారా ఆయన సన్నిధిలో సమృద్ధి ఉంటుంది, ఆయనిచ్చే వనరులు శ్రేష్ఠమైనవై ఉంటాయి అని తెలుస్తుంది.
2. రెండవ సూచన ద్వారా మనకు శారీరక, ఆత్మీయ ఆరోగ్యము ఇవ్వగలడు అని తెలుస్తుంది.
3. మూడవ సూచన ద్వారా వెలుగు బాట నీతి అని తెలుస్తున్నది.
4. నాలుగవ సూచన ద్వారా వెలుగు సమృద్ధిని ఇస్తుందని తెలుస్తుంది.
5. అయిదవ సూచన ద్వారా వెలుగు సమాధానము ఇస్తుందని తెలుస్తుంది.
6. ఆరవ సూచన ద్వారా వెలుగు మన జీవితాలను వెలిగిస్తుందని తెలుస్తుంది.
7. ఏడవ సూచన ద్వారా వెలుగు మనకు నిత్యజీవము ఇస్తుందనియు తెలుస్తున్నది.

ప్రతి సూచక క్రియకు ముందు అక్కడ “లేదు” అను మాట వినబడుతుంది, కాని నిజమైన వెలుగు వచ్చినపుడు అక్కడ సమృద్ధి ఉంటుంది. మానవుని కొరత, దేవుని సమకూర్పు సూచనలు మనము ప్రతి సంఘటనలో చూస్తున్నాము. అందుకే దైవత్వము చూపుటకు ఈ సూచనలు మనముందు యోహాను సువార్తికుడు ఉంచుతున్నాడు.

# 6. మానవాళిని వెలుగులోనికి తెచ్చిన ప్రభువు

**పా**పమనే భయంకరమైన చీకటిలో కొట్టుమిట్టాడుచున్న మానవాళిని తన జీవపు వెలుగులోనికి తెచ్చుకోవాలను సంకల్పముతో ఈ లోకమునకు శరీర ధారిగా వచ్చిన యేసుక్రీస్తు ప్రభువును నిజమైన వెలుగుగా మనకు చూపిస్తున్న యోహాను సువార్తీకుడు తన సువార్త రెండవ భాగములో యేసుప్రభువు తన పనిపూర్తి చేసుకొని తిరిగి పరలోకమునకు వెళ్లకముందు తన తదనంతరము తాను మొదలుపెట్టిన పనిని కొనసాగించుట కొరకై తన శిష్యులను తర్ఫీదు చేసిన విధానమును గ్రంథస్తము చేశాడు. వేదాంత పండితులు యోహానును ఒక గరుత్మంతునికి పోల్చి "జీవముగల వాటన్నింటిలో ఈ పక్షి మాత్రమే ప్రచండ సూర్యుని వంక కన్నార్పక చూడగలిగినట్లు, క్రొత్త నిబంధన గ్రంథకర్తల్లో యోహానొక్కడే నిజమైన వెలుగుగా ఈ లోకానికి వచ్చిన యేసుప్రభువును అనుభవ పూర్వకముగా తెలుసుకొని, ఆయన చెప్పిన మాటల్లోని గూఢార్థాలను, సత్యాలను, దేవుని మనసును చూడగలిగెను" అన్నారు.

తన పరిచర్య ఆరంభములోనే యేసయ్య తన శిష్యులను ఎన్నుకొని, మూడున్నర సంవత్సరాలు తనతో పాటు ఉంచుకొని వారికి శిక్షణ ఇచ్చాడు గాని, చివరి రోజులలో ఇంకా మిగిలిపోయిన విషయాలన్నీ నేర్పించాడు. యోహాను సువార్త 13-17 అధ్యాయాల వరకు ఉన్న భాగములో మేడగదిలో యేసయ్య తన శిష్యులకు చేసిన బోధలు వ్రాయబడి ఉన్నాయి. వారిని ప్రత్యేక రీతిలో తీర్చిదిద్దుటకు నిర్ణయించు కున్నందున, చాలా విషయములు బోధించాడు. తాను ఈ లోకము నుండి తండ్రి యొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు ఎరిగి తాను ప్రేమించిన తన శిష్యులతో

సమయము గడిపాడని వ్రాయబడి ఉంది. లోకమంతటిని ప్రేమించాడు కాని వీరిని తన పరిచర్య కొరకు ఏర్పరచుకొన్నందున వారిని ఇంకా ఎక్కువగా ప్రేమించినట్లు చూడగలము. అది ఆయనలో ఉన్న సంపూర్ణ మానవత్వమునకు గుర్తు.

యేసయ్య శిష్యులకు ఈ సందర్భముగా నేర్పిన మొదటి పాఠము తమను తాము తగ్గించుకొనుట. ఈ పాఠము 'క్రియారూపక బోధ'గా యేసయ్య చేసి చూపించాడు. పస్కా పండుగ ఆచరించుట కొరకై వారేర్పరచుకున్న మేడగది అన్ని హంగులతో కూడినదైనను అందులో సేవకులెవరూ లేరు. వారు కాళ్లు కడుగుకొనుటకు నీళ్ళిచ్చే సేవకుని పాత్ర యేసయ్య పోషించాడు. ఫిలిప్పీ 2:6-8లో పౌలు వ్రాసినట్లు తండ్రియైన దేవునితో సమానముగా పరలోకములో ఉండాల్సిన వాడు తన్ను తాను తగ్గించుకొని, రిక్తునిగా చేసుకొని, దాసుని స్వరూపమును ధరించుకొన్నాడు.

ప్రభువు ఆ మేడగదిలో చేసిన కార్యము 13:4,5 వచనాలలో వ్రాయబడి ఉంది. ఇందులో ఆయన పరిపూర్ణముగా ఏడు పనులు చేశాడు : 1) భోజన పంక్తిలో నుండి లేచాడు; 2) పై వస్త్రము ప్రక్కన పెట్టివేశాడు; 3) తువాలు తీసుకున్నాడు; 4) తువాలు నడుముకు కట్టుకున్నాడు; 5) పళ్లెములో నీళ్లు పోశాడు; 6) శిష్యుల పాదములు కడిగాడు; 7) తువాలుతో తుడిచాడు.

తనను సిలువకు అప్పగించబోవు ఇస్కరియోతు యూదా పాదములు కూడా కడుగుట అద్భుతమైన చర్య. తాను బోధించిన 'శత్రువులను క్షమించుట' అనేది చేసి చూపిస్తున్నాడను సంగతి అప్పుడు తెలుసుకోలేక పోయినా శిష్యులు తర్వాత తెలుసుకుంటారు. ఆయన పాపిని ప్రేమిస్తాడు గాని పాపమును ద్వేషిస్తాడు, ఆయనకు పక్షపాతము లేకుండా అందరినీ ఒకేలా చూచుకుంటాడని కూడా వారు తెలుసు కుంటారు. పేతురు యొద్దకు వచ్చినప్పుడు, అతను అభ్యంతరపడితే యేసయ్య అతను కడిగించుకోకపోతే తాను చేసే పనులలో అతనికి పాలు లేదనగానే కాళ్లేకాదు, వళ్లంతా కడుగమంటాడు. స్నానము చేసినవాడు, కాళ్లు మాత్రము కడుగుకుంటే చాలని ప్రభువు చెప్పాడు.

వారి పాదములు కడుగుట పూర్తిగావించి కూర్చున్న తర్వాత తానెందుకు ఆ పని చేశాడో వివరిస్తున్నాడు : "ప్రభువును, బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములు ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:14,15). ఇక్కడ యేసయ్య తగ్గింపు స్వభావము యొక్క ప్రాధాన్యత వారికి చూపుతున్నాడు. ఈనాటి క్రైస్తవుడు కాళ్లు కడగటమంటే కేవలము తగ్గించుకోవడమే గాక తోటి క్రైస్తవుని సరిచేయుట. సంఘములోని తోటి విశ్వాసులెవరైనా తప్పుమార్గములో పోతుంటే వారిని కడుగుటకు ప్రయత్నించాలి. మరీ వేడి నీళ్లతో కాక, మరీ చల్లగా ఉన్న నీటితో గాక సరైన ఉష్ణోగ్రత గల నీటితో కడగాలి – వారితో మాట్లాడేటప్పుడు మన మాటలు ఉప్పువేసినట్లు రుచికరంగాను, కనికరముతోను నిండి యుండాలి.

ఇక్కడ యేసయ్య రెండు రకముల శుద్ధీకరణ గురించి చెప్తున్నాడు. 'స్నానము చేయడమంటే' రక్షణ పొందుట. యేసయ్య మన రక్షణార్థము ఈ లోకానికి వచ్చాడని నమ్మి, నోటితో ఒప్పుకుంటే ఆయన మన పాపములను తీసివేసి తన నీతి వస్త్రము కప్పుతాడు. కాళ్లు కడుగుకొనుట అనేది మన అనుదిన జీవితములోని శుద్ధీకరణ. రక్షణ మార్గములో పోతున్నపుడు కూడా కొన్నిసార్లు పడిపోతుంటాము. మనలో ఉన్న పరిశుద్ధాత్ముని హెచ్చరికలు విని, వెంటనే దేవుని సన్నిధిలో క్షమించమని అడగాలి. ఆయన కరుణామయుడు కాబట్టి పశ్చాత్తాప హృదయముతో తన యొద్దకు వచ్చినవారిని తప్పక క్షమించి అక్కున చేర్చుకుంటాడు.

యేసుప్రభువు ఆ మేడగదిలో వాడిన ప్రతి వస్తువును పురాతన వస్తు ప్రదర్శన శాలలో భద్రపరిచారు కాని ఆయన కాళ్లు కడుగుటకు వాడిన పళ్లెము, తువాలు దొరకలేదు. ఈనాటి సంఘాలలో కూడ అవి రెండు కనబడుట లేదు. తగ్గింపు స్వభావము లేదు, శిష్యులు కూడా అంతకు ముందు ఎవరు గొప్ప అని సింహాసనము

కొరకు పోట్లాడారు గాని తువ్వాలు కొరకు ఎవరూ పోట్లాడలేదు. యేసయ్య వారి కాళ్లు కడుగుచున్నప్పుడు కూడా ఎవరూ ఆయనకు సహాయపడుటకు తయారుగా లేరు. ఎందుకంటే అది యూదులు చేసేపని కాదని వారనుకుంటున్నారు, కేవలము కట్టు బానిసలు చేసే పని అది. అయితే ప్రభువు, సర్వశక్తిమంతుడు అయిన యేసయ్య తాను చేశాడు కాబట్టి వారిని కూడా చేయమంటున్నాడు. ఒక నాయకుడు ఎప్పుడూ సేవ చేసే వానిగా ఉండాలి అని ఆయన ఉద్దేశము (Servant Leadership). వెలుగు సంబంధులుగా ఈ లోకములో ఉండాల్సిన శిష్యులు, మనం కూడా ఈ శుభ్రపరచే కార్యక్రమము తరచుగా చేస్తుండాలని యేసయ్య బోధిస్తున్నాడు, ఒకరినొకరు ప్రేమించాలని ఆజ్ఞాపించాడు.

ఆ తర్వాత తనను అప్పగించబోయే యూదాను గురించి యేసయ్య కలవరపడ్డాడు, అతను సాతాను ఆధీనంలోకి వెళ్లాడని బాధపడ్డాడు. పేతురు కూడా తానెవరో తెలియదని ముమ్మారు బొంకుతాడని చెప్పాడు. యేసుప్రభువు లాజరు మరణించినపుడు "ఏడ్చెను" అని వ్రాయబడి ఉంది. యోహాను 11:33లో "మూలిగెను" అనియు; 13:21లోను "కలవరపడెను" అని వ్రాయబడి ఉంది. అవి ఆయన మానవత్వానికి నిదర్శనాలు. ఆయన ఎంతగా కలవరపడినను, 14:1లో శిష్యులను కలవరపడవద్దని చెప్తున్నాడు. తన మన:స్థితి ఏ విధముగా ఉన్నను, తన శిష్యులు కలవరపడకుండా ఉండాలని కోరుకొనుటలో ఆయనకు వారిపట్ల ఉన్న ప్రేమ వెల్లడగుచున్నది. వారిని విశేషముగా ప్రేమించుట వలననే, తాను వెళ్లిపోయిన తరువాత వారు లోకానికి వెలుగై ఉండాలని ఆశిస్తూ, శిక్షణ ఇస్తున్నాడు.

శిష్యులలో ఒకరు తనను అప్పగిస్తారని ప్రభువు చెప్పడము, తాను వారితో కొంతకాలమే ఉంటానని చెప్పడము, పేతురు ముమ్మారు బొంకుతాడనియు, తాను వెళ్లిపోయే సమయమాసన్నమైనదని చెప్పుట, ఇవన్నీ శిష్యులను కలవరపెడుతున్నాయి. ఈ భయానికి, కలవరానికి విరుగుడు ఆయనే చెప్తున్నాడు. "దేవుని యందు

విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి” అని చెప్తున్నాడు, తాను వెళ్లి తన తండ్రి ఇంట వారికి స్థలము సిద్ధపరచి, తిరిగి వచ్చి వారిని తీసుకువెళ్తానని చెప్పి వారిని ధైర్యపరుస్తున్నాడు. Heaven is prepared place for prepared people. సిద్ధపరచని స్థలానికి మనలను తీసుకెళ్లడు. తాను వెళ్లుచున్న స్థలమునకు వారికి మార్గము తెలియునని చెప్పినను, వారు తెలియదని చెప్పినప్పుడు “యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు” (యోహాను 14:6) అని చెప్పాడు. ఇది ఒక శక్తివంతమైన సత్యము. ఆనాటి నుండి ఈనాటి వరకు, రాబోవు తరముల వారికి కూడా వారి మనసులో స్థిరపరచుకోవాల్సిన సత్యము.

ఈ చివరి భాగములో తన శిష్యులపై ఉన్న ప్రేమను తెలుపుటకు ఆయన ఏడు వనరులను ఇస్తానని వాగ్దానమిస్తున్నాడు. ఆయనిచ్చే ఈ ఆశీర్వాదములు మనందరికీ ఇస్తాడు, మనమాయన యందు విశ్వాసముంచినపుడు.

**ఈ ఆశీర్వాదాలేమిటో చూద్దాము :**

1. ప్రేమ : “నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమించబడును; నేనును వానిని ప్రేమించి, వానికి నన్ను కనబరచుకొందునని చెప్పెను” (యోహాను 14:21).
2. శాంతి : “శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను” (14:27)
3. సంతోషము : “మీ యందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను” (15:11).
4. స్నేహము : “నేను మీ కాజ్ఞాపించు వాటిని చేసిన యెడల, మీరు నా స్నేహితులై యుందురు” (15:14).
5. వాక్యము : “లోకము నుండి నీవు నాకు అనుగ్రహించిన మనుష్యులకు నీ నామమును ప్రత్యక్షపరచితిని, వారు నీవారై యుండిరి, నీవు వారిని నా కనుగ్రహించితివి; వారు నీ వాక్యము గైకొని యున్నారు” (17:6).

6. నిత్యజీవము : "నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమ పరచుము. నీవు నీ కుమారునికిచ్చిన వారికందరికిని ఆయన నిత్యజీవము అనుగ్రహించునట్లు సర్వ శరీరులమీదను ఆయనకు అధికారమిచ్చితివి" (17:2). 17వ అధ్యాయము ప్రభువు తండ్రికి చేస్తున్న ప్రార్థనయై యుంది. తన కొరకు, తన శిష్యుల కొరకు, విశ్వాసులందరి కొరకు చేసిన ప్రధాన యాజకుని ప్రార్థన ఆ అధ్యాయములో చూడగలము.

7. నామము : "నేను వారి యొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని" (17:12).

ఈ వనరులే గాకుండ వారితో కూడా ఉండుటకు ఆదరణ కర్త అయిన పరిశుద్ధాత్మను పంపుతానన్నాడు. "నేను ఈ సంగతులు మీతో చెప్పినందున మీ హృదయము దు:ఖముతో నిండియున్నది. అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్లిపోవుట వలన మీకు ప్రయోజనకరము. నేను వెళ్లనియెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్లిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును" (16:6,7) ఈ మాటలలో ఆయన వారిపట్ల ఎంత ప్రేమ కనపరుస్తున్నాడో అర్థమవుతున్నది.

పరిశుద్ధాత్మ దేవుని గురించి వారికి విశదీకరించాడు. "ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును" అనియు, "ఆయన సమస్తమును మీకు బోధించి మీకు జ్ఞాపకము చేయును" అనియు చెప్పాడు. ఆయన చెప్పినవన్నియు నెరవేరాయని శిష్యులు అపొస్తలుల కార్యములలో చూశారు. ఉదాహరణకు :

ఎ. 14:26 లో "మీకు జ్ఞాపకము చేయును" అన్నాడు. అ.కా. 11:16లో "యోహాను నీళ్లతో బాప్తిస్మమిచ్చెను గాని మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురనియు ప్రభువు చెప్పిన మాట నేను జ్ఞాపకము చేసుకొంటిని" అని పరిశుద్ధాత్మతో నింపబడిన పేతురు అన్నాడు.

**బి.** 15:26లో "ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" అని యేసయ్య చెప్పాడు. అ.కా. 5:32లో పేతురు "మేమును, దేవుడు తనకు విధేయులైన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మయు, ఈ సంగతులకు సాక్షులమై యున్నామని చెప్పిరి".

**సి.** 16:8లో "ఆయన వచ్చి, పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" అని ప్రభువు చెప్పాడు. అ.కా. 2:37లో పరిశుద్ధాత్మను పొందిన తర్వాత పేతురు అక్కడున్న జనులతో మాట్లాడినపుడు "వారు ఆ మాట విని హృదయములో నొచ్చుకొని" మూడు వేలమంది యేసుప్రభువు మార్గములోకి వచ్చారు.

యేసుప్రభువును వెంబడించేవారెప్పుడూ అందరూ తమను వదిలేశారని గాని, తాము నిస్సహాయులమని గాని అనుకోనవసరము లేదు, ఎందుకంటే యేసయ్య వారితో ఉండుటకు పరిశుద్ధాత్మ దేవుని పంపించాడు. ఆయన కూడా పరలోకము నుండి యేసుప్రభువు వలె దిగివచ్చినవాడు. ఆయన ప్రపంచములోకెల్ల గొప్పగా నడిపించువాడు, సలహాదారుడు, సహాయకుడు. ఎవరైనా ఒక ఇంటిలో నివసించుటకు వచ్చినపుడు వారున్నట్లు రుజువులు కనపడుతాయి. వారి సామానులతో ఆ ఇంటిని నింపుతారు, వారికిష్టమైన రీతిలో ఇంటిని అలంకరించు కుంటారు. పరిశుద్ధాత్మ దేవుడు మనలో నివసించుటకు వచ్చినపుడు, మనలో మార్పులు కనపడుతాయి, ఆయనున్నట్లు ఇతరులకు రుజువులు కనపడుతాయి. దేవుని ప్రేమ, దేవుని సన్నిధి, దేవుని గురించిన ఆలోచనలు మనలో ఉంటాయి.

యేసయ్య తాను వెళ్లిపోయిన తర్వాత తన వెలుగుగా ఈ లోకములో ఉండాల్సిన శిష్యులకు పరిశుద్ధాత్మను అనుగ్రహించుట ద్వారా, వారు దేవుని మహిమార్థము జీవించుటకు వీలైంది. ఆయన మనలో ఉంటే మనము కూడా ఆయనిచ్చు సమాధానము, ప్రేమ పొందుకోగలము.

యేసయ్య తాను ద్రాక్షవల్లితోను, తండ్రియైన దేవుడిని వ్యవసాయకుడిగాను, మనలను తీగెలతోను పోల్చి, మనము యేసయ్యతో కట్టబడి ఉండకపోతే, దేవుడు మనలను కత్తిరించివేస్తాడని హెచ్చరించాడు. ప్రతి విశ్వాసిలో ఫలము కనపడాలి, ఫలము లేకుంటే వ్యవసాయకుడు కత్తిరించి పారవేస్తాడు. ఒక తీగె ద్రాక్షవల్లిలో అతకబడి నిలిచియుంటేనే గాని, అందులోని జీవసారము గ్రహించలేదు, ఫలించలేదు. వాక్యమై యున్న ప్రభువులో నిలిచి ఉంటే మనము స్థిరపరచ బడుతాము. "నిజమైన వెలుగు" గా ఈ లోకానికి వచ్చిన యేసయ్యతో అంటు కట్టబడి ఉంటేనే ఆయన వెలుగు మననుండి ఇతరులకు ప్రసరించబడుతుంది. ఆయన యందు నిలిచి యుండుట వలన మనకు వచ్చు ఆశీర్వాదాలు కూడా ప్రభువు తన శిష్యులకు చెప్తున్నాడు.

1. విస్తారమైన ఫలము;
2. ఏది అడిగినను దేవుడనుగ్రహిస్తాడు;
3. దేవుడు మహిమపరచబడుతాడు, తద్వారా దేవుని ఉద్దేశము నెరవేర్చబడుతుంది (యెషయా 43:7).
4. యేసయ్య ప్రేమ దొరుకుతుంది;
5. మన సంతోషము పరిపూర్ణమవుతుంది.

విశ్వాసులందరు ఒకే ద్రాక్షవల్లి తీగెలు కాబట్టి అందరూ ఒకరినొకరు ప్రేమించాలి అని కూడా ప్రభువు చెప్పి వారికి రాబోవు శ్రమలను గురించి కూడా హెచ్చరించాడు. అయినా వారిలో ఉన్న పరిశుద్ధాత్మ దేవుడు వారికి సాయము చేస్తాడు కాబట్టి భయపడవద్దని చెప్పాడు. యేసులో నిలిచి ఉంటే ఆయన జీవము అందుతుంది కాబట్టి, అద్భుతంగా ఫలించుటే గాక ఆయనలాగా తయారవుతాము. "లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను" (యోహాను 16:33).

తన శిష్యులతో ఈ ఆదరణ మాటలన్నీ చెప్పి వారిని ధైర్యపరచాక, ప్రభువు వారి కొరకు ప్రార్థన చేస్తున్నాడు. 17వ అధ్యాయము ఆయన ప్రధాన యాజకునిగా చేసిన ప్రార్థన అని కొందరంటారు గాని 16వ అధ్యాయము చివరి మాట "నేను జయించి యున్నాననెను" అని ఉంది గాబట్టి ఇది "విజయుని ప్రార్థన" అని కొందరి అభిప్రాయము. ఈ ప్రార్థనలో అంతవరకు తన జీవితములో జరిగిన సంగతులన్నిటిని సంగ్రహముగా చెప్పినట్లుగా ఉంది. ఇందులోని ముఖ్యాంశాలు యేసయ్య తన తండ్రి పట్ల చూపించిన విధేయత, తన సిలువ మరణము ద్వారా తండ్రిని మహిమపరచుట, యేసుక్రీస్తు ద్వారా తండ్రిని మహిమపరచుట, తండ్రిని ప్రత్యక్షపరచుట, శిష్యులను ఈ లోకము నుండి వేరుపరచి తన కొరకు ప్రత్యేకపరచుకొనుట, లోకానికి వెలుగుగా ఉండి "నిజమైన వెలుగు"ను గురించి సువార్త ప్రకటించుట అను పని వారికి అప్పగించుట, తండ్రి, కుమారుల ఐక్యతను మాదిరిగా తీసుకొని, వారు కూడా ఐక్యతను కలిగి ఉండమని కోరుట, చివరికి వారందరు తనయొద్దకు చేరాలనే ఆకాంక్ష. ఈ అంశాలన్నీ ఈ ప్రార్థనలో ఉన్నాయి. తాను తిరిగి తన తండ్రి యొద్దకు వెళ్ళిపోయాక, లోకానికి వెలుగై యుండుటకుఈ లోకానికి వచ్చిన తన ప్రణాళిక కొనసాగించుటకు తన శిష్యులను తర్ఫీదు చేస్తున్న ఈ తరుణంలో ఈ ప్రార్థన ప్రాధాన్యత సంతరించు కుంటుంది. లోకానికి వెలుగుగా ఉండాల్సిన తన శిష్యులు, ఈనాడు మనము, పరిపూర్ణ విధేయతతో, సమర్పణతో, పూర్ణమనసుతో, సంతోషముగా పనిచేయాలని ఆయన ఆశగా చూడగలము.

17వ అధ్యాయములోని ఈ ప్రార్థనను మూడు భాగములుగా విభజింప వచ్చును :

**మొదటి భాగము :** యేసుప్రభువు తండ్రి తనకప్పగించిన పనిని సంపూర్ణముగా పూర్తిచేశానని తండ్రికి చెప్తూ, తన కొరకు తాను ప్రార్థించుట 1 నుండి 5 వరకు ఉన్న వచనాలలో చూడవచ్చును. 5వ వచనములో మాత్రమే తన కొరకు తాను ఒక విన్నపము చేశాడు – నన్ను మహిమ పరచుము. ఇక్కడ 'మహిమ పరచుట' అంటే గొప్ప చేయడము కాదు గాని, ఆది నుండి తండ్రితో

సమానముగా ఉన్న మహిమను తనకు తిరిగి అనుగ్రహించమని కోరుతున్నాడు. పరలోకము నుండి రిక్తుడై దిగివచ్చి, రక్తమాంసములతో శరరీధారియై ఈ లోకములో ఉండుటకు వచ్చిన యేసయ్య దైవత్వము ఉన్నను, దేవుని మహిమలేదు. దేవుని మహిమ ఆయనే అయి ఉండి గూడ మనకొరకు, తన మహిమను విడిచిపెట్టి వచ్చిన త్యాగమూర్తి. తాను మహిమపరచ బడుటే గాక, తన ద్వారా తండ్రి కూడా మహిమపరచబడాలని విజ్ఞాపన చేస్తున్నాడు.

**రెండవ భాగము :** 6-19 వరకు ఉన్న వాక్య భాగములో ప్రభువు తన శిష్యుల కొరకు ప్రార్థించాడు. తనకు తండ్రి ఇచ్చిన అధికారాన్ని బట్టి తనకు అప్పగించిన వారందరికీ నిత్యజీవము అనుగ్రహించాడు. తండ్రిని, కుమారుని తెలుసుకొనుటయే నిత్యజీవము. దేవుని తెలుసుకొనుటయే నిత్యజీమునకు మార్గమని చాలా మతాలలో నేర్పిస్తారు. పాత నిబంధనలో కూడ ఈ మాట హోషేయ 4:6లో "నా జనులు జ్ఞానము లేక నశిస్తున్నారు" అని చెప్పబడి ఉంది, ఈ జ్ఞానమునిజమైన ఒక్కడే దేవుని గురించి, యేసుప్రభువును గురించిన జ్ఞానము ద్వారా తండ్రియైన దేవుని తెలుసుకోవచ్చు, యేసయ్య జీవించినంతకాలము తన తండ్రిని మహిమ పరచాడు.

ఈ భాగములో అందరి కొరకు ప్రార్థించుట లేదు గాని శిష్యుల కొరకు మాత్రమే ప్రార్థిస్తున్నాడు. వీరందరు ఈ పాపలోకమునకు చెందిన వారైనను, వారిని వేరుపరచి తండ్రి ఆయనకిచ్చాడు. యేసయ్య పరిచర్య ఆరంభములోనే, తాను ముందుగా ఏర్పరచిన వారిని ఆయనకిచ్చాడు. దేవుడు తన శిష్యులుగా ఉండుటకు ఏర్పరచిన వారికి తన తండ్రి నామము, ఆయన గుణలక్షణాలు, ప్రవచనాత్మకంగా ప్రత్యక్ష పరచాడు. యెషయా 52:6లో "నా ప్రజలు నా నామము తెలుసుకొందురు"అని వ్రాయబడి ఉంది. తన శిష్యులకు మిగిలిన వారితో పాటు చేసిన బోధలలో ఏమైనా అర్థము గాకుంటే, ప్రక్కకు పిలిచి వివరించేవాడు. ప్రభువు పరిచర్య చివరి దశలో శిష్యులు ఆయన దైవకుమారుడనియు, "నిజమైన వెలుగు"అనియు, ఆయన

బోధించినవన్నియు దేవుని దగ్గరనుండి వచ్చినవనియు తెలుసుకున్నారు. 17:9లో "నేను లోకము కొరకు ప్రార్థన చేయుట లేదు" అను మాటలు కొందరు అపార్థము చేసుకుంటున్నారు. దేవుడు లోకమంతటిని ప్రేమించాడు (యోహాను 3:16) అని వుంది కదా మరి ఇక్కడ ఎందుకిలా అంటున్నాడు అంటారు. తన తదనంతరము లోకానికి వెలుగుగా ఉండుటకు ఏర్పరచుకొన్నాడు కాబట్టి వారి కొరకు ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాడు. అదే గాకుండా 31/2 సంవత్సరముల కాలములో వారితో ఒక ప్రత్యేక అనుబంధము ఏర్పడింది. ప్రేమ, సాన్నిహిత్యము, విధేయత, విశ్వాసము ఒకరిపై ఒకరు ఆధారపడుట, ఆనందము, సమాధానము, భవిష్యత్తులో వారికి రాబోయే పరలోక ఆశీర్వాదాలు, వారిమధ్య ఉన్న ఐక్యత, ఫలము – ఇవన్నీ వారిని క్రీస్తుతో అంటుకట్టబడేటట్లు చేశాయి. ఆయన వారిని వదిలివెళ్తున్నాడు కాబట్టి వారి కొరకు ప్రార్థిస్తున్నాడు. రాబోయే శ్రమలలో ఆయన వారితో ఉండడు. పరిశుద్ధాత్మ దేవుని పంపుతానంటున్నాడు గాని, ఆత్మ దేవుని వారు చూడలేరు కాబట్టి మానవరూపంలో వారితో ఉన్న యేసయ్యలేని వెలితి వారికి ఉంటుంది.

యేసయ్య వారి భద్రత కొరకు ప్రార్థిస్తున్నాడు. ఇహలోక శోధనలలో పడకుండా, అపవాది కోరలకు చిక్కకుండా పవిత్రంగా ఉంచమని కోరుతున్నాడు. తాను బోధించిన బోధలలో వారు స్థిరంగా ఉండాలని, అబద్ధ బోధలు నమ్మకుండా ఉండుటకు సహాయపడమని ప్రార్థించాడు. ఈ ప్రార్థనలో యేసయ్యకు తన తండ్రితో ఉన్న లోతైన సహవాసము కనపడుతున్నది. తాను తండ్రిపై ఆధారపడినట్లు శిష్యులు కూడా ఆధారపడాలని కోరుకుంటున్నాడు. తండ్రిలోని ఆనందము వారు కూడా అనుభవించాలని ఆశిస్తున్నాడు. పరిచర్యను బట్టి వాక్యమును బట్టి తాను శ్రమపడినట్లు తన శిష్యులు శ్రమలు ఎదుర్కొనబోతున్నారను సత్యము ఆయనకు తెలుసు కాబట్టి వారి భద్రత కొరకు ప్రార్థిస్తున్నాడు. వారు బోధించబోయే వాక్య సత్యములను బట్టి ప్రజలు వారిని ద్వేషిస్తారని ఆయనకు తెలుసు. లోకము తన తోటి వారిని ప్రేమిస్తుంది కాని వీరు దేవుని ప్రత్యక్షత కలిగి యుండి, దేవునికి సంబంధించిన వారు గనుక

ద్వేషించబడుతారు, లోకమంతా అపవాది ఆధీనములో ఉన్నారు కాని వీరు ఈ లోకములోనే ఉండి అపవాది అధికారములోకి రాకుండా తమ్ముగు తాము కాపాడుకోవలసిన అవసరత ఉంది కాబట్టి వారికి సహాయము కావాలి.

తన శిష్యులు సత్యమందు ప్రతిష్ఠించబడాలని ప్రార్థిస్తున్నాడు. ఆయన పవిత్రుడు కాబట్టి వారిని కూడా పవిత్రులునుగా చేయమని యేసయ్య తండ్రిని అడుగుతున్నాడు. యేసుప్రభువును తండ్రి అభిషేకించి ఈ లోకములోకి పంపినట్లు, ఇప్పుడు తన శిష్యులను వెలుగుగా ఉండుటకు ప్రభువు పంపుతున్నాడు.

17:20-23లో కాబోయే విశ్వాసుల కొరకు ప్రభువు ప్రార్థిస్తున్నాడు. తన శిష్యులందరు ఐక్యతగా ఉండి తాను వారికప్పగించిన పని నెరవేర్చుట వలన, వారి బోధలు విని యేసుప్రభువు నందు భవిష్యత్తులో విశ్వాసముంచ బోయే వారి కొరకు ప్రార్థిస్తున్నాడు. తండ్రి తనను ప్రేమించినట్లు, శిష్యులు కూడా ఒకరినొకరు ప్రేమించు కొనుటలో సహాయపడమని దేవుని వేడుకుంటున్నాడు. ఇది ప్రతి సువార్తికుడు తన తోటి దైవ సేవకుల కొరకు చేయాల్సిన ప్రార్థనయై యున్నది.

**మూడవ భాగము :** 17:14-26 – ఈ చివరి భాగములో తన మహిమను చూసి అందరు పరిపూర్ణులగునట్లు యేసయ్య విశ్వాసులందరి కొరకు ప్రార్థిస్తున్నాడు. విశ్వాసులందరూ పరలోకంలో తన మహిమలో ఉండాలని ఆశిస్తున్నాడు.

తాను చేస్తున్న ప్రార్థన ద్వారా తనకున్న ఆత్మల భారము, ఎవరూ నశించిపో కూడదన్న తన కోరిక, తాను ఈ లోకానికి వచ్చిన ఉద్దేశము నెరవేరాలనుకున్న తలంపు తన శిష్యులకు అర్థమయ్యేటట్లు చేశాడు. వారికివ్వాల్సిన తర్ఫీదునంతా ఇచ్చాననుకున్న తర్వాత ఇక తన సమయమాసన్నమైందని తెలుసు కనుక వారిని తీసుకొని గెత్సేమనే తోటకు వెళుతున్నాడు. 18,19 అధ్యాయాలలో ఆయన శ్రమలు, సిలువ, మరణము, భూస్థాపన కార్యక్రమాలు గ్రంథస్థము చేయబడి ఉన్నాయి.

యేసు అప్పగింప బడక ముందు రాత్రి తన శిష్యులతో పాటు గలిలయ కాలమాన ప్రకారము పస్కా పండుగ ఆచరించి యూదయ కాలమాన ప్రకారము

మరుసటి రోజు మధ్యాహ్నము తానే పస్కా బలి పశువుగా బలిగావించబడ్డాడు. చివరి భాగంలో చీకటిలో ఉన్న మానవాళిని వెలుగులోకి తీసుకొచ్చిన విధానము చూడగలము.

యోహాను 18నుండి 21 అధ్యాయాలలో యేసుప్రభువు చేసిన ఆత్మీయ పరిచర్య గ్రంథస్తము చేయబడి ఉంది. ఇది నశించిపోతున్న ఆత్మలను విమోచించు కార్యక్రమము. లోకానికి వెలుగుగా ఉండమని తన శిష్యులకు ప్రబోధించిన యేసయ్య తాను ఈ లోకానికి వచ్చిన పని నెరవేర్చుకొని వెళ్ళిపోయే సమయము ఆసన్నమైనదని చెప్తూ వారిని గెత్సెమనే తోటకు తీసుకు వెళ్తున్నాడు. ఈ భాగములోని విషయాలన్నీ అర్థము చేసుకోవడానికి, ఇక్కడ వాడబడిన అనేక సూచనలు అర్థము చేసుకోవాలి. ఈ చిహ్నాలు కొన్ని ప్రాముఖ్యమైన సత్యాలు తెలుపుతాయి. ఈ భాగములో ఉన్న అయిదు సూచనలు ధ్యానించుకుందాము :

**1. తోట** (18:1) :

యేసయ్య విధేయతకు చిహ్నంగా ఉన్నది. ఆ తోట యజమాని యేసయ్యను గురించి తెలిసిన వాడైనందున, ఆయన తన శిష్యులతో పాటు విశ్రాంతి, ధ్యానము, ప్రార్థన కొరకు తన తోట వాడుకొమ్మని అనుమతించి నందువల్ల అక్కడకు తన శిష్యులతో కలిసి తరచుగా వెళుతూ ఉండెడివాడు. మేడగది బోధల తర్వాత తన శిష్యులతో కలిసి తన అంతిమ యాత్రకు ప్రార్థనతో సిద్ధపడుటకు వెళుతూ ఉన్నాడు. యూదా తనను అప్పగించుటకు అక్కడికి వస్తాడని ఆయనకు తెలుసు కాబట్టి సిద్ధంగా ఉన్నాడు. ఆయన ప్రతి చర్యలో స్వచ్ఛందంగా తనను తాను బలిపశువుగా అర్పించుకొనుటకు సిద్ధపడుట మనము చూడగలము.

మానవాళి చరిత్ర ఏదేను తోటలో ప్రారంభమైంది, మానవుని మొదటి పాపము కూడా అక్కడే మొదలైంది, మొదటి ఆదాము దేవునికి అవిధేయత చూపుట వలన ఆ తోట నుండి బహిష్కరించబడ్డాడు కాని కడపటి ఆదామైన యేసయ్య

విధేయతతో గెత్సేమనే తోటకు వెళ్లాడు. మొదటి ఆదాము తోటలోనే తన అవిధేయత ద్వారా మానవాళికి పాపము, మరణము సంక్రమింప చేశాడు గాని యేసయ్య (కడపటి ఆదాము) తన విధేయత ద్వారా నమ్మిన మానవాళికి నీతి, జీవము తెచ్చాడు. ఫిలిప్పీ 2:8లో "సిలువ మరణము పొందునంతగా విధేయత చూపిన వాడై, తన్నుతాను తగ్గించుకొనెను" అని వ్రాయబడి ఉన్నది. మానవుని చరిత్ర కూడా ఒక తోటలోనే ముగించబడుతుందని ప్రకటన 21-22 అధ్యాయాలలో దేవుడు యోహాను ద్వారా ప్రత్యక్షపరచాడు. గెత్సేమనే అంటే అర్థము 'నూనె గానుగ'. ఒలీవలు ఆ గానుగలో వేసి నలిపినపుడు నూనె వస్తుంది. యేసయ్య శ్రమల దృశ్యమిది. ఆయన నూనె గానుగ (శ్రమల) గుండా వెళ్లి మనకు ప్రత్యామ్నాయంగా తీర్పు తీర్చబడుచున్న విధానానికి సూచన ఇది.

"కెద్రోను వాగు దాటిపోవుట" అనేది కూడా ప్రవచనాత్మకంగా యేసయ్యకు, ఆయన శిష్యులకు సంభవించబోయే చీకటి శ్రమలకు సూచనగా ఉన్నాయి. కెద్రోను వాగు యెరూషలేము మందిరము నుండి వచ్చు బలిపశువుల రక్తముతో కూడినదై ఆ నీరు కలుషితముగాను, భయంకరమైన చెడువాసనతోను జగుప్సాకరంగా ఉంటాయి. యేసుప్రభువు పొందబోయే శ్రమలు కూడా ఆ విధంగానే ఉంటాయి. మానవాళి సకల పాపాలు (చిన్నపాపాలు, భయంకరమైన పాపాలు) ఆయనపై మోపబడ బోతున్నాయి. దేవుని ఉగ్రతను ఆయన ఎదుర్కోబోతున్నాడు.

## 2. యూదా మోసము :

మనందరిలోని మోసపు స్వభావానికి సూచనగా ఉంది. మూడు సంవత్సరాలు ఆయనతో కలిసి ఉండి, ఆయన బోధలు వినిన యూదా తన హృదయము కఠినపరచుకొని, ముప్పది నాణెముల కొరకు ఆయనను అప్పగించాడు. ఇటువంటి వ్యక్తిత్వాలు మనలో చాలామంది కలిగియున్నాము, మానవస్వభావమే మోసపూరితమైనది.

యోహాను సువార్తీకుడు దేవుని కుమారునిగా యేసయ్యను చూపించ నుద్దేశించాడు. కాబట్టి యూదా ముద్దుతో ఆయనను అప్పగించినట్లుగా గ్రంథస్తము చేయలేదు. ఈ వెలుగు సువార్త ఈ లోకానికి వెలుగుగా వచ్చిన ఆయన స్వచ్ఛందంగా తనను తాను అప్పగించుకొన్నట్లుగా వ్రాయబడి ఉంది. మిగిలిన సువార్తలలో ఆయనను బంధించుటకు వచ్చిన సైనికులు, యూదా పెద్దలు పంపిన ఉద్యోగులు కత్తులు, గుదియలు పట్టుకొని యూదా వెంబడి వచ్చినట్లుగా వ్రాయబడి ఉంది, కాని ఇక్కడ దివిటీలతోను, దీపములతోను, ఆయుధములతోను వచ్చినట్లుగా వ్రాస్తున్నాడు. లోకమునకు వెలుగైయున్న వానిని వెదుకుటకు వారు దివిటీలు తెచ్చారు గాని ఆయన మహిమ ఎదుట అవి ఆరిపోయాయి. వారు తనను కనుగొనేంత వరకు ఎదురు చూడక, ఆయనే వారి ఎదుటికి వచ్చి తనను తాను ఇష్టపూర్వకంగా అప్పగించుకున్నాడు. వారు వెదుకుచున్న యేసును "నేనే" అని చెప్పగానే ఆయనను పట్టుకొనవచ్చిన వారందరూ వెనుకకు తగ్గి నేలమీద పడిపోయారు. యేసు తనను తాను సర్వశక్తిమంతుడైన దేవుడగు "నేనే" అని మోషేకు ప్రత్యక్షపరచుకొన్నట్లు ప్రత్యక్షపరచుకోగానే, ఆయన మహిమ ఎదుట వారు నిలువలేకపోయారు.

ఏదేను తోటలో మొదటి ఆదాము దేవుడు పిలిచినప్పుడు దాక్కొన్నాడు కాని కడపటి ఆదాము "నేనే" అని చెప్తూ బయటకు వస్తున్నాడు. ఆదాము దేవుని మాట వినలేదు గాని యేసయ్య ఆయన చిత్తము నెరవేరుస్తున్నాడు. ఇంకొకసారి "నేనే" అని చెప్పి తన శిష్యులను వదిలేయమని కోరాడు. వారు ఆయనను బంధింపవచ్చారు గాని ఆయన తనంతట తానే బంధింపబడ్డాడు. తాను సంపూర్ణ ఆధిపత్యము కలవాడిననియు, ఆయనను బంధించే శక్తి ఎవరికీ లేదని రుజువు చేశాడు. తాను గొర్రెలకు మంచి కాపరిననియు, తన గొర్రెలకు భద్రత ఇస్తాననియు, వాటి కొరకు ప్రాణము పెడతాననియు తన శిష్యులతో చెప్పిన మాటలన్నియు రుజువు చేస్తున్నాడు (యోహాను 17:12), శారీరకంగాను, ఆత్మీయంగా వారిని భద్రపరచాడు.

## 3. పేతురు కత్తి :

కత్తి ఎదిరించే స్వభావానికి సూచనగా ఉంది. మేడగదిలో శిష్యులందరు ఆయనను విడిచిపెట్టి వెళ్లము అని చెప్పారు. అందుకేనేమో తన ప్రభువును కాపాడే సమయము వచ్చిందనుకున్న పేతురు తన కత్తి దూసి ప్రధానయాజకుని సేవకుడైన మల్కు చెవి నరికాడు. పేతురు చేసిన పని యేసయ్యకు అభ్యంతరకరముగా ఉన్నది. తాను చెప్పిన బోధలు వారు సరిగా అర్థము చేసుకోలేదను బాధకూడా ఉండి ఉండవచ్చును. పేతురు కత్తి దేవుని చిత్తానికి విరుద్ధంగా ఎదురు తిరుగుచున్నది. పేతురు ప్రతి విషయములోనూ అపజయము పాలైనాడు, యేసయ్యను అర్థము చేసుకోలేక పోయాడు. అటువంటి వారిని దేవుడు మార్చి, పరిశుద్ధాత్మతో నింపి, వాక్యమనే ఖడ్గము పట్టుకొని సువార్త ప్రకటిస్తూ అనేకులను తన వాక్య ఖడ్గముతో గుచ్చి, యేసయ్య వైపు నడిచేటట్లు చేసేవానిగా చేశాడు. దైవసేవకుల యొద్ద ఉన్న కత్తులు ఆత్మీయ పోరాటములో వాడాలని పేతురు తెలుసుకున్నాడు.

## 4. గిన్నె :

ఇది విధేయతకు సూచనగా ఉంది. గెత్సెమనె తోటలో ప్రభువు ప్రార్థిస్తూ లోక పాపముతో నింపబడియున్న గిన్నె గురించి ప్రస్తావిస్తూ "నీ చిత్తమైతే ఈ గిన్నెను తొలగించమని" చెప్పి, అయినా "ఇది నా చిత్తము కాదు, నీ చిత్తమే" అని తండ్రితో చెప్పుట యోహాను గ్రంథస్థము చేయలేదు గాని ఇతర సువార్తీకులు వ్రాశారు. దేవుని చిత్తము నెరవేర్చుటలో సంపూర్ణ అంగీకారము లేదు అనే భావన పాఠకులలో వస్తుందేమోనను అనుమానముతో వ్రాయలేదేమో. పేతురు తన కత్తి దూసి దేవుని చిత్తము నెరవేర్చబడకుండా ఆపుటకు ప్రయత్నిస్తున్నాడు గాని, యేసయ్య తండ్రి చిత్తము నెరవేర్చుటకు పూర్ణాంగీకారముతో వెళుతున్నాడు. పేతురుతో ఆయన "తండ్రి నాకు అనుగ్రహించిన గిన్నెలోనిది నేను త్రాగకుందునా" అన్నాడు.

సైనికులు ఆయనను బంధించి మొదట అన్న యొద్దకు తీసికొనిపోయారు.

## 5. చలిమంట :

ఇది పేతురు బొంకుటకు సూచనగా ఉన్నది. యేసయ్యను సైనికులు బంధించిన తర్వాత యోహాను, పేతురు తప్ప మిగిలిన వారందరూ పారిపోయారు. పేతురు ఆయన వెంబడి వెళ్ళాడు కాని ఆయన ఎవరో తెలియదని బొంకాడు. ఆయన వెలుగులో ఉండాల్సిన వాడు ఆయనను వదలిపెట్టి నందున చలిమంట యొద్ద చలికాచుకొనే వారితో కూర్చున్నాడు. “నిజమైన వెలుగు”ను హత్తుకొని, అంటుకట్టబడి ఉండేవారికి ఈ లోక కృత్రిమమైన వెలుగుగాని, వెచ్చదనము గాని అవసరము లేదు. చలిమంట యొద్ద దుష్టులు, పాపులు, అపహాసకులతో కూర్చోవటము వలన దేవునికి మరీ దూరమైనాడు.

యేసుప్రభువు పట్ల యూదుల న్యాయవ్యవస్థ చాలా అన్యాయంగా ప్రవర్తించింది. యావత్ ప్రపంచములో యూదుల న్యాయవ్యవస్థ చాలా పటిష్టంగా, న్యాయముతో కూడినదై ఉండేది. ఎందుకంటే సమాజములో అత్యంత గౌరవనీయులు, న్యాయము జరగాలని ఆశించేవారు, నిర్దోషులు శిక్షించబడకూడదని గట్టిగా వాదించే డెబ్బది మందితో కూడిన పెద్దల సభ దాని వెనుక వుండేది. అటువంటి వారినే నిజమైన వెలుగును గుర్తించకుండా ఉండేందుకు, వారి ప్రవృత్తికి విరుద్ధంగా ప్రవర్తించుటకు అపవాది ప్రేరేపించాడు. యేసుప్రభువు పట్ల యూదా మత పెద్దలు జరిపిన మూడు అన్యాయపు తీర్పులు, లోకరీత్యా ప్రభుత్వ పెద్దలు జరిపిన మూడు అన్యాయపు తీర్పులు ఈ భాగంలో మనము చూడగలము.

అన్న అను ప్రధాన యాజకుడు తన పదవీకాలం పూర్తి అయినను, తన అల్లుడైన కయప ప్రధానయాజకత్వము చేస్తుండడము వలన తాను కూడా ప్రధాన యాజకునిగానే మెలుగుతున్నాడు. ధర్మశాస్త్రము ప్రకారము ప్రధానయాజకుని కాలవ్యవధి జీవిత కాలమంతయు, అది దైవ నిర్ణయము. కాని అన్యాయపు కాలంలో ప్రధానయాజకత్వము కూడా అమ్ముడు పోయింది. రాత్రి వేళలో ఏ వ్యక్తినైనా బంధింపకూడదను చట్టాన్ని ఉల్లఘించి, యేసయ్యను బంధించారు. అన్న, కయపల

యొద్దకు విచారణకు తీసుకెళ్లారు. పెద్దల సభ (సన్హెడ్రిన్) ఉదయము వరకు విచారణకు వెళ్లకూడదు, అది కూడా ఆలయ ఆవరణములోనే ఉండాలి. ఆ ఆంక్షలన్నీ ప్రక్కన పెట్టి ఆఘ మేఘాలపై తీర్పు తీర్చారు. చట్ట విరుద్ధంగా ఆయనను కొట్టారు, అబద్ధ సాక్షులను సమకూర్చారు. తాను దేవుని కుమారుడనని చెప్పినందు వలన దైవదూషణ అను నేరము మోపి ఆయన మరణ శిక్షకు పాత్రుడని రుజువు చేశారు. ఆయనలో దోషమేమియు వారు కనుగొనలేకపోయారు. యూదులు రోమా ప్రభుత్వ ఏలుబడిలో ఉన్నందున "ఎవనికిని మరణ శిక్ష విధించుటకు" (18:32) వారికి అధికారము లేనందున ఉదయము వరకు వేచి ఉండి, పిలాతు యొద్దకు తీసికొని వెళ్లారు.

ఇక్కడ యోహాను గ్రంథస్తము చేసిన ఒక మాట గురించి ఆలోచించవలసిన అవసరముంది. 18:28లో "వారు కయప యొద్ద నుండి అధికారమందిరమునకు యేసును తీసుకొని పోయిరి. అప్పుడు ఉదయమాయెను గనుక వారు మైలపడకుండ పస్కాను భుజింపవలెనని అధికార మందిరములోనికి వెళ్లలేదు" అని వ్రాయబడి ఉంది. "మైలపడకుండ" పస్కాను భుజించుటకు అన్యుడి ఇంటికి వెళ్లుట అనేది వారికి ఆటంకముగా ఉన్నది కాని, ఒక నిర్దోషిని మరణానికి అప్పగించుట కొరకై వారు చేస్తున్న ప్రయత్నాల ద్వారా వారు ఇప్పటికే ఎంత మైలపడి ఉన్నారో వారికి తెలియడము లేదు. ఎంత వేషధారణ! మనలో ఎంతమంది ఇలాంటి వేషధారులున్నారో మనలను మనము పరీక్షించుకోవాలి.

పిలాతు అన్యుడై ఉన్నను "ఆయన యందు ఏ దోషమును నాకు కనపడలేదు" అని అనేక పర్యాయములు చెపుతూ ఆయనను రక్షించుటకు ప్రయత్నించాడు. యేసుప్రభువును చాలా ప్రశ్నలు వేశాడు గాని ఆయన చెప్పిన సమాధానాలు పిలాతుకు అర్థము కాలేదు. ఒక సందర్భములో ప్రభువు "సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని" అన్నప్పుడు "సత్యమనగా ఏమిటి?" అని యేసయ్యను అడిగాడు కాని సమాధానము కొరకు ఎదురు చూడలేదు. సత్యము తెలిసికొని ఉంటే జీవము కలిగేదేమో. పిలాతు అతనిని విడుదల చేయుటకు ప్రయత్నించినపుడు యూదా మత పెద్దలు అతనిని బెదిరించుటకు ప్రయత్నించారు. యేసయ్య తాను

రాజునని చెప్పుకుంటున్నందువలన, అతను కైసరుకు విరోధి కాబట్టి, అతనిని రక్షిస్తే పిలాతు కూడా కైసరునకు విరోధి అవుతాడని గట్టిగా హెచ్చరించినపుడు, పిలాతు ప్రజలను సంతోషపెట్టే ఉద్దేశముతో 'గబ్బతా' అను స్థలములో న్యాయపీఠముపై కూర్చుని యేసయ్యకు విరోధముగా తీర్పు తీర్చాడు. ఆ తరువాత ఆయనను గొల్గొతా అను స్థలములో సిలువ వేయుటకు తీసుకొని వెళ్లారు. ఈ విధంగా 'గెత్సెమనే' నుండి 'గబ్బతా' ద్వారా 'గొల్గొతా'కు యేసుప్రభువు ప్రయాణము సిలువ యొద్దకు సాగింది.

'గొల్గొతా' అను మాటకు 'కపాలము' అని అర్థము. ఇది మోరియా పర్వత ప్రాంతములో ఉన్న పుర్రె ఆకారములో కనపడు కొండ. కొంతమంది వ్యాఖ్యానకర్తలు దావీదు గొలియాతును చంపి, తల నరికి యెరూషలేము తీసికెళ్లి అక్కడ కొండపై ఉంచాడు, అందుకే అది పుర్రె ఆకారంలో ఉందని అంటారు. అది కేవలము ఊహ మాత్రమే, రుజువులు లేవు. మానవాళిని పాపమనే చీకటిలో నుండి జీపవు వెలుగు లోనికి తీసుకొని రావడానికి "నిజమైన వెలుగు" శ్రమలు (గెత్సమనే) అను చీకటి నుండి, అన్యాయపు తీర్పుల (గబ్బతా) ద్వారా మరణము (గొల్గొతా) అను శిక్షను అనుభవించి, మరణమును జయించి, తిరిగి వెలుగైనాడు. ఇది అర్థము చేసుకోగలిగితే, ప్రతి విశ్వాసి వెలుగులో ఉండుటకు ప్రయత్నిస్తాడు.

యేసుక్రీస్తు దేవుని కుమారుడను సంగతి స్థిరపరచుటకు దేవుడు అన్యుడైన పిలాతును వాడుకున్నాడు, "యూదులరాజైన నజరేయుడగు యేసు అను పైవిలాసము వ్రాయించి సిలువమీద పెట్టించెను" (19:19). ఈ విలాసము హెబ్రీ, గ్రీకు, రోమా భాషలలో వ్రాయించెను గనుక పస్కా సందర్భములో అనేక ప్రాంతాల నుండి యెరూషలేముకు వచ్చిన యూదులనేకులు చదివారు. యూదులు ప్రధానయాజకులు యూదుల రాజని కాకుండా అతనట్లు చెప్పాడని వ్రాయించమని పిలాతుకు చెప్పినప్పుడు "నేను వ్రాసినదేమో వ్రాసితిననెను".

సైనికులు యేసయ్యను సిలువ వేసిన తర్వాత, ఆనాటి అలవాటు ప్రకారము సిలువ వేయబడిన వాని వస్త్రములు సైనికులు పంచుకుంటారు. ఆనాటి వస్త్రధారణలో ఒక పురుషుడు అయిదు భాగాలుగా వస్త్రాలు ధరించేవాడు. నాలుగు భాగాలైన

తలపాగా, పై వస్త్రము, లోన వస్త్రము, నడుముకు దట్టీ పంచుకొన్నారు కాని పై అంగీ మాత్రము కుట్టు లేకుండా పై నుండి క్రింది వరకు ఒకే బట్టతో చేయబడి ఉండినందున అది చింపకుండ దాని కొరకు చీట్లు వేశారు. కీర్తన 22:18లోని ప్రవచన ప్రకారము ఈ విధముగా జరిగిందని వారికి తెలియలేదు. పాపమనే చీకటిలో మ్రగ్గుచున్న వారి కొరకు తానే చీకటిగా చేయబడుటకు ముందడుగు వేసిన సృష్టికర్తకు ఎంత భయంకరమైన అవమానాలో కదా! ఒక మనిషిని దిగంబరునిగా చేసి, ఒక ఎత్తైన స్థలములో సిలువకు వ్రేలాడదీయుట, పైపెచ్చు ఆయన యూదుల రాజని పై విలాసము వ్రాసి ఉంచి, అందరికీ ప్రదర్శన బొమ్మగా ఉంచడము ఎంత ఘోరమైన, హృదయవిదారకమైన దృశ్యము. ఊహకందనంతటి హీనమైన దుశ్చర్య. ఈ ఘోరాతిఘోరమైన శిక్ష నా కొరకు, నీ కొరకు ఆయన భరించాడను సత్యము మనలో స్థిరపడితే ఇంకెప్పుడూ పాపము చేయజాలము.

అటువంటి భయంకరమైన పరిస్థితిలో తన చుట్టూ ఉన్న స్త్రీలలో తన తల్లిని కనుగొని, తన శిష్యులలో తన ప్రక్కన మిగిలిన ఒకే ఒక నమ్మకస్థుడైన యోహానుకు అప్పగించాడు. యోహాను ఆ మాటకు విధేయుడై మరియను తన ఇంట చేర్చుకొన్నాడు.

రక్షకుని మరణమునకుముందు సిలువలో ఏడుమాటలు మాట్లాడినట్లుగా మిగిలిన సువార్తలలో చూస్తున్నాము. యోహాను సువార్తీకుడు మూడు మాటలు మాత్రమే గ్రంథస్తము చేశాడు. తాను ధర్మశాస్త్రమును కొట్టి వేయుటకు కాదు గాని నెరవేర్చుటకే వచ్చి యున్నానని చెప్పిన యేసయ్య పది ఆజ్ఞలలో ఒకటైన తల్లిదండ్రులను ప్రేమించమని చెప్పబడిన ఆజ్ఞ తన తల్లిపట్ల నెరవేర్చాడని చెప్పగలము. రెండవమాట “నేను దప్పిగొనుచున్నాను” అను మాట ఆయన దైవకుమారుడైనప్పటికి సంపూర్ణ మానవత్వము కలిగియున్నాడని రుజువు చేస్తున్నది. ఈ మాట అనకముందు మూడుగంటల పాటు తండ్రి కలుగజేసిన చిమ్మచీకటి (Cosmic darkness) లో అపవాది ద్వారా మనకు ప్రత్యామ్నాయంగా నరక బాధలను అనుభవించాడు. ఆదికాండము 3:15లో తండ్రియైన దేవుడు మానవాళికిచ్చిన వాగ్దాన నెరవేర్పు జరిగింది. ఆయనకు ఆ సందర్భములో శారీరక దప్పికతో పాటు, ఆత్మల సంపాదన

అను దాహము కూడా ఉందని తెలుస్తుంది. చివరిమాట "సమాప్తమైనది" అని చెప్పిన మాట తండ్రి తన కప్పగించిన పనిని విజయవంతముగా ముగించానని తండ్రికి చెప్పుటను సూచిస్తుంది.

యేసయ్య ఈ లోకాన్ని విడిచి వెళ్లాక, ఈ లోకానికి వెలుగుగా ఉండాల్సిన మనమంతా ఆయన ఆజ్ఞలు పాటించాలనియు, ఆత్మల సంపాదకులుగా ఉండాలనియు, సకల లోకమునకు సువార్త ప్రకటించమని దేవుడు మనకు ఏర్పరచిన పనని ఆయన చిత్త ప్రకారము నెరవేర్చి సమాప్తమైనదని సంతోషముగా ఆయనను కలిసినపుడు చెప్పుటకు సిద్ధంగా ఉండాలని నేర్చుకోవాలి.

ఆయన సిలువలో ఉన్నప్పుడు మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు లోకమంతట చిమ్మచీకటి వ్యాపించెనని మిగిలిన సువార్తికులు వ్రాశారు గాని, యోహాను వెలుగును గురించి ప్రస్తావిస్తున్నందున చీకటి గురించి వ్రాయుటకు ఇష్టపడలేదేమో. Matthew Henry అను వ్యాఖ్యానకర్త ఈ మూడు గంటల చీకటిని గురించి ప్రస్తావిస్తూ ఈ విధంగా అన్నాడు : "వెలుగు ఈ లోకానికి వచ్చినప్పుడు ఆకాశములోని నక్షత్రాలన్నీ వెలుగుతో ఆహ్వానించాయి గాని, నిజమైన వెలుగు ఈ లోకము వదిలిపెట్టి వెళ్లిపోవు సమయాన అన్ని దీపాలు ఆరిపోయి చీకటి ఆవహించింది". ఆ చీకటి వలన మనకు వెలుగు వచ్చింది. ఆ చీకటిలోనే, పాపమనే చీకటిలో ఉన్న మనలను విమోచించి, వెలుగులోకి తెచ్చు ప్రక్రియ జరిగింది. మనకు బదులుగా చీకటి శక్తులతో యేసయ్య పోరాడి, శ్రమనొంది, నరకపు శ్రమలన్నీ అనుభవించాడు. నిజమైన వెలుగుగా మనమధ్యకొచ్చి తానే చీకటియై, చీకటితో పోరాడి మానవాళిని వెలుగులోకి తెచ్చాడు.

మరుసటి రోజు విశ్రాంతి దినము గనుక, పాతిపెట్టు కార్యక్రమము ఆనాడే జరగాలనే యోచనతో, ఆనాటి అలవాటు ప్రకారము ముందుగా ఇద్దరు దొంగల కాళ్లు విరగొట్టారు కాని యేసయ్య యొద్దకు వచ్చేసరికి ఆయనప్పటికే ప్రాణము విడిచి ఉన్నాడు. ఆయన "ఎముకలలో ఒకటైనను విరువబడదు" అను మాట కూడ

లేఖన నెరవేర్పు. యోహాను సువార్తీకుడు సిలువ చెంతనే ఉన్నాడు కాబట్టి చనిపోయిన యేసయ్యను పరీక్షించుట కొరకై ఒక సైనికుడు ఈటెతో ప్రక్కన పొడిచినపుడు రక్తము, నీరు కారుట చూశాడు కాబట్టి సాక్షిగా దానిని గురించి వ్రాశాడు. ఆయన జీవితములోను, శ్రమల్లోను, మరణ, పునరుత్థానములలోను ప్రతి విషయము లేఖనముల నెరవేర్పు అని సువార్తీకుడు చెప్పుట ద్వారా యేసయ్య దైవ కుమారుడని రుజువవుతున్నది. ఆ తర్వాత అరిమతయ యోసేపు పిలాతు సెలవడిగి ఆయన శరీరాన్ని ఎవడూ, ఎప్పుడూ ఉంచబడని క్రొత్త సమాధిలో ఉంచాడు. నీకొదేము కూడా బోళము, అగరు తెచ్చి శరీరమునకు పూసి, నార బట్టలు చుట్టి సమాధిలో పెట్టారు.

యేసుప్రభువు “తన సిలువను మోసికొని కపాల స్థలమను చోటికి వెళ్లెను” (19:17) అని వ్రాయబడి ఉంది. 13:1లో “తన వారిని ప్రేమించి” అని వ్రాయబడి ఉంది. తన వారి కొరకు తన సిలువను మోసాడు అని యోహాను సువార్తీకుడు మాత్రమే చెప్పాడు. ఆయన స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగా తనను తాను అప్పగించు కున్నాడను సత్యము స్థిరపరచుటకు ఈ మాట వ్రాశాడు.

20,21 అధ్యాయములలో యేసయ్య పునరుత్థానము, పునరుత్థానుడైన తరువాత నలువది దినములు ఈ లోకములోనే ఉంటూ, తన శిష్యులకు కనపడుతూ వారిని బలపరచుట గ్రంథస్తము చేయబడింది. మరణము అనేది పాపమునకు శిక్ష, అది చీకటితో పోల్చవచ్చు. మరణమును మనకు ప్రత్యామ్నాయంగా అనుభవించిన క్రీస్తు చీకటిలోనే ఉండిపోలేదు. మరణమును గెలిచి లేచిన యేసయ్య తిరిగి వెలుగులోకి వచ్చాడు. సిలువ యజ్ఞం ద్వారా యేసయ్య తనను తాను బలిపశువుగా అర్పించుకొని, దేవుని సన్నిధిలో ప్రధానయాజకునిగా మన పక్షాన అర్పించిన బలిని, దేవుడు అంగీకరించాడనుటకు గుర్తుగా ఆయన పునరుత్థానుడైనాడు.

# 7. వెలుగు సంబంధులు

"నిజమైన వెలుగు" అయిన యేసుక్రీస్తు ఈ లోకాన్ని వెలిగించడానికి వచ్చి, తన పని పూర్తి చేసుకొని తిరిగి పరలోకమునకు వెళ్లి పోయే తరుణంలో తనపై విశ్వాసముంచినవారు. రక్షణ మార్గములో వెళ్లువారందరు ఈ లోకములో వెలుగుగా ఉండాలని ఆశిస్తున్నాడు. పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలోని కొన్ని మాటలు ధ్యానించుకుందాము : ఎఫెసీ 5:8-10 వరకు ఉన్న వాక్య భాగములో "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువునందు వెలుగై యున్నారు. వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి, సత్యము అను వాటిలో కనబడుచున్నది. గనుక ప్రభువు కేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" అని వ్రాయబడి ఉన్నది. యోహాను 8:12లో యేసుప్రభువు "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండును" అని చెప్పాడు.

పౌలు చెప్పిన మాటలలో "పూర్వమందు చీకటియై యుంటిరి" అను మాటకు అర్థము బోధపడిందనుకుంటాను. యేసుప్రభువనే వెలుగును వెంబడించక మునుపు మనము చీకటియై యున్నాము. కాని ఇప్పుడైతే ఆయనదైన జీవపు వెలుగు కలిగి యున్నాము. కాబట్టి ఇక నుండి చీకటిలో నడువక వెలుగు సంబంధులుగా ఉండాలి. వెలుగు సంబంధులుగా ఉన్నామని రుజువు చేయాలంటే మనలో వెలుగు ఫలము కనపడాలి. చీకటిలో పోరాడి విజయము సాధించామనే సాక్ష్యము మన జీవితాల ద్వారా చూపించాలి. మంచితనము, నీతి, సత్యము అను వెలుగు ఫలము మనలో

కనపడితేనే మనము క్రీస్తనే వెలుగులో నడుస్తున్నామని అందరూ గ్రహిస్తారు. మంచితనము అంటే ప్రేమ కార్య రూపంలో చూపించుట; నీతి అంటే దేవుని ఎదుట, మనుష్యుల ఎదుట మన ప్రవర్తన యుక్తముగా ఉంచుకొనుట. ఇవి రెండు సత్యముపై ఆధారపడి ఉంటాయి. ఈ సత్యము దేవుని వాక్యముపైనను, దేవుని చిత్తము పైనను ఆధారపడి ఉంటుంది.

యేసుప్రభువు బోధలలో వెలుగు, చీకటిల గురించి చాలా విషయాలు చెప్పాడు. తన పరిచర్య ఆరంభంలోనే కొండమీద ప్రసంగములో "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి ఎదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16) అని చెప్పాడు. వెలుగు సంబంధులుగా నడచుట అంటే దేవుని కళ్లముందు ఏదీ దాచుకోకుండా జీవించుట. ఇహలోక పరంగా మనుష్యుల ఎదుట మన చెడును దాచుకొని వేషధారులుగా జీవించుట కొన్నిసార్లు వీలుపడుతుంది. ఎందుకంటే వారు మన మనసుల్లోకి తొంగి చూడలేరు కాని సార్వభౌముడు, సర్వజ్ఞాని అయిన మన యేసయ్య ఎదుట ఏదీ దాచలేము. "ఆయన దృష్టికి కనపడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క అప్పజెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా యున్నది" (హెబ్రీ 4:13). విశ్వాసులమైన మనమందరము కూడా మన జీవితాలను తెరచిన పుస్తకాలుగా ఉంచాలి. చీకటి పనులేమీ మన జీవితాలలో ఉండకూడదు, వెలుగు చీకటి సహజీవనము చేయలేవు. చీకటి సంబంధమైన ఏది మనలో ఉన్నను, పరిశుద్ధాత్మ దేవుడు మనలో ఉండుటకు ఇష్టపడడు. ఆయన సహాయము లేకుంటే వెలుగు సంబంధులుగా ఉండలేము, యేసయ్యతో అంటు కట్టబడి ఉండలేము, దాని ఫలితము నరకములో వేయబడుతాము.

వెలుగు సంబంధులుగా నుడుస్తూ మన జీవితాలలో వెలుగు ఫలము కనపడాలంటే దేవుని వెలుగు మన అనుదిన జీవితాలలో ప్రత్యక్ష పరచబడాలి. మన గుణలక్షణాలు, ప్రవర్తన ద్వారా ఈ చీకటి ప్రపంచములోకి దేవుని వెలుగును

తేవాలి. దేవుని వెలుగుగా ఉంటూ చీకటిలో ఉన్నవారికి క్రీస్తు యొద్దకు వెళ్లు మార్గము చూపాలి. ప్రభువు మన ద్వారా తన వెలుగును ప్రకాశింప చేయుటకై తన ఆశ్చర్యకరమైన వెలుగులోకి మనలను పిలిచాడు. మన ద్వారా ఆయన మహిమను ప్రజలకు చూపించాలని ఆయన ఆశ. మత్తయి 5:14,16లో "మీరు లోకమునకు వెలుగై యున్నారు; కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు గాని అది యింట నుండు వారికందరికి వెలుగిచ్చుటకు దీపస్తంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి ఎదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని యేసయ్య చెప్పాడు. చివరి వాక్యములో ఒక ఆదేశాన్ని చూస్తున్నాము. మన ప్రవర్తన ద్వారా, మన క్రియల ద్వారా క్రైస్తవ్యమును ప్రజలకు చూపించాలి. తద్వారా తండ్రియైన దేవుడు మహిమ పరచబడాలి.

మనలోని వెలుగు ఫలము ద్వారా మనము వెలుగు సంబంధులమని ఇతరులు తెలుసుకుంటారు కాబట్టి ఈ ఫలము గురించి మనము తెలుసుకోవలసిన అవసరముంది. మంచితనము, నీతి, సత్యము – ఈ మూడు లక్షణాలు కలిపి వెలుగు ఫలము. మనకు వీటి అర్థము తెలిసి ఉన్నా కూడా కొన్ని ఉదాహరణలతో, వాక్యాధారములతో ధ్యానించుకుంటే మనలో స్థిరపడుతాయి కాబట్టి వాటిని గురించి ధ్యానించుకుందాము:

## 1. మంచితనము :

ఆదికాండము 2:9లో దేవుడు "మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేల నుండి మొలిపించెను" అని వ్రాయబడి ఉంది. దేవుడు ఆదామును సృష్టించి, అతను నివాసము చేయుటకు ఏర్పరచిన తోటలో మంచి చెడ్డలు తెలిపే చెట్టును నాటాడు, దాని ఫలము తినవద్దని చెప్పాడు. ఆజ్ఞాతి క్రమము చేసి పండును తిన్న ఆదాము హవ్వలకు మంచి, చెడుల గురించిన జ్ఞానము వచ్చింది, పాపముతో పాటు ఈ జ్ఞానము కూడా మనకు సంక్రమించింది. సామాన్యముగా చెప్పుకోవాలంటే దేవుడు, దేవుణ్ణి ప్రేమించి ఆయనతో నడిచేవారు చేసే పని అంతా మంచిదని; అపవాది, అపవాదిని వెంబడించే వారు చేసే పని అంతా చెడ్డదని చెప్పవచ్చు.

నిర్గమ కాండము 33:18,19లో మోషే దేవునితో ఆయన మహిమను తనకు చూపమని అడిగినప్పుడు దేవుడు మోషేతో – “నా మంచితనమంతయు నీ ఎదుట కనబరచెదను” అన్నాడు, అంటే మంచితనము మహిమతో పోల్చబడుచున్నది. యోహాను సువార్తికుడు దేవుని మహిమే వెలుగు, ఆ వెలుగే యేసయ్య అని చెప్పాడు. యేసయ్యను కలిగి యుంటే తానంతట అదే మంచితనము మనలోకి వస్తుందని చెప్పవచ్చును.

ఒక రోగికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సహాయపడినట్లుగా పాపమనే చీకటిలో ఉన్నవారిని దేవుని అద్భుత వెలుగులోనికి వెలుగు సంబంధులమైన మనము నడిపించవచ్చును. ఇదే మంచితనమను ఫలము. ఒక ఉదాహరణగా మధర్‌థెరిసాను చూడవచ్చును. ఆమె జీవితంలో వెలుగు ఫలము అద్భుతంగా కనపరచబడింది. పరాయి దేశము నుండి వచ్చిన ఆమె ప్రభువు నీతిని ధరించి, బైబిలు సత్యములో నడుస్తూ మంచితనాన్ని కనపరచింది. ఆమె చదివిన ఒకే ఒక పుస్తకము బైబిలు; ఆమె దయ చూపించిన ప్రతి కుష్ఠురోగిలోను, అనాథలోను ప్రభువును చూసింది. క్రీస్తు పట్ల తన ప్రేమను క్రియా రూపకంగా చూపింది. ఇలాంటి వెలుగు ఫలము మన జీవితంలో కనబడినపుడు మన దేవుడు మహిమపరచబడి, మనము వెలుగు సంబంధులుగా గుర్తించబడుతాము.

సంఖ్యాకాండము 14:24లో “నా సేవకుడైన కాలేబు మంచి మనస్సు కలిగి పూర్ణమనస్సుతో నన్ను అనుసరించిన హేతువు చేత అతడు పోయిన దేశములో అతని ప్రవేశపెట్టెదను” అని దేవుడు స్వయంగా అన్నాడు. పూర్ణమనస్సుతో దేవుని అనుసరించుట మంచితనమని మనము తెలుసుకోవాలి. దేవుని చిత్తానుసారముగా నడిచినపుడు దేవుడు ఆశీర్వదిస్తాడు. “హనోకు దేవునితో నడిచెను” (ఆది 5:24); “నోవాహు యెహోవా దృష్టియందు కృపపొందినవాడాయెను” (ఆది 6:8); అబ్రాహాము విశ్వాసులకు తండ్రి; మోషే దేవుని ఇల్లంతటిలో సాత్వికుడు – ఈ విధముగా బైబిలులో అనేకులు మంచివారున్నారు. దేవునికి ఇష్టమైన రీతిలో జీవించారు, “ఈ స్త్రీ నా విషయమై మంచి కార్యము చేసెను” (మార్కు 14:6) అని

ప్రభువు మరియ గురించి చెప్పాడు. ఆమె చేసిన పని ద్వారా దేవుడు మహిమ పరచబడ్డాడు. దేవుని ఆరాధించే విధానము లోకానికి నేర్పిన కారణాన ఆమెచేసిన పని మంచి కార్యమైంది.

దేవుని వెలుగుగా ఉండాల్సిన మనము చేసే ప్రతి పని, ప్రతి మాట మంచితనముతో కూడినదై ఉండాలి. దేవుడు తన ప్రేమను క్రియా రూపకంగా చూపాడు, వెలుగు సంబంధులమైన మనము కూడా చెప్పుట మాత్రమే గాక చేసి చూపించాలి.

## 2. నీతి :

'నీతి'కి, 'మంచి'కి చాలా దగ్గర సంబంధముంది. మంచి తనముతో చేసేప్రతి పని నీతిననుసరించే ఉంటుంది.

ద్వితీ 6:25లో "మన దేవుడైన యెహోవా మనకాజ్ఞాపించినట్లు ఆయన సన్నిధిని ఈ సమస్తమైన ఆజ్ఞలను అనుసరించి మనము నడుచుకొనునప్పుడు మనకు నీతి కలుగును" అని వ్రాయబడి ఉంది. ఆదికాండము 15:6లో "అతడు యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను" అని అబ్రాహాము గురించి వ్రాయబడి ఉంది. దేవుడు అబ్రాహామును ఎన్నుకొని తన దేశాన్ని, ఇంటిని వదిలిపెట్టి రమ్మని చెప్పినప్పుడు మారుమాట్లాడకుండా బయలుదేరి వచ్చాడు. 75 సంవత్సరాల ప్రాయములో తాను, తన భార్య శారీరకంగా మృతతుల్యులైనప్పటికీ, వారికి వారసుడు పుడతాడని దేవుడు చెప్పినప్పుడు కూడా నమ్మాడు. ఆ నమ్మకమే అతనికి నీతిగా అయింది. దేవుడు చెప్పినట్లు నడుచుకోవడమే నీతి అని ఈ సందర్భముగా తెలుసుకోవాలి. "నీతి మరణము నుండి రక్షించును" (సామెతలు 10:2) అని వ్రాయబడి ఉంది. నీతి మార్గము పరలోకమునకు దారితీస్తుందనియు, రెండవ మరణము నుండి తప్పిస్తుందనియు తెలుసుకోవాలి.

యేసుప్రభువు వెలుగులో నడుస్తున్న వెలుగు సంబంధులకు నీతివస్త్రము కప్పబడుతుంది. మన నీతి దేవుని ఎదుట మురికి గుడ్డల వంటిది. "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు" (మత్తయి 5:6) అని ప్రభువు స్వయంగా

చెప్పాడు. నీతిమంతులు ఏ విధముగా ఆశీర్వదింపబడుతారు అను విషయాలు లేఖనములలో అనేకములున్నాయి. కొన్నింటిని మీ ముందుంచుచున్నాను.

"యెహోవా దృష్టి నీతిమంతుల మీద నున్నది" (కీర్తన 34:15);

"నీతిమంతులకు యెహోవాయే సంరక్షకుడు" (కీర్తన 37:17);

"యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు" (కీర్తన 146:8);

"నీతిమంతులు ఆశించినది వారికి దొరుకును" (సామె. 10:24);

"నీతిమంతులను ఆయన ఎన్నడు కదలనియ్యడు" (కీర్తన 55:22)

"నీతిమంతులు దాక్షిణ్యము కలిగి ధర్మమిత్తురు" (కీర్తన 37:21);

"నీతిమంతులు సూర్యునివలె తేజరిల్లుదురు" (మత్తయి 13:43)

పైనున్న ఆశీర్వాదాలు చదివినపుడు ఇవన్నీ పొందుకోవడానికి మనము నీతిమంతులముగా ఉండాలనే ఆశ మీకు కలగడము లేదా? వెలుగు సంబంధులగుటకు ప్రయత్నిస్తున్న మనకు చివరి ఆశీర్వాదము బాగా ప్రోత్సహిస్తుంది. ఆయన వెలుగులో మనము సూర్యునివలె వెలుగుతామని బైబిలు చెపుతుంది.

వెలుగు దేవుని ప్రత్యక్ష పరుస్తుంది, ఫలము నిస్తుంది. అంతేకాక వెలుగు మనలోని తప్పును కూడా ఎత్తి చూపిస్తుంది. అందుకే రక్షింపబడని వ్యక్తి దేవుని దగ్గరకు కాని, వాక్యము దగ్గరకు కాని రాడు. వస్తే దేవుని వెలుగులో వాని వ్యక్తిత్వము, తప్పులు బయలు పరచబడుతాయి. అదివాడికిష్టముండదు. "నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చి యున్నాను" (యోహాను 12:14) అని ప్రభువు స్వయంగా చెప్పాడు. ఆయన ఈ లోకములో ఉన్నప్పుడు ఆయన నీతి, ఆయన స్వభావము, యధార్థత ద్వారా ఆయన చుట్టూ ఉన్న మనుష్యుల పాపస్థితి ప్రత్యక్షపరచబడింది. అందుకే పరిసయ్యులు, శాస్త్రులు మత పెద్దలందరు ఆయనను అంతమొందించాలని ఆది నుండే ప్రయత్నించారు. యేసుప్రభువు వారిని గురించి చెప్తూ "నేను వచ్చి వారికి బోధింప కుండిన యెడల వారికి పాపము లేకపోవును; ఇప్పుడైతే వారి పాపమునకు మిషలేదు" (యోహాను 15:22) అన్నాడు. వెలుగు రాకపోతే చీకటిలో ఏ దోషమూ

కనపడదు. యేసుప్రభువు వారి మధ్యకు రాకమునుపు వారంతా 'స్వనీతి' అను చీకటిలో ఉన్నందున వారి తప్పులు వారికి కనపడలేదు. యేసుప్రభువు వారి వేషధారణ గురించి చెప్పడము వలన వారికి కోపము వచ్చింది. అపవాది వారికి ఆత్మీయ గుడ్డితనము కలుగజేసినందున యేసయ్య వెలుగులోకి రాలేకపోయారు. మనమంతా మనలోని చీకటి సంబంధమైన వాటిని తొలగించి, వెలుగు సంబంధులుగా ఉంటే మనలోని వెలుగు ద్వారా చీకటిలో ఉన్నవారి లోపాలు స్పష్టంగా కనపడుతాయి. అట్టివారిని వెలుగులోకి నడిపించి, వెలుగును ప్రేమించే వారిగా చేయాలి.

### 3. సత్యము :

యోహాను సువార్తికుడు "నేనే సత్యము" అని చెప్పిన ప్రభువును గురించి ఆయన దైవత్వము గురించి అనేక విషయాలు చెప్పాడు. ఆరంభములోనే వాక్యము, నిజమైన వెలుగు అయిన యేసుక్రీస్తు ప్రభువు "కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" (1:14) అనియు, "కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (1:17) అనియు సత్యము గురించి పరిచయం చేశాడు. ఇంతకు ముందు మనము ధ్యానించుకున్న మంచితనము, నీతి, సత్యముపైననే ఆధారపడి యున్నాయి. యోహాను 3:21లో "సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడి యున్నవని ప్రత్యక్షపరచబడునట్లు వెలుగు నొద్దకు వచ్చును" అని వ్రాయబడి ఉంది. వెలుగు ఫలమైన మంచితనము, నీతి, సత్యము కలవాడు వెలుగు సంబంధి కాబట్టి వెలుగునొద్దకు వచ్చుటకు వెనుకాడక సంతోషంగా వస్తాడు – తండ్రి యొద్దకు కుమారుడు వచ్చినంత ధైర్యముగా వస్తాడు. "సత్యము మనలను స్వతంత్రులను చేస్తుంది" (8:32) కాబట్టి సత్యము తెలుసున్నవాడు ఏ దానికీ భయపడకుండా వెలుగులో నడుస్తూ తొట్రిల్లకుండా ఇతరులను నడిపించుటకు వెళ్లగలడు.

ఎఫెసీ 4:15 లో పౌలు ఎఫెసు సంఘముతో మాట్లాడుతూ "ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము" అన్నాడు. క్రీస్తువలె ఉండాలంటే ముఖ్యమైనది ప్రేమ. ఆ ప్రేమ ద్వారా ఆత్మ ఫలముగాని, వెలుగు ఫలము గాని మనలో అభివృద్ధి పొందుతాయి. యాకోబు 5:19,20లో యాకోబు ఇచ్చిన సలహా, "నా సహోదరులారా, మీలో ఎవడైనను

సత్యము నుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించిన యెడల, పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్లించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను". వెలుగు సంబంధులు హెచ్చరించే వారిగా కూడా ఉండాలి.

యోహాను 10:10లో ప్రభువు అపవాదిని గురించి చెప్తూ అతడు దొంగతనము, హత్య, నాశనము అను మూడు పనులు చేయుటకు వస్తాడని చెప్పాడు. అయితే యేసుప్రభువు రెండవ రాకడ సమయములో ఈ మూడు పనులు చేస్తాడు. ఇదేమిటి, దైవదూషణ చేస్తున్నాననుకుంటున్నారు కదూ. ఆ అభిప్రాయానికి రాకముందు నేను చెప్పుసంగతి చదవండి. యేసయ్య యూదా సింహముగా రెండవ రాకడలో వచ్చినప్పుడు దొంగవలె వస్తాడు (ప్రకటన 3:3; 16:16). ప్రశస్తమైనవి తీసుకెళ్తాడు. ప్రశస్తమైన తన రక్తముతో కొన్న సంఘము ఆయనకు చాలా విలువైనది కాబట్టి రెండవ రాకడలో మొదటి భాగంగా తన సంఘాన్ని తీసుకుపోతాడు. ఆయన ఎప్పుడు వస్తాడో తెలియదు. అపవాది హత్య చేస్తాడని చదివాము కదూ. ఆ హంతకుణ్ణి యేసయ్య హత్య చేస్తాడు (ప్రకటన 20:10) మూడవదిగా నాశనము చేయుట – ప్రభువు ఈ పాప భూయిష్టమైన లోకమును నాశనము చేస్తాడు (2పేతురు 3:12) కాబట్టి మనము లోకమును హెచ్చరించాలి.

మన చుట్టూ ఉన్న చీకటిని పారద్రోలమని దేవుడు మనకు పిలుపునిస్తున్నాడు. దీనికి ప్రభువే మన మాదిరి. ఈ లోకంలో జీవించిన వ్యక్తులలో అత్యంత ప్రభావితమైన జీవితము జీవించిన నాయకుడు యేసుప్రభువు. మనము కూడా వెలుగు సంబంధులుగా ఉంటే మన చుట్టు ప్రక్కల వారు మన మంచితనము, నీతి, యథార్థతను చూసి "నిజమైన వెలుగు" నొద్దకు వస్తారు. మనము ఎక్కడున్నామో అక్కడ – ఆఫీసు, పాఠశాల, షాపు, సంత – ఎక్కడైనా సరే – పరలోక రాజ్యాన్ని దింపాలి. జన సంద్రములో కలిసిపోకుండా వేరుగా ఉండాలి. యాకోబు చెప్పినట్లుగా ఇహలోకంలో ఉంటూ, ఇహలోక మాలిన్యము అంటుకోకుండా ఉండుట, విధవరాండ్రను, అనాథలను ఆదరించుట నిజమైన భక్తి (యాకోబు 1:27). భ=వెలుగు; క్తి=కూడి ఉండుట అనే అర్థాలు కూడ ఉన్నాయి. వెలుగుతో కూడి

ఉండుటే భక్తి అని అర్థము. ఇహలోకముతో కాక నిజమైన వెలుగుతో అంటుకట్టబడి యుండుటే భక్తి అని తెలుసుకోవాలి.

ఈ మధ్య జరిగిన ఒక ఉదంతము మీకు చెప్పాలని తలంపు కలుగుచున్నది. ఒక విమానంలో మొదటి తరగతిలో ప్రయాణము చేస్తున్న ఒక మంచి క్రైస్తవ వ్యక్తి యొద్దకు అక్కడున్న ఎయిర్‌హోస్టెస్ ఉచితముగా ప్రయాణీకులకు ఇచ్చే మత్తు పానీయాలు తెచ్చినప్పుడు అతను మర్యాదగా తిరస్కరించాడు. ఆమె వెళ్లిపోయి, ఈ సారి ఒక మంచి ట్రేలో పెట్టుకొని వచ్చి ఇచ్చినను అతను తీసుకోకపోతే ఆమె వెళ్లి మేనేజరుకు చెప్పింది. ఆయన ఈసారి ఇంకా కొన్ని అలంకరణలతో ఆ ట్రేని నింపి తెచ్చాడు. అయినా అతను తీసుకోకపోయేసరికి, ఆ మేనేజర్ "సార్, మా ఆతిధ్యములో ఏమైనా లోపముందా? ఇది అందరికి మేము ఇచ్చే ప్రేమ పూర్వక పానీయము, దయచేసి తీసుకొండి" అని బ్రతిమాలినా తీసుకోకపోగా "ఈ పానీయము తీసుకెళ్లి విమానము నడిపే పైలట్‌కు ఇవ్వండి" అనగానే ఆ మేనేజరు "పైలట్ విధి నిర్వహణలో ఉన్నప్పుడు మత్తు పానీయములు తీసుకుంటే విమానము కూలిపోయే ప్రమాదము ఉందికదా, ఆయనకెలా ఇస్తాను?" అన్నాడు. ఆ క్రైస్తవ ప్రయాణీకుడు కన్నీటితో ఇలా అన్నాడు, "నేను ఒక క్రైస్తవుణ్ణి, నా విశ్వాసము కాపాడుకొనుటకై నేను సదా విధి నిర్వహణలోనే ఉంటాను. నేను మత్తుపానీయము త్రాగితే నా ప్రస్తుత జీవితముతో బాటు నిత్యత్వములోని నా జీవితము కూడా ఈ విమానము లాగానే కూలిపోతుంది. "I am 100% on duty" అన్నాడు.

నీ జీవితములో మత్తుపానీయము కాకపోవచ్చు, యోసేపు ఎదుర్కొన్న జారత్వమనే శోధన కావచ్చు, నీ కోపము నిగ్రహించుకోలేక పోవడము కావచ్చు, ముసలమ్మ కబుర్లు, నీ వేషధారణ, ఇతరుల పట్ల నీ ప్రవర్తన, వైఖరి కావచ్చు, దేవుని వాక్యము పంచుకోలేక పోవుట కావచ్చు. వీటిలో ఏదైనా నీవు వెలుగు సంబంధిగా ఉండుటకు ఆటంకమే అవుతుంది.

దేవుని వెలుగు మన నుండి ఇతరులకు ప్రసరించబడాలంటే ముందుగా మనము వెలిగించబడాలి. ఎవరు వెలిగించబడినవారు అను ప్రశ్నకు సమాధానము తెలిసి ఉండాలి. సహజ వెలుగునకు, చీకటికి వ్యత్యాసం ఉన్నట్లే విశ్వాసులకు,

అవిశ్వాసులకు తేడాలు ఉండాలి. వారి నైతికత, వైఖరి, క్రియలలో తేడాలు కనపడాలి. ఈ చీకటి ప్రపంచములో ప్రతి విశ్వాసీ ఒక దీపముగా ఉండి ఆ వెలుగు తన వ్యక్తిత్వములో ఒక భాగమై పోవాలి. ఒక విశ్వాసికి, అవిశ్వాసికి ఉన్న ప్రాధమిక తేడా ఏమంటే విశ్వాసి వాక్యాన్ని నమ్మి స్పందిస్తున్నాడు, అవిశ్వాసి స్పందించడము లేదు. పౌలు 2కొరింథీ 4:6లో చెప్పిన ఒక విషయము చదువుకుందాము. "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడి పరచుటకు మా హృదయములో ప్రకాశించెను. గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుట లేదుగాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము" మనము నిజమైన వెలుగును గ్రహించి వెలుగు సంబంధులుగా ఉండాలనుకున్నప్పుడు ఆ వెలుగును గురించి ప్రకటించ కుండా ఉండలేము. ఆ వెలుగు మనలో నుండి ఇతరులకు ప్రసరించి, వారిని కూడా వెలిగించుటకు ఆతురత పడుతూ మనలను బలవంతము చేస్తుంది. ఇది పౌలు అనుభవ పూర్వకముగా చెప్పిన సత్యము. వెలిగింపబడిన వారు ఎవరు అంటే వెలుగుఫలము వారి జీవితాలలో కనపడ జేయువారు.

లేఖనములలోని కొన్ని వచనములు మీముందుంచుచున్నాను.

1యోహాను 2:9,10 – "వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు, తన సహోదరుని ద్వేషించువాడు ఇప్పటి వరకును చీకటిలోనే యున్నాడు. తన సహోదరుని ప్రేమించువాడు వెలుగులో ఉన్నవాడు" సహోదరుని ప్రేమించువాడు మంచితనము చూపిస్తున్నాడు. 1పేతురు 4:9,10లో "సణుగుకొనకుండ ఒకనికి ఒకడు ఆతిథ్యము చేయుడి. దేవుని నానావిధమైన కృప విషయమై మంచి గృహ నిర్వాహకులై యుండి, యొక్కొకడు కృపావరము పొందిన కొలది యొకని నొకడు ఉపచారము చేయుడి". యాకోబు 2:15,16–"సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నప్పుడు, మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటికి ఇయ్యక – సమాధానముగా వెళ్లుడి, చలి కాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము?".

అవసరములో ఉన్నవారిని ఆదుకొని, క్రియారూపకమైన ప్రేమ చూపుటయే మంచితనము.

కీర్తన 97:11 “నీతిమంతుల కొరకు వెలుగు విత్తబడి యున్నది”, నీతిమంతుల కొరకు దేవుడు అనేక ఆశీర్వాదాలు దాచి యుంచాడు. నీతి, న్యాయము కరువవుతున్న ఈ రోజుల్లో వెలుగు సంబంధులు దీపస్తంభముపై పెట్టబడిన దీపమువలె వెలగాలి. ఒక ఆఫీసులో ఉద్యోగం నిమిత్తము వచ్చిన ఒక విశ్వాసికి అన్నింటిలో మంచి మార్కులు వచ్చాయి కాని ఇంగ్లీషులో చాలా తక్కువ వచ్చినందువలన, అందరికంటే ఇంటర్వ్యూలో బాగా చేసినా కూడా ఇంటర్వ్యూ చేసిన అధికారులు ఏమి చేయాలో నిర్ణయించుకోలేక పోయారు. చివరకు ఆ విశ్వాసి పరిస్థితుల దృష్ట్యా పరిగణలోకి తీసుకుందామని అనుకుంటున్న సమయంలో అందరికంటే ఉన్నత స్థలములో ఉన్న అధికారి మంచి క్రైస్తవుడైనందున రాజీపడుటకు ఒప్పుకోలేదు. కాని ఆ విశ్వాసి పరిస్థితులను బట్టి అతని కొరకు మనసులో ప్రార్థించి దేవునికి అప్పగించాడు. అతని నీతిగల ప్రార్థన ఆలకించిన దేవుడు “ఇంగ్లీషు మార్కులు చూడనవసరము లేదు” అని యజమానులు ప్రకటించేటట్లు చేశాడు. ఆ పరిస్థితిలో మనముంటే ఏమి చేసేవారము? మిగిలిన వారికి లేని అభ్యంతరము మనకెందుకు, పైపెచ్చు ఆ విశ్వాసికి ఆ ఉద్యోగానికి కావలసిన మిగిలిన అర్హతలున్నాయి గదా అనుకునేవారము. వెలుగు సంబంధులుగా ఉంటే దేవుడు మనకు తప్పక సహాయపడతాడు, ఎందులోనూ దేవునికి విరుద్ధంగా రాజీపడాల్సిన అవసరముండదు,

కీర్తన 112:4లో “యథార్థవంతులకు చీకటిలో వెలుగు పుట్టును” అని కీర్తనాకారుడు అంటున్నాడు. వెలుగు ఫలములోని సత్యములో స్థిరంగా ఉండే వాడిని యథార్థవంతుడు అంటారు. ఆ విధంగా ఉండుట ఈ లోక ప్రస్తుత పరిస్థితులలో చాలా కష్టము కాని దావీదు 15వ కీర్తనలో యథార్థత గురించి అద్భుతంగా వ్రాశాడు కాబట్టి మనమందరము చదవాలని నా కోరిక...

*"యెహోవా, నీ గుడారములో అతిథిగా ఉండదగిన వాడెవడు?*
*నీ పరిశుద్ధ పర్వతము మీద నివసింపదగిన వాడెవడు?*
*యథార్థమైన ప్రవర్తన గలిగి నీతిననుసరించుచు*
*హృదయపూర్వకముగా నిజము పలుకువాడే.*
*అట్టివాడు నాలుకతో కొండెములాడడు, తన చెలికానికి కీడు చేయడు,*
*తన పొరుగువాని మీద నింద మోపడు,*
*అతని దృష్టికి నీచుడు అసహ్యుడు,*
*అతడు యెహోవా యందు భయభక్తులు గలవారిని సన్మానించును,*
*అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు,*
*తన ద్రవ్యమును వడ్డికియ్యడు,*
*నిరపరాధిని చెరుపుటకై లంచము పుచ్చుకొనడు,*
*ఈ ప్రకారము చేయువాడు ఎన్నడును కదల్చబడడు".*

యేసుప్రభువు ఈ లోకానికి రావడము వలన పాపమనే చీకటిలో ఉన్న పాపి జీవితంలో ఉషోదయం కలిగింది. ఆయన వెలుగులో నడిస్తే వెలుగు సంబంధులు (వెలుగు కుమారులు) అవుతామని వ్రాయబడి ఉంది. ఒక దీపము వెలుగు విరజిమ్మాలంటే తనను తాను కనపరచుకోవాలి. పగలుగాని, రాత్రిగాని కొండ మీది పట్టణము అందరికీ కనపడుతుంది. పగలైతే ఇళ్లు, భవనాలు కనపడతాయి. రాత్రిపూట ఆ యిళ్లలోని దీపాలు కనపడుతాయి. అదే విధంగా వెలుగు సంబంధులు పగలనక, రాత్రనక నిజమైన వెలుగును, విస్తరింపచేస్తూ ఉండాలి. వాక్యమనే వెలుగులో ఇతరులను నడిపించాలి.

వెలుగు సంబంధులుగా ఉండాలనుకునే విశ్వాసులకు బైబిలు కొన్ని విధులను కూడా బోధిస్తున్నది. దివారాత్రులు ఆయన వాక్యము ధ్యానిస్తూ ఆరాధిస్తూ ఉండాలి; ఎల్లవేళలా సత్క్రియలు చేయాలి; మన మాటలు, క్రియలు దేవునిని మహిమపరచేవిగా ఉండాలి; నిరంతరమూ ఇహలోక సంబంధమైన దురాత్మలతో పోరాడుటకు దేవుడిచ్చిన సర్వాంగ కవచమును ధరించాలి. కొలస్సీ 3:10లో పౌలు చెప్పినట్లు "ప్రాచీన స్వభావమును (చీకటి జీవితమును) దాని క్రియలతో కూడ

మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొని యున్నారు" కాబట్టి ఇక ముందు వెలుగు సంబంధులైన మనము పరలోక సంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనవలెను. ఈ లోకములో జనుల మధ్య జీవవాక్యము బోధిస్తూ సాక్షులముగా నిలవాలి. ఇలాంటి జీవితము జీవిస్తూ ప్రభువు రెండవ రాకడ కొరకు మనలను మనము సిద్ధపరచుకొని ఇతరులను సిద్ధపరచుటలో సహకరించాలి.

సాధారణముగా వెలుగు సంబంధులకు వచ్చే పోరాటములో ఎదుర్కొనే శత్రువులు ముగ్గురు - లోకము, శరీరము, అపవాది. లోకములో ఉన్నదంతా శరీరాశ, నేత్రాశ, జీవపు డంబము (1యోహాను 2:15-17); శరీరము అంటే ఆదాము కాలము నాటి నుండి మారిన మానవ స్వభావము; అపవాదిని ఎదుర్కొనుటకు దేవుడు మనకు సర్వాంగ కవచము ఇచ్చాడు (ఎఫెసీ 6:10-17). గర్జించు సింహము వలె మనలను మింగాలని ప్రయత్నిస్తున్న అపవాది సంబంధ మైనవేవీ మనలో ఉండకూడదు.

వెలుగు సంబంధులుగా ఉండాలి, నిజమైన వెలుగు యొక్క వెలుగును లోకములో ప్రసరింప జేయాలనుకున్నవారు దావీదు లాగా "యెహోవా, నీవు నాకు దీపమై యున్నావు, యెహోవా చీకటిని నాకు వెలుగుగా చేయును" (2సమూ. 22:29) అని సంతోషంగా, నిశ్చింతగా పాడుకోవచ్చును. వెలుగు సంబంధులుగా మంచితనము, నీతి, సత్యముతో జీవించుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయము చేయును గాక, ఆమేన్!

★ ★ ★



ఆంధ్రరాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మక కుటుంబంలో జన్మించి, కేవలం దేవుని రాజ్య విస్తరణ కొరకై అహర్నిశలు శ్రమిస్తున్న మాతృ సమానులు, సన్మాన పాత్రులైన శ్రీమతి డా॥ బి.విమలారెడ్డి గారి పరిచర్య ఎంతో ఆదర్శప్రాయమైనది. వీరు ప్రభువు యొక్క మహాకృపను బట్టి ప్రభువు చేత పిలువబడి, ప్రత్యేకించబడి అనతికాలంలోనే B.D., M.Th. (O.T), M.Th. (N.T), M.A. (Christian Studies), మొదలగు థియోలజికల్ కోర్సులు విజయవంతంగా పూర్తిచేసారు. పలు జాతీయ, అంతర్జాతీయ సెమినరీలలో పాల్గొని, వాక్య కేంద్రిత క్రీస్తును, క్రీస్తు కేంద్రిత భక్తిని బోధిస్తూ అహర్నిశలు దేవుని సేవలో కొనసాగుతున్నారు.

"మరియ" వలె ప్రభువు పాదాల చెంత ఉత్తమమైనవి నేర్చుకొనుచు, "సమరయ స్త్రీ" వలె పట్టణాలలో, పల్లెల్లో ప్రభువును గూర్చి సాక్ష్యమిస్తూ, "దోర్కా" వలె సత్క్రియలచేత అలంకరించు కుంటూ, "ఘనురాలైన షూనేమీయురాలు" వలె దైవజనులకు ఆతిథ్యమిస్తూ, "దెబోరా" వలె మంచి నాయకురాలుగా కొనసాగుతూ, "అన్న" వలె దేవుని సేవిస్తూ, "ఎలిజబెత్" వలె భయభక్తులు కలిగి జీవిస్తూ విశ్వాసంతో ముందుకు కొనసాగుతున్న ఈ భక్తురాలి కలమునుండి సంఘ క్షేమాభివృద్ధికై మరిన్ని రచనలు, విలువైన సందేశములు వెలువడును గాక!

పరిశుద్ధాత్మ దేవుని ఆదేశానుసారం సార్వత్రిక క్రైస్తవ సంఘ క్షేమాభివృద్ధికై **"ఆత్మీయ సందేశాలు"** మొదటి భాగము, రెండవ భాగము, **"నీతి సూర్యుని వేకువ చుక్క"** (బాపిస్మమిచ్చు యోహాను), **"సంపూర్ణ దైవప్రణాళిక"** (రోమా పత్రిక సులభశైలిలో), **"రక్షణ సువార్త"** మొదలైన ఆశీర్వాదకరమైన గ్రంథములు వీరి కలం నుండి ప్రచురించబడ్డాయి. ప్రార్థన పూర్వకంగా చదివి, దేవునికి ప్రీతికరమైన సంపూర్ణ భక్తిలో కొనసాగాలని మా మనవి.

ప్రార్థనా పూర్వకంగా ఈ పుస్తక పఠన ప్రారంభించండి!

For Details & Copies : **Bro. K. Vijaya Kumar**
Cell : 92473 65330, 98668 45060 * email : bvrhome@gmail.com